సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 167

శుక్రవారం 3-3-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'




'లయన్' పంజా..

8 వికెట్లతో టీమిండియాను కుప్పకూల్చిన ఆస్ట్రేలియా స్పిన్నర్ - 13లో



అర్షద్‌వార్సీపై సెబీ నిషేధం

మరో 44 మంది వ్యక్తులు సంస్థలకు షాక్ - 13లో



'అదానీ'పై సుప్రీం నిపుణుల కమిటీ

అదానీ–హిండెన్‌బర్గ్‌పై విచారణ జరిపేందుకు, మదుపర్ల ప్రయోజనాలను కాపాడేందుకు సుప్రీంకోర్టు ఓ కమిటీని నియమించింది.

వివరాలు 6లో ▸



'హథ్రాస్' కేసులో జీవిత ఖైదు

యూపీలోని హథ్రాస్‌లో దళిత యువతిపై అత్యాచారం, హత్య కేసులో ప్రధాన నిందితుడు సందీప్‌కు కోర్టు జీవిత ఖైదు విధించింది.

వివరాలు 6లో ▸



ఏకాభిప్రాయం సాధిద్దాం

మనల్ని విభజించే వాటిపై కాకుండా.. కలిసి పరిష్కరించే వాటిపై దృష్టి పెడదామని విదేశాంగ మంత్రుల భేటీలో ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



సరిహద్దులో శాంతిపైనే చర్చ

చైనా, భారత్ సరిహద్దు వెంట శాంతి నెలకొల్పడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టినట్లు విదేశాంగ మంత్రి జైశంకర్ చెప్పారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

గుడారాల పండుగ ప్రారంభం



గుంటూరు నగర శివారు గోరంట్ల గ్రామంలో 46వ గుడారాల పండుగ గురువారం ప్రారంభమైంది. తొలిరోజు 2 లక్షల మందికి పైగా భక్తులు హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం వరకు గుడారాల పండుగ జరుగుతుందని చెప్పారు.

వివరాలు 5 ▸

అగ్రికల్చర్ ఆఫీసర్ పోస్టులకు ఎంపిక జాబితా విడుదల



అగ్రికల్చర్ ఆఫీసర్ పోస్టులతో పాటు, సెరికల్చర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పోస్టులకు ఎంపికైన వారి జాబితాను ఏపీపీఎస్సీ గురువారం విడుదల చేసింది.

వివరాలు 3 ▸

అమెరికా, రష్యా, యూఏఈ వ్యోమగాములతో.. ఐఎస్ఎస్‌కు



అరబ్ దేశాల నుంచి మొట్టమొదటి వ్యోమగామి సహా మూడు దేశాలకు చెందిన నలుగురు వ్యోమగాములతో స్పేస్‌ఎక్స్ రాకెట్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకుంది. ఈ ప్రయోగాన్ని యూఏఈ వ్యాప్తంగా స్కూళ్లు, కార్యాలయాల్లో ప్రత్యక్ష ప్రసారం చేశారు.

వివరాలు 6 ▸

విశాఖ ధగ ధగ

నేడు, రేపు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు

14 కీలక రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం

కార్పొరేట్ దిగ్గజాలతోపాటు 45కుపైగా దేశాల నుంచి ప్రతినిధుల రాక

- 25 చార్టర్డ్ ఫ్లైట్స్‌లో విశాఖకు చేరుకోనున్న పారిశ్రామికవేత్తలు
- విమానాల పార్కింగ్ కోసం విశాఖ, రాజమండ్రిలో ఏర్పాట్లు
- వాహనాల పార్కింగ్ కోసం 25 ఎకరాల స్థలం.. ఇప్పటి వరకు 18,000 దాటిన రిజిస్ట్రేషన్స్
- ఉదయం 10.15 గంటలకు సదస్సును ప్రారంభించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- వివిధ రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై ప్రత్యేక సదస్సులు
- 20 బిజినెస్ సెషన్లు.. 150కి పైగా స్టాల్స్.. 500 డ్రోన్లతో లేజర్ షో ద్వారా పెట్టుబడులపై ప్రదర్శనలు
- ప్రముఖ కార్పొరేట్ ప్రతినిధుల ప్రసంగాలు.. ఒప్పందాలు
- కట్టుదిట్టంగా భద్రత, వసతులు

2లో



విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు కోసం సిద్ధం చేసిన వేదిక



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు

సీఎం జగన్‌కు ఘన స్వాగతం

జీఐఎస్ సదస్సు తొలిరోజు ఇలా..

ఈసీ అనుమతితో నేడు కొత్త పారిశ్రామిక పాలసీ!

ఆత్మీయ అతిథులకు అటవీ ఉత్పత్తులు

- వివరాలు 2,14లో

ఈశాన్యంలో కమల వికాసం

ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో బీజేపీకి నూతనోత్తేజం లభించింది. త్రిపురలో బీజేపీకి సంపూర్ణ మెజార్టీ దక్కింది. నాగాలాండ్‌లో 60 అసెంబ్లీ స్థానాలుండగా ఎన్‌డీపీపీ–బీజేపీ కూటమి 37 స్థానాల్లో పాగా వేసింది. 60 స్థానాలున్న మేఘాలయాలో ఒంటరిగా పోటీకి దిగి, కేవలం 2 సీట్లే గెలుచుకున్న బీజేపీ కింగ్‌మేకర్‌గా అవతరిస్తుండడం గమనార్హం. ఈ ఎన్నికల ఫలితాలు ప్రతిపక్ష కాంగ్రెస్‌కు చేదు ఫలితాన్ని మిగిల్చాయి.

- వివరాలు 6లో

త్రిసభ్య కమిటీ సిఫార్సుతోనే..

ఎన్నికల కమిషనర్ల నియామకాలు

కేంద్రం తమకు అనుకూలమైనవారిని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ (ఈసీ)లుగా నియమిస్తోందన్న ఆరోపణల నేపథ్యంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ఇన్నాళ్లుగా కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ఎలక్షన్ కమిషనర్లను నియమిస్తున్న విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రధానమంత్రి, లోక్‌సభలో విపక్ష నేత, సుప్రీం సీజేలతో కూడిన త్రిసభ్య కమిటీ సిఫార్సు మేరకు ఎన్నికల సంఘంలో నియామకాలు జరపాలని తీర్పునిచ్చింది.

- వివరాలు 6లో

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

3,348 సెంటర్లు...

6.64 లక్షల మంది విద్యార్థులు



- వచ్చే నెల 3 నుంచి 18 వరకు పరీక్షలు
- పరీక్షలకు ప్రభుత్వ విద్యార్థులు 3,97,549 మంది.. ఈసారి సీరియల్ నంబర్ల వారీగా ప్రశ్నపత్రాలు..
- ప్రతి విద్యార్థికీ సమాధానాల కోసం 24 పేజీల బుక్‌లెట్
- ఫిజిక్సు, బయాలజీకి ఒకే ప్రశ్నపత్రం, వేర్వేరుగా సమాధానాల బుక్‌లెట్లు
- పరీక్ష కేంద్రాల్లోకి ప్రవేశ సమయం 8.30 నుంచి 8.45 గంటలకు మార్పు
- 'నో మొబైల్ ఫోన్ జోన్లు'గా అన్ని పరీక్ష కేంద్రాలు.. చీఫ్ సూపరింటెండెంట్లకూ సెల్ ఫోన్లకు అనుమతి లేదు

2లో

పక్కాగా వైద్య పరికరాల నిర్వహణ



- వివరాలు 5లో

- క్రిటికల్, నాన్ క్రిటికల్ అంటూ రెండు రకాలుగా విభజన
- క్రిటికల్ పరికరాలు 24 గంటల్లో, నాన్ క్రిటికల్ ఏడ్రోజుల్లో బాగుచేయాలి
- ప్రతి పరికరానికీ ఒక ఐడీ కేటాయింపు
- వాటికి మరమ్మతులు అవసరమైతే ఐడీ ద్వారా ఫిర్యాదుకు అవకాశం
- ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో ప్రతీ ఆస్పత్రికి ఒక లాగిన్
- పరికరం పనిచేయనప్పుడు యాప్ ద్వారా డాక్టర్లు ఫిర్యాదు చెయ్యొచ్చు
- ఈ ప్రక్రియ పర్యవేక్షణకు ఆన్‌లైన్ వ్యవస్థ

గ్రామీణ సేవల్లో పీజీ వైద్య విద్యార్థులు

- డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ కార్యక్రమాన్ని ప్రారంభించిన వైద్య శాఖ
- పీజీ చదివే వైద్యులు మూడు నెలలు జిల్లా, ఏరియా, సీహెచ్‌సీల్లో సేవలు
- 3, 4, 5 సెమిస్టర్ల సమయంలో రొటేషన్‌లో డీఆర్‌కు



సాక్షి, అమరావతి: వైద్య విద్య పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ (డీఆర్) కార్యక్రమాన్ని వైద్య, ఆరోగ్య శాఖ ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని 2020–21 విద్యా సంవత్సరంలోనే నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ఎండీ/ఎంఎస్ కోర్సులు చేసే పీజీ రెసిడెంట్‌లను మూడు, నాలుగు, ఐదో సెమిస్టర్‌ల సమయంలో రొటేషన్ పద్ధతిలో మూడు నెలలు సీహెచ్‌సీలు, జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లో నియమిస్తారు. ఈ మూడు నెలలు వీరు ఆస్పత్రుల్లో రెసిడెంట్‌లుగా సేవలు అందించాలి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలకు ఆ పరిధిలో ఉండే ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) ఆస్పత్రులను

మిగతా 3వ పేజీలో ▶

నల్లమల ఆడపడుచు

సంతానమంటే వాటికి ఎక్కడ లేని మక్కువ

తోటి ప్రాణులతో పోల్చితే ఆవేశం ఎక్కువ

పిల్లల కోసం పులినైనా ఎదుర్కొనే సాహసం

మాంసాహారే అయినా తినేది పండ్లు, తేనె

ఆహార్యంలో అత్యంత భయంకరంగా ఉండే భల్లూకం..పులినైనా ఎదిరించే సత్తా వీటిలో ఉంది. ఇవి ఎంత ప్రమాదకరమో వాటి పిల్లల పట్ల అంత వాత్సల్యంగా ఉంటాయి. భల్లూకాల్లో ఎన్నో రకాల జాతులు ఉన్నప్పటికీ నల్లమల అభయారణ్యంలో తెల్ల మూతులు కలిగి స్లాత్ బేర్‌గా పిలిచే ఇవి చాలా అరుదు. పేరుకు మాసాహారే అయినా తినేది మాత్రం పండ్లు, చీమలు, చెదలు. నల్లమల ఆడపడుచుగా ఉన్న వీటిపై ప్రత్యేక కథనం ..



పెద్దదోర్నాల: నల్లమల అభయారణ్యంలో అత్యంత ప్రమాదకరమైన, అత్యంత వాత్సల్యం కలిగిన జీవి ఎలుగుబంటి. అవి వాటి సంతానం పట్ల ఎంత వాత్సల్యం చూపిస్తాయో, పిల్లల సంరక్షణ పట్ల అంత ప్రమాదకరంగా వ్యవహరిస్తాయి. ఎందుకంటే వాటికి వాటి పిల్లలంటే అంత మక్కువ. అవి వాటిపై ఎంతో ప్రేమాభిమానాలను కనబరుస్తాయి. తన సంతానం కోసం పెద్దపులినైనా ఎదిరించి పోరాడుతాయి. పిల్లలు పెరిగి పెద్దయ్యేంత వరకు తన వీపు పైనే మోసుకుని అడవంతా సంచరిస్తుంటాయి.

ఆవేశం ఎక్కువ..

తన పిల్లల జోలికొస్తే ఎదురుపడిన జీవులను చంపేంత ప్రమాదకారి ఎలుగుబంటి. సాధారణంగా ఏ వన్యప్రాణి అయినా తన పిల్లలతో కలిసి సంచరించేటప్పుడు కాస్తం జాగరూకతతో ఉంటాయి. వాటికి ఆపద జరుగకుండా వ్యవహరిస్తాయి. కానీ ఎలుగుబంట్లకు ఆవేశం పాలు చాలా ఎక్కువ. అది పిల్లలతో సంచరించేటప్పుడు జంతువైనా, మనిషి అయినా ఎదురైతే ఎటువంటి ఆలోచన లేకుండా దాడికి పాల్పడుతుంది. ఈ దాడి ఎంతో ప్రాణాంతకంగా ఉంటుంది. తన పిల్లలను కాపాడుకునేందుకు అవి పెద్దపులులతో కూడా పోరాటానికి దిగిన సందర్భాలు చాలా ఉన్నాయి. అటవీ శాఖ అధికారులు అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసి ట్రాప్‌డ్ కెమెరాల్లో ఎన్నో సార్లు పులులు, ఎలుగుబంట్లు దాడులు చేసుకున్న సంఘటనలు నిక్షిప్తం అయినట్లు అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయితే పులితో పోల్చుకుంటే ఎలుగుబంట్ల బలం చాలా తక్కువ, కానీ పిల్లల కోసం శక్తికి మించిన బలంతో అది పులులతో తలబడుతుంది. అయితే ఎలుగుబంట్ల పదునైన గోళ్ల దాటికి పెద్దపులులు కూడా భయపడతాయని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. మనుషులపై కూడా అవి దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటనలు ఉన్నాయి. అభయారణ్యంలో విధులు నిర్వహించే అటవీ సిబ్బంది కూడా ఎలుగుబంట్ల దాడి నుంచి తమను తాము కాపాడుకోవటానికి నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తుంటారు.

మాంసాహారే అయినా తినేది మాత్రం..

భల్లూకాలు చెట్లు ఎక్కటంలో నేర్పరి. ఇవి చిరుత పులుల మాదిరిగానే చెట్లు ఎక్కి వాటి ఆహారాన్వేషణలో పాల్గొంటాయి. ఇవి ఎక్కువగా పండ్లను ఆహారంగా తీసుకుంటుంటాయి. దీని కోసమే అవి చెట్లు ఎక్కుతుంటాయి. ఎత్తుగా ఉండే వెలగపండ్లు, చిటిమిటి కాయలు, టుకీ పండ్లను ఎంతో నేర్పరితనంతో సేకరిస్తుంటాయి. అలాగే చెట్టు కొమ్మలకుండే తేనెపట్టులను అవి ఎంతో నైపుణ్యంగా సేకరించి సేవిస్తుంటాయి. పేరుకు మాంసాహారే కానీ అవి ఎక్కువగా తినేది మాత్రం శాఖాహారం. ఎలుగుబంట్లు ఎక్కువగా పుట్టలను తవ్వి చీమలను తింటుంటాయి. దీంతో పాటు పండ్లు, తేనె, చెదలను ఎక్కువగా తింటుంటాయి. రేగుపండ్లను ఎక్కువగా తింటుంటాయి.

అప్రమత్తత అవసరం..

భల్లూకాల పట్ల అప్రమత్తత ఎంతో అవసరం. కొన్ని ప్రత్యేక పరిస్థితుల ద్వారా ఎలుగుబంట్ల నుంచి రక్షించుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఎటుగుబంట్లు దాని వెంట పిల్లలు ఉన్నప్పుడు, దీంతో పాటు ఆహార సేరకరణ సమయంలో అంతరాయం కలిగిస్తే అవి రెచ్చిపోతుంటాయి. అడవుల్లో సంచరించే వ్యక్తులు పరిసరాలను జాగ్రత్తగా గమనిస్తూ ముందుకు కదలాలి. చీమల పుట్టల వద్ద ఎటుగుబంట్లు కనిపిస్తే పెద్దగా అరుస్తూ కేకలు వేయటం ద్వారా వాటిని బెదరగొట్టవచ్చు. అలాగే పొడవాటి కర్రను తమతో పాటు తీసుకెళ్లాలి. ఎలుగుబంటి పరుగు కూడా చాలా తక్కువగా ఉంటుంది. దూరంగా పరిగెత్తి ప్రాణాలు కాపాడుకునేందుకు వీలుంటుంది.

ఇవి రక్షిత వన్యప్రాణులు...

ఎలుగుబంట్లు రక్షిత జంతువులుగా ప్రభుత్వం గుర్తించింది. ఇది అంతరించి పోయే దశలో ఉన్నందున్న దీనిని వేటాడటం గాని ప్రమాదం కలిగించటంగానీ చేయకూడదు. ఎటుగుబంట్లు సాధారణ పరిస్థితుల్లో ఎవరినీ ఏమీ చేయవు. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే వాటి నుంచి ఇబ్బందులు లేకుండా తప్పించుకోవచ్చు. అవి దూరంగా సంచరించేటప్పుడు దాన్ని చూస్తే మనం కూడా దూరంగా వెళ్లటం మంచిది. వీటిని నల్లమల ఆడపడుచులుగా పిలుస్తుంటారు.

మనిషిని చూస్తే గట్టిగా అరుస్తాయి

మనిషిని చూస్తే ఎలుగుబంట్లు భయంకరంగా అరుస్తాయి. దీంతో పాటు మనుషులపై అరుస్తూ గోళ్లతో రక్కి తీవ్రంగా గాయపరుస్తాయి. గతంలో నాపై కూడా ఎటుగుబంటి దాడి చేసింది. దీని వల్ల కంటికి గాయమైంది. మండలంలో చాలా మంది దీని వల్ల గాయపడ్డారు. వారిలో నల్లగుంట్ల చెరువు గూడెంలో ఉన్న ఉత్తలూరి పెద్దన్న, మర్రిపాలెం గూడెంలో జల్లా అంకన్న తదితరులు ఉన్నారు. అటవీశాఖ నుంచి పరిహారం వస్తుండటంతో కొంత మేలు జరుగుతోంది.

– భూమని వీరన్న, చింతలగూడెం



ఆయన వెళితే వెళ్లాడు కానీ.. మిమ్మల్ని కూడా లాగుతున్నాడు.. జాగ్రత్త సార్!



భారత్‌లో అతి తక్కువ ఖర్చుతో రిటైర్‌మెంట్ జీవితం

అమెరికా ఉద్యోగులపై 'ఏగాన్' సంస్థ సర్వేలో వెల్లడి


అమెరికన్లు శేష జీవితాన్ని గడిపేందుకు వివిధ దేశాల్లో వ్యయంపై అధ్యయనం

సింగపూర్‌లో రిటైర్‌మెంట్ జీవితం అత్యంత ఖరీదు.. రూ.9.21 కోట్లు కావాల్సిందే

కోటిన్నరతో.. కృష్ణా రామా!

సాక్షి, అమరావతి: రూ.కోటిన్నర ఉంటే చాలు.. మన దేశంలో రిటైర్‌మెంట్ అనంతరం కృష్ణా రామా అని ప్రశాంతంగా జీవనం గడిపేయొచ్చట. అయితే.. ఈ లెక్క భారతీయులకు సంబంధించి కాదండోయ్. అమెరికన్ల కోసం మాత్రమే! ఎందుకంటే.. అమెరికా ఉద్యోగులు, రిటైరైన వారిలో 13 శాతం మంది పదవీ విరమణ అనంతర జీవితాన్ని విదేశాల్లో గడిపే యోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో 'ఏగాన్' అనే సంస్థ ఓ సర్వే నిర్వహించింది. అమెరికన్లు రిటైర్‌మెంట్ అనంతరం వివిధ దేశాల్లో సాఫీగా జీవితం గడిపేందుకు ఎంత ఖర్చవుతుందనే గణాంకాలను ఆ సంస్థ విడుదల చేసింది.

- రిటైర్‌మెంట్ అనంతరం జీవించేందుకు ప్రపంచంలో అత్యధికంగా సింగపూర్‌లో ఎక్కువ వ్యయం (దాదాపు రూ.9.21 కోట్లు) కానుంది. అమెరికాతో పోలిస్తే సింగపూర్‌లోనే 60% అధికంగా రిటైర్డు జీవితానికి ఖర్చవుతుంది. ఆ తరువాత స్థానంలో ఉన్న స్విట్జర్లాండ్‌లో కూడా అమెరికాతో పోలిస్తే శేష జీవిత ఖర్చులు ఎక్కువే.
- రిటైరైన అమెరికా ఉద్యోగులు తరువాత జీవితాన్ని సాఫీగా గడపాలంటే పాకిస్తాన్‌లో రూ.1.30 కోట్లు, భారత్‌లో రూ.1.53 కోట్లకుపైగా వ్యయం అవుతుంది.
- ఓ అమెరికా ఉద్యోగి రిటైరైన తరువాత స్వదేశంలో (అమెరికా) శేష జీవితం గడపాలంటే దాదాపు రూ.5.79 కోట్లు కావాలి.



14న రాష్ట్ర కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి : ఈ నెల 14వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. సచివాలయంలోని ఒకటో బ్లాక్‌లో మ.12 గంటలకు ఈ భేటీ ఉంటుంది. బడ్జెట్ సమావేశాలు పురస్కరించుకుని అసెంబ్లీలో ప్రవేశపెట్టే పలు బిల్లులకు మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశముంది.

'రాజధాని'పై 3 రోజులు విచారించాలి

- సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం ప్రస్తావన
- సీజేఐ నిర్ణయం తీసుకోవాలన్న జస్టిస్ కేఎం జోసెఫ్ ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశంపై వరుసగా మూడ్రోజులు విచారించాలని ఏపీ ప్రభుత్వం తరపు న్యాయవాది సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఈ అంశాన్ని ఏపీ తరపు న్యాయవాది గురువారం జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా ధర్మాసనం ముందు ప్రస్తావించారు. రాజధానిపై వీలైనంత త్వరగా విచారణ చేపట్టాలని కోరారు. సుప్రీంకోర్టు మార్చి 28 మంగళవారంతోపాటు బుధ, గురువారాల్లో కూడా విచారించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో.. బుధ, గురువారాల్లో కూడా విచారణ చేపట్టాలంటే సీజేఐ నిర్ణయం తీసుకోవాలని.. ఈ అంశాన్ని సీజేఐ ముందు ప్రస్తావించాల్సి ఉంటుందని జస్టిస్ కేఎం జోసెఫ్ తెలిపారు. అయితే, దానికి అనుమతివ్వాలని న్యాయవాది కోరారు. సీజేఐ అనుమతిస్తే తమకేమీ అభ్యంతరంలేదని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ కేసులో రాజ్యాంగపరమైన అంశాలున్నాయని వ్యాఖ్యానించారు. అలాగే, ఈ కేసులో మధ్యంతర ఉత్తర్వులు ఉన్నాయా అని జస్టిస్ బీవీ నాగరత్న ప్రశ్నించగా అవునని న్యాయవాది బదులిచ్చారు. ఒక తేదీని నిర్ణయించి కనీసం రెండు రోజులపాటు విచారణ చేయాలని ప్రతివాదులు తరపు న్యాయవాది కోరారు. అయితే, విచారణ జాబితాలో చివరి అంశంగా తాము చేపట్టగలమని ధర్మాసనం పేర్కొంటూ విచారణను మార్చి 28నే చేపడతామని జస్టిస్ జోసెఫ్ స్పష్టంచేశారు.

వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ చైర్మన్‌గా భూపాల్‌రెడ్డి



కర్నూలు(లీగల్): రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ట్రిబ్యునల్ చైర్మన్‌గా 7వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.భూపాల్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పోక్సో కేసుల ప్రత్యేక విచారణ న్యాయమూర్తిగా కూడా భూపాల్‌రెడ్డి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాజాగా, వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ చైర్మన్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. స్థానిక ఎన్ఆర్ పేటలో ఇటీవల వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. హైదరాబాద్ నుంచి కర్నూలుకు వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్‌ను తరలించడంతోపాటు చైర్మన్‌ను నియమించడంపై హర్షం వ్యక్తమవుతోంది.

పీడీఎస్ ద్వారా ఏపీలో జొన్నలు, రాగుల పంపిణీ

- రాష్ట్ర వ్యాప్తంగా గోధుమ పిండి పంపిణీకి ఏర్పాట్లు
- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి



సాక్షి, న్యూఢిల్లీ : వచ్చే రెండు నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో పీడీఎస్ ద్వారా జొన్నలు, రాగుల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. ఇందుకు అవసరమైన రాగులు, జొన్నల సరఫరాకు కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్ అంగీకరించినట్టు చెప్పారు. బియ్యంతో పాటు రేషన్ కార్డుదారులకు రెండు కిలోల గోధుమ పిండిని పైలట్ ప్రాజెక్టులో భాగంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో అందిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల నాలుగో తేదీ నుంచి తణుకు నియోజకవర్గంలోనూ ప్రారంభిస్తున్నామని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా గోధుమ పిండి పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రమంతా బలవర్ధక ఆహారాన్ని అందించే ప్రక్రియలో భాగంగా ఏప్రిల్ నుంచి ఫోర్టిఫైడ్ బియ్యాన్నిచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో గురువారం మంత్రి కారుమూరి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని గిరిజనులకు అందించేందుకు లక్ష అంత్యోదయ రేషన్‌కార్డులను కోరగా.. కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ అంగీకరించారని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన ఏ ఒక్కరి రేషన్ కార్డునూ తొలగించట్లేదని, కేవలం అనర్హులవి మాత్రమే తొలగిస్తున్నట్టు చెప్పారు. 2012 నుంచి 2018కి మధ్య రాష్ట్రానికి రావాల్సిన రూ.1,702 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేసే విషయంలో కేంద్ర మంత్రి, ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖ కార్యదర్శిలతో చర్చించామన్నారు. ఏపీలో స్మార్ట్ పీడీఎస్‌లో భాగంగా అమల్లో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్ పనితీరును పీయూష్‌గోయల్ అభినందించి.. ఇతర రాష్ట్రాలు కూడా ఏపీని ఆదర్శంగా తీసుకోవాలని సూచించినట్టు చెప్పారు. మీడియా అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా.. లోకేశ్, చంద్రబాబు, అయ్యన్నపాత్రుడే ఏపీలో గంజాయి మాఫియా నిర్వహిస్తున్నారని, జగన్ సీఎం అయ్యాక గంజాయిని పెద్ద ఎత్తున నియంత్రించినట్టు మంత్రి కారుమూరి వివరించారు.

టెన్త్ పరీక్షలకు పగడ్బందీ ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రభుత్వం పగడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే నెల 3 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఏర్పాట్లు చేస్తోంది. గతానుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి ముందు నుంచే ఎస్సెస్సీ బోర్డు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటోంది. 26 జిల్లాల్లో మొత్తం 3,348 కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటివరకు రిజిస్టరైన విద్యార్థుల సంఖ్య ప్రకారం ఈ పరీక్షలకు 18,601 స్కూళ్ల నుంచి 6,64,153 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థుల్లో ప్రభుత్వ స్కూళ్ల నుంచి 3,97,549 మంది, ప్రైవేటు స్కూళ్ల నుంచి 2,11,521 మంది ఉన్నారు. బాలురు 3,46,542 మంది కాగా బాలికలు 3,17,611 మంది పరీక్ష రాయనున్నారు. ప్రైవేటుగా పరీక్ష రాసే విద్యార్థులు మరో 53,411 మంది ఉన్నారు. వీరితోపాటు ఓఎస్సెస్సీ విద్యార్థులు మరో 1,672 మంది పరీక్షలకు హాజరవుతున్నారు.

ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే పరీక్ష కేంద్రాలు

పరీక్ష కేంద్రాలను ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ, జడ్పీ స్కూళ్లు, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు, మున్సిపల్ స్కూళ్లు, ప్రభుత్వ



జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ప్రైవేటు విద్యా సంస్థల్లో సీసీ కెమెరాలు ఉన్న వాటినే పరీక్ష కేంద్రాలకు అనుమతిస్తున్నారు. పరీక్ష ముగిసే వరకు సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకుంటారు. పరీక్షలు ప్రతి రోజూ ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. గతంలో విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి ఉదయం 8.30 నుంచి అనుమతించేవారు. ఈసారి ఉదయం 8.45 గంటల తరువాత మాత్రమే అనుమతిస్తారు. చీఫ్ సూపరింటెండెంట్ సహా ఎవరికీ పరీక్ష కేంద్రాల్లో సెల్‌ఫోన్లను, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు.

ప్రశ్న పత్రాలకు 7 అంకెల సీరియల్ నంబర్

ఈసారి పంపిణీ చేసే ప్రశ్నపత్రాలకు కొత్తగా సీరియల్ నంబర్లను ముద్రిస్తారు. 7 అంకెలతో కూడిన సీరియల్ నంబర్ల వారీగానే సెంటర్లలోని విద్యార్థులకు ప్రశ్నపత్రాలను అందిస్తారు. సమాధానాలు రాసేందుకు 24 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వం పదో తరగతి పరీక్షలను ఆరు పేపర్లకు పరిమితం చేసింది. గతంలో 11 పేపర్లు ఉండగా, కరోనా సమయంలో వాటిని ఏడింటికి తగ్గించారు. ఇకపై ఆరు పేపర్లలో మాత్రమే టెన్త్ పరీక్షలు జరగనున్నాయి. ఫిజికల్ సైన్సు, బయోలాజికల్ సైన్సుకు కలిపి ఒకే ప్రశ్నపత్రం ఇస్తారు. ఈ రెండు సబ్జెక్టులకు సమాధానాలు వేర్వేరుగా రాసేందుకు రెండు బుక్‌లెట్లు (12 పేజీలు చొప్పున) ఇస్తారు. పేపర్-1లో ఫిజికల్ సైన్సులో 16 ప్రశ్నలు, పేపర్-2 బయోలాజికల్ సైన్సులో 17 ప్రశ్నలు ఉంటాయి. ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2 (కాంపోజిట్ కోర్సులైన సంస్కృతం, అరబిక్, పర్షియన్, హిందీ), వొకేషనల్ కోర్సులకు కూడా ఈసారి రెండు బుక్‌లెట్లు ఇస్తారు. ఏప్రిల్ 19 నుంచి ఏప్రిల్ 26 వరకు టెన్త్ మూల్యాంకనాన్ని నిర్వహిస్తారు. ఈసారి కొత్త జిల్లాలను కూడా కలుపుకొని 25 మూల్యాంకనం కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

నో మొబైల్‌ఫోన్ జోన్లుగా పరీక్ష కేంద్రాలు: ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి

రాష్ట్రంలోని అన్ని పరీక్ష కేంద్రాలను నో మొబైల్ ఫోన్ జోన్లుగా పరిగణిస్తున్నాం. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందే కాకుండా పై స్థాయి అధికారులైన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లకు కూడా మొబైల్ ఫోన్లు తీసుకు రాకుండా నిషేధం ఉంటుంది. ఫోన్లతో పాటు ఇతర డిజిటల్ పరికరాలు వేటినీ పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు. పరీక్ష కేంద్రానికి వచ్చే సిబ్బంది ఫోన్లను ఉదయం 8.30 గంటల్లోపు చీఫ్ సూపరింటెండెంట్ వద్ద డిపాజిట్ చేయాలి. తిరిగి వాటిని పరీక్ష ముగిశాక మధ్యాహ్నం 1 తరువాత మాత్రమే తిరిగి ఇవ్వాలి. ఎలక్ట్రానిక్, ప్రింటిమీడియాలకు కానీ, ఫొటో గ్రాఫర్లకు కానీ ప్రవేశం ఉండదు.

స్ట్రీమ్	స్కూళ్లు	బాలురు	బాలికలు	మొత్తం విద్యార్థులు
రెగ్యులర్	11,646	3,11,329	2,97,741	6,09,070
ప్రైవేటు	6,869	34,405	19,006	53,411
ఓఎస్సెస్సీ (ఆర్)	60	713	812	1,525
ఓఎస్సెస్సీ (ప్రైవేటు)	26	95	52	147
మొత్తం	18,601	3,46,542	3,17,611	6,64,153

విశాఖ ధగ ధగ

విశాఖలో నేడు, రేపు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు

విశాఖ జీఐఎస్ వేదిక నుంచి సాక్షి ప్రతినిధుల బృందం: రాష్ట్ర చరిత్రలో కనీ వినీ ఎరుగని విధంగా దేశ, విదేశీ కార్పొరేట్ దిగ్గజాలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకువస్తూ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023కు వేదికగా విశాఖ సిద్ధమైంది. పారిశ్రామిక అభివృద్ధికి గతంలో జరిగిన సదస్సులకు భిన్నంగా వాస్తవికతకు దగ్గరగా జరగబోతున్న ఈ సదస్సు కోసం ప్రపంచ వాణిజ్యవేత్తలంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికగా రెండు రోజుల పాటు నిర్వహించే సదస్సులో రాష్ట్రంలో ఉన్న 14 కీలక రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన లక్ష్యంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేశ, విదేశాల నుంచి దిగ్గజ పారిశ్రామికవేత్తలు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, హాజరవుతున్నారు. 45 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్న ఈ సదస్సుకు సంబంధించి ఇప్పటికే రిజిస్ట్రేషన్లు 18 వేలు దాటడం విశేషం. ముఖేష్ అంబానీ, కుమార మంగళం బిర్లా, కరణ్ అదానీ, సంజీవ్ బజాజ్, అర్జున్ ఒబెరాయ్, సజ్జన్ జిందాల్, నవీన్ జిందాల్, మార్టిన్ ఎబర్ హార్డ్, హరిమోహన్ బంగూర్, సజ్జన్ భజాంకా వంటి 30కి పైగా కార్పొరేట్ దిగ్గజ ప్రముఖులు రెండు రోజుల సదస్సులో పాల్గొంటున్నారు. నేటి ఉదయం 10.15 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ సదస్సును లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ సదస్సు ఏర్పాట్లపై సీఎం ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తున్నారు. గురువారం సాయంత్రమే విశాఖకు చేరుకుని, ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డితో పాటు మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుడివాడ అమరనాథ్‌లు సభా స్థలి, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్పొరేట్ ప్రముఖులు విమానాశ్రయం నుంచి నేరుగా సభా స్థలికి చేరుకునేందుకు మూడు హెలిపాడ్స్‌ను సిద్ధం చేశారు. అధికారులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా కదలికలను ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తున్నారు. తొలిసారిగా స్నిఫర్ డాగ్స్‌తో కే9 సెక్యూరిటీ వ్యవస్థ ఏర్పాటు చేశారు.

14 రంగాల్ని ప్రమోట్ చేస్తున్న ప్రభుత్వం

- రాష్ట్రంలో సరళమైన పారిశ్రామిక విధానం, సీఎం వైఎస్ జగన్ విశ్వసనీయతకు ఆకర్షితులై దిగ్గజ పరిశ్రమలన్నీ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు అడుగులు ముందుకు వేస్తున్నాయి. అడ్వాంటేజ్ ఏపీ పేరుతో రాష్ట్రంలో ఉన్న వనరులు, వసతుల్ని ప్రపంచానికి పరిచయం చేసే విధంగా ఈ సదస్సు జరగనుంది. మూడున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలలో 90 శాతానికి పైగా గ్రౌండ్ అయ్యాయి. అదే స్ఫూర్తితో ఈ సదస్సులో చేసుకునే ఒప్పందాలు 100 శాతం గ్రౌండ్ అవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆకాంక్షిస్తోంది.
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి మెరుగైన అవకాశాలు ఉన్న 14 రంగాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. పునరుత్పాదక ఇంధన వనరులు, ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ, హెల్త్‌కేర్ అండ్ మెడికల్ ఎక్విప్‌మెంట్, ఎంఎస్ఎంఈ, స్టార్టప్స్ అండ్ ఇన్నోవేషన్స్, స్కిల్



డెవలప్‌మెంట్ అండ్ ఎడ్యుకేషన్, ఇండస్ట్రియల్ అండ్ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫార్మాస్యూటికల్స్ అండ్ లైఫ్ సైన్సెస్, ఆటోమొబైల్ అండ్ ఎలక్ట్రిక్ వెహికల్స్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, అగ్రి అండ్ ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్ అండ్ అప్పరెల్స్, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్, పెట్రోలియం అండ్ పెట్రోకెమికల్స్ తదితర రంగాలపై ఫోకస్ చేస్తోంది.
- ఈ రంగాలకు సంబంధించిన కేంద్ర మంత్రులను ఆహ్వానించారు. వారంతా ఈ సదస్సుకు హాజరవుతున్నారు. ఆడియో వీడియో విజువల్ ప్రదర్శన అనంతరం సంబంధిత అధికారులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రసంగించనున్నారు.
- సభా ప్రాంగణానికి పక్కనే ఉన్న మరో గదిలో 20కి పైగా బ్రేక్ అవుట్ బిజినెస్ సెషన్లు జరగనున్నాయి. సభా ప్రాంగణంలోనే సీఎం కార్యాలయం.. లాంజ్, సమావేశ మందిరం, వ్యక్తిగత గదులను సిద్ధం చేశారు. ఆ పక్కనే మంత్రులకు, మీడియా ప్రతినిధులకు వేర్వేరుగా డైనింగ్ సౌకర్యం కల్పించారు.
- సభా ప్రాంగణంలో అత్యంత ఆకర్షణీయంగా ఏపీ పెవిలియన్ ఏర్పాటు చేశారు. దీని చుట్టూ వివిధ కంపెనీలకు చెందిన స్టాల్స్ ఉంటాయి. వీటితో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థకు సంబంధించిన కార్యాలయ నమూనా, లేపాక్షి హస్త కళా ప్రదర్శన స్టాల్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఏరోస్పేస్, మారిటైమ్ బోర్డు, కియా మోటర్స్ ఎలక్ట్రిక్ వెహికల్స్ తదితర పరిశ్రమలకు చెందిన స్టాల్స్ కూడా ఏర్పాటు చేశారు.

దారులన్నీ.. వైజాగ్ వైపే..

- వేదికకు ఎదురుగా ఏయూకు చెందిన మరో 25 ఎకరాల మైదానాన్ని పార్కింగ్ కోసం సిద్ధం చేశారు. ప్రముఖ పారిశ్రామిక ప్రతినిధులు, కేంద్ర మంత్రులు 25కు పైగా ఛార్టర్డ్ ఫ్లైట్స్‌లో రానున్నారు. వాటికి విశాఖ, రాజమండ్రి ఎయిర్‌పోర్టులలో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. తొలిరోజు రాతిర సాగరతీరం సమీపంలోని వుడాపార్క్ ఎంజీఎం గ్రౌండ్స్‌లో అతిథులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 500 డ్రోన్లతో లేజర్ ప్రదర్శన ద్వారా పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తారు.



విశాఖ విమానాశ్రయంలో సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి

దిగ్గజ పారిశ్రామిక వేత్తలతో సీఎం ముఖాముఖి

తొలిరోజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర జాతీయ రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో పాటు 21 మంది కార్పొరేట్ ప్రముఖులు ప్రసంగించనున్నారు. 150కి పైగా స్టాల్స్‌తో ఏర్పాటు చేసిన పారిశ్రామిక ఎగ్జిబిషన్‌ను సీఎం కేంద్ర మంత్రి గడ్కరీతో కలిసి మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సీఎం వైఎస్ జగన్.. ప్రముఖ పారిశ్రామికవేత్తలు ముఖేష్ అంబానీ, కేఎం బిర్లా, కరణ్ అదానీ, అర్జున్ ఒబెరాయ్, సంజీవ్ బజాజ్, ఎబర్‌హార్డ్, నవీన్ జిందాల్, సుమిత్ బిదానీ తదితరులతో ముఖాముఖి చర్చలు నిర్వహిస్తారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాల్ని వారికి స్వయంగా వివరించనున్నారు. రెండో రోజు శనివారం ఉదయం 9.15 నుంచి 10.45 గంటల వరకు పలువురు పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి మాట్లాడనున్నారు. ఉదయం ఎంవోయూల అనంతరం ముగింపు సమావేశంలో 10 మందికిపైగా కార్పొరేట్ ప్రముఖులు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, శర్బానంద సోనోవాల్ ప్రసంగించనున్నారు. అనంతరం రాష్ట్రంలో ఉత్పత్తికి సిద్ధమైన పలు యూనిట్లను ముఖ్యమంత్రి జీఐఎస్ వేదిక నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం

సాక్షి, విశాఖపట్నం: 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023'లో పాల్గొనేందుకు విశాఖకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. గురువారం సాయంత్రం 4 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరి 5 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకున్న ముఖ్యమంత్రికి టీటీడీ చైర్మన్, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి సత్యవతి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, సీపీ సీహెచ్ శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు స్వాగతం పలికారు.



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనంతరం రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకున్నారు.



గుంటూరు నగరం భవానీపురానికి చెందిన హప్రఫ్ అలీకి దివ్యాంగ పింఛను అందజేస్తున్న వార్డు వలంటీరు శివపార్వతి



నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చెల్లాయపాలెంకు చెందిన రమణమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ సాయికుమారి



ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో గోపాలరావుకు పింఛను అందజేస్తున్న వార్డు వలంటీర్ కృష్ణవేణి



ఒంగోలు నగరంలోని షేక్ కాశింబికి దివ్యాంగ పింఛను అందజేస్తున్న వలంటీర్ చెన్నారెడ్డి



ఏలూరులో కల్లూరు పైడియ్యకు దివ్యాంగ పింఛను అందజేస్తున్న వలంటీర్ త్రినాథ్



విశాఖపట్నంలోని అక్కిరెడ్డిపాలెంలో వృద్ధుడు ఇమంది అప్పారావుకు పింఛను అందిస్తున్న వలంటీర్ టి.సత్య



అనంతపురం 13వ డివిజన్‌లో లబ్ధిదారు రాబియాకు వితంతు పింఛను అందజేస్తున్న వలంటీర్లు రాజు, శశికళ



వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరామిరెడ్డికి పింఛను అందిస్తున్న వెదురూరు గ్రామ వాలంటీరు సుబ్బారెడ్డి



కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మమ్మకు పింఛను అందజేస్తున్న రేమదూరు వలంటీర్ హరీశా

డిగ్రీ కాలేజీల్లో దశాబ్దాల సమస్యలకు పరిష్కారం

ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన డిగ్రీ కాలేజీల లెక్చరర్ల సంఘాలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు సంబంధించి దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరించిందని రాష్ట్రంలోని గవర్నమెంట్ డిగ్రీ కాలేజీల లెక్చరర్ల సంఘాల నాయకులు చెప్పారు. ఈ మేరకు ఆయా సంఘాల నాయకులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం, ప్రభుత్వ డిగ్రీ కాలేజీల టీచర్ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఎం.శ్రీనివాసరెడ్డి, బి.సుధాకర్‌రావు, ఎం.శ్యాంబాబు, కె.రజనీకాంత్, కె.మోహన్‌రావు, కేవీఎస్ ప్రసాద్, స్వరూప్‌సింగ్ తదితరులు గురువారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, కాలేజీ విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే మద్దతు

ఏపీజీఈఎఫ్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులకు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏపీజీఈఎఫ్) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఆ సమాఖ్య అధ్యక్షుడు కె.వెంకటరామిరెడ్డి చెప్పారు. ఆయన గురువారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ, తూర్పు, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీజీఈఎఫ్ సభ్యసంఘాలు కలిసికట్టుగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల సంక్షేమానికి, సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు.

సీఎం జగన్ ప్రోత్సాహంతోనే రాష్ట్రంలో పరిశ్రమలు

సెంచురీ ప్లై సంస్థ చైర్మన్ సజ్జన్ భజాంకా | **వైఎస్సార్ జిల్లా గోపవరం వద్ద పరిశ్రమ పనుల పరిశీలన**



పరిశ్రమ ఆవరణలో మొక్కలు నాటిన సెంచురీ ప్లై చైర్మన్ సజ్జన్ భజాంకా, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

గోపవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతోనే రాష్ట్రంలో సెంచురీ ప్లై పరిశ్రమను నిర్మిస్తున్నట్టు ఆ సంస్థ చైర్మన్ సజ్జన్ భజాంకా తెలిపారు. వైఎస్సార్ జిల్లా గోపవరం వద్ద నిర్మిస్తున్న పరిశ్రమ పనులను గురువారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధతో కలిసి ఆయన పరిశీలించారు. పరిశ్రమ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భజాంకా మాట్లాడుతూ తొలుత తమిళనాడులో యూనిట్ నెలకొల్పాలని భావించామని, అయితే వెనుకబడిన ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేయడం వలన ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని సీఎం జగన్ తమకు చెప్పారని, దీంతో తాము ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు చకచక రావడంతో పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని, డిసెంబర్ నాటికి మొదటి దశ పనులు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. 2024 డిసెంబర్ నాటికి పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేసి వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.

75 శాతం ఉద్యోగాలు స్థానికులకే..

ముందుగా రూ.600 కోట్లతో యూనిట్‌ను ఏర్పాటు చేయాలని భావించామని, ఇప్పుడు రూ.1,600 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు భజాంకా తెలిపారు. ఈ పరిశ్రమ ఏర్పాటు కావడం వలన రెండు వేల మందికి ప్రత్యక్షంగానూ, నాలుగు వేల మందికి పరోక్షంగానూ ఉపాధి లభిస్తుందని, 75 శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వనున్నట్లు భజాంకా వెల్లడించారు. నిరుద్యోగులకు ఎలాంటి అనుభవం లేకున్నా వారికి శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో సెంచురీ ప్యానల్ జీఎం రమేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఆర్‌ఆర్‌ఆర్'కు ఈ-పోస్టు ద్వారా శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: ఉత్తమ ఒరిజినల్ సాంగ్ విభాగంలో 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని 'నాటునాటు' పాట ఆస్కార్ అవార్డును గెలుచుకోవాలని ఆకాంక్షిస్తూ ఈ-పోస్టు ద్వారా శుభాకాంక్షలు తెలిపే కార్యక్రమానికి ఏపీ పోస్టల్ సర్కిల్ శ్రీకారం చుట్టింది. 95వ ఆస్కార్ అవార్డుల వేడుక ఈ నెల 12న జరగనుంది. ఇప్పటికే నాటు నాటు పాట ఆస్కార్‌కు నామినేట్ అయిన విషయం తెలిసిందే. ఆర్‌ఆర్‌ఆర్ చిత్ర బృందానికి మద్దతుగా అభిమానులు మార్చి 10 వరకు ఈ-పోస్టు శుభాకాంక్షలు పంపించవచ్చని ఏపీ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ వీఎస్ఎల్ నరసింహారావు గురువారం తెలిపారు. పూర్తి వివరాలకు సమీపంలోని పోస్టు ఆఫీసు లేదా 9440055978 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అగ్రికల్చర్ ఆఫీసర్ పోస్టుల ఎంపిక జాబితా విడుదల

ఫుడ్ సేఫ్టీ, సెరికల్చర్ ఆఫీసర్ పోస్టులకూ ఎంపిక పూర్తి

సాక్షి, అమరావతి: ఏపీ వ్యవసాయ శాఖలోని అగ్రికల్చర్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికైన వారి జాబితాను (ప్రొవిజనల్ సెలెక్షన్ లిస్ట్)ను ఏపీపీఎస్సీ గురువారం విడుదల చేసింది. ఎంపికైనవారి జాబితాను కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov.inలో పొందుపరిచినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా సెరికల్చర్ విభాగానికి సంబంధించిన సెరికల్చర్ ఆఫీసర్ పోస్టులకు, హెల్త్ డిపార్టుమెంట్‌లోని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పోస్టులకు ఎంపికైన వారి జాబితాలను కూడా వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు వివరించారు.

7న ఉద్యోగ సంఘాలతో ఉప సంఘం భేటీ

- బొత్స, సజ్జల హామీ ఇచ్చారని ఉద్యోగ సంఘాల నేతల వెల్లడి
- ఆరోజు సమావేశానికి సీఎస్ కూడా హాజరు
- బొత్స, సజ్జలతో చర్చలు జరిపిన ఉద్యోగ సంఘాల నేతలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 7వ తేదీన మంత్రివర్గ ఉప సంఘం ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు జరుపుతుందని మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణా రెడ్డి హామీ ఇచ్చినట్లు ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. ఆరోజు సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కూడా పాల్గొంటారని చెప్పారన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ఉద్యోగ సంఘాల నేతలు గురువారం మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు బొత్స సత్యనారాయణ, సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగులు) చంద్రశేఖరరెడ్డితో చర్చలు జరిపారు. విజయవాడలో మంత్రి బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఏపీ జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు, ఏపీ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించి, వెంటనే పరిష్కరించాలని కోరారు. మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు ముందుగా ఉద్యోగ సంఘాల నేతలతో విడివిడిగా సమావేశమై, వారి సమస్యలను విన్నారు. చివరిగా సమస్యలపై చర్చించేందుకు ఈనెల 7న చర్చిద్దామని హామీ ఇచ్చారని సంఘాల నేతలు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలపై ఉపసంఘం సానుకూలత: వెంకటరామి రెడ్డి

జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన 94 ఆర్థిక, ఆర్థికేతర అంశాల్లో 24 పరిష్కారమయ్యాయి. 10 ఏళ్ల సర్వీసు దాటిన 13 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను త్వరలో ఇస్తామని కమిటీ తెలిపింది. సీపీఎస్‌పైనా త్వరలోనే నిర్ణయం ఉంటుంది. సీపీఎస్ ఉద్యోగులపై నమోదైన కేసులను మాఫీ చేసేందుకు కమిటీ అంగీకారం తెలిపింది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలపైనా అంగీకారం తెలిపారు.

గ్రామీణ సేవల్లో పీజీ వైద్య విద్యార్థులు

▶ మొదటి పేజీ తరువాయి

ట్యాగ్ చేశారు. 2020–21లో పీజీ కోర్సుల్లో చేరిన వైద్యుల్లో 830 మంది డీఆర్ చేయాల్సి ఉంది. వీరిలో 200 మంది పీజీలకు రాష్ట్రవ్యాప్తంగా ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. జిల్లా స్థాయిలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రణాళిక, అమలు, పర్యవేక్షణపై పీజీ విద్యార్థులకు అవగాహన కల్పించడమే డీఆర్ ముఖ్య ఉద్దేశం. ప్రీ, పారా క్లినికల్ రెసిడెంట్‌లు రోగనిర్ధారణ/ప్రయోగశాలలు, ఫార్మసీ, ఫోరెన్సిక్ సేవలు, సాధారణ వైద్య విధులు, ప్రజారోగ్య కార్యక్రమాలపై శిక్షణ పొందుతారు. క్లినికల్ స్పెషాలిటీ రెసిడెంట్‌లు ఆయా స్పెషాలిటీ ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్, క్యాజువాలిటీ, ఇతర ప్రాంతాలలో సేవ చేయడంతోపాటు రాత్రి విధులు నిర్వహించాల్సి ఉంటుంది. పీజీలకు వసతి, స్టైఫండ్ సౌకర్యాన్ని వైద్య శాఖ కల్పిస్తోంది. డీఆర్ కార్యక్రమానికి ఏపీవీవీపీ కమిషనర్ రాష్ట్ర నోడల్ అధికారిగా, డీసీహెచ్ఎస్‌లు జిల్లా నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు. వీరు పీజీ రెసిడెంట్‌లకు శిక్షణ నాణ్యతను, హాజరు, పనితీరు, ఇతర అంశాలను పర్యవేక్షిస్తారు. పీజీ తుది పరీక్షకు హాజరు కావడానికి ముందు డీఆర్ సంతృప్తికరంగా పూర్తి చేయడం తప్పనిసరి.

200 మంది పీజీలు గ్రామీణ సేవల్లో ఉంటారు

వైద్య కళాశాలల నుంచి వచ్చిన వివరాల ఆధారంగా పీజీ వైద్యులను ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో నియమించాం. వారికి వసతి, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నాం. రొటేషన్ పద్ధతిలో పీజీలు డిస్ట్రిక్ట్ రెసిడెన్సీకి వస్తుంటారు. ఈ క్రమంలో ఏడాది పొడవునా కనీసం 200 మంది పీజీ వైద్యులు రాష్ట్రంలో గ్రామీణ సేవల్లో ఉంటారు. క్షేత్ర స్థాయిలో వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలు, గ్రామీణ ఆస్పత్రుల పనితీరు తెలుసుకోవడానికి వైద్య విద్యార్థులకు ఈ కార్యక్రమం ఓ మంచి వేదిక. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్క పీజీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ వినోద్ కుమార్, కమిషనర్ ఏపీవీవీపీ

ఆయన ఒకదానిపై ఒకటి ఏడు ఆకాశాలు సృష్టించాడు. అందులో చంద్రుణ్ణి (చల్లటికాంతి వెదజల్లే) జ్యోతిలా చేశాడు. సూర్యుణ్ణి (దేదీప్యమానమైన) దీపంగా సృజించాడు. ఇదంతా మీకు కన్పించడం లేదా?'

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, మార్చి, 3

కొండల్లో కాషాయ రాగం

'ఎవడన్నా కోపంగా కొడతాడు, లేకపోతే బలంగా కొడతాడు... వీడేంట్రా చాలా శ్రద్ధగా కొట్టాడు!' ఇది ఓ హిట్ సినిమాలో ఫైట్ చేసిన హీరోను ఉద్దేశించి ఓ ఛోటా విలన్ పాపులర్ డైలాగ్. సమయం, సందర్భం వేరైనా... గురువారం నాడు వెలువడ్డ మూడు ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయాలకు ఇదే డైలాగ్ సరిగ్గా సరిపోతుంది. త్రిపుర అసెంబ్లీ స్థానాల్లో సగానికి పైగా గెలిచి, బీజేపీ ఆ రాష్ట్రాన్ని స్వీప్ చేసింది. నాగాలాండ్‌లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీపీపీ కూటమి అధిక స్థానాలు సాధించి, సర్కారు ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోంది. మిగిలిన మేఘాలయలో ఎన్పీపీ అధిక స్థానాలు దక్కించుకున్నా, అక్కడా ప్రస్తుత సీఎం కన్రాడ్ సంగ్మా చూపు నిన్నటి దాకా తమ ప్రభుత్వంలో భాగమైన బీజేపీని మళ్ళీ కలుపుకోవడం మీదే ఉంది. వెరసి, ముచ్చటగా మూడు రాష్ట్రాలూ బీజేపీ జేబులోనే! అదీకాక అటు సీపీఎం, ఇటు కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తదితరుల్ని కనుమరుగు చేసి, కాషాయం రెపరెపలాడడం విశేషం.

కొన్నేళ్ళ క్రితం ఈశాన్యంలో సీట్ల బలమే కాదు... ఓటర్ల బలగం కూడా లేని కాషాయ పార్టీ ఇప్పుడు అక్కడి రాష్ట్రాలన్నిటిలో కాంగ్రెస్‌ను తోసిపుచ్చి, తిరుగులేని శక్తిగా నిలవడం ఆషామాషీ కాదు. అందుకు ఆ పార్టీ దీర్ఘకాలిక వ్యూహం, ఎన్నికల లెక్కల్లో స్థానిక పొత్తులు వగైరా అనేకం ఉన్నాయి. గిరిజన జనాభా, క్రైస్తవులు ఎక్కువగా ఉండే ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ స్వరం మార్చింది. మతపరమైన అంశాలు, గొడ్డుమాంసంపై నిషేధం లాంటి ప్రస్తావనలే తేకుండా తెలివిగా వ్యవహరించింది. మైనారిటీల అభద్రతనూ, సెంటిమెంట్లనూ రెచ్చగొట్టే తెలివితక్కువ పనికి దిగలేదు. పైగా, కేంద్రంలోని అధికారపక్షంతో స్నేహంగా సాగాలని భావించే అభివృద్ధి ఆధారిత ప్రజాస్వామ్యాన్ని ఈ సుదూర పర్వతప్రాంత రాష్ట్రాలు నమ్మడం సాధారణం. అందుకు తగ్గట్లే పొరుగునే బీజేపీ పాలిత అస్సామ్‌లోని అభివృద్ధి నమూనాను చూపి, ఓటర్లను బీజేపీ తన వైపు తిప్పుకొంది.

త్రిపురలో కాంగ్రెస్, టీఎంసీ, కొత్తగా వచ్చిన 'టిప్రా మోటా పార్టీ'లతో త్రిముఖ పోటీని ఎదుర్కొన్న కమలనాథులు వరుసగా రెండోసారీ గద్దెనెక్కడం విశేషం. వ్యతిరేకతను ఎదుర్కొంటున్న విప్లవ్‌దేవ్‌ను సరైన సమయంలో సీఎంగా పక్కకు తప్పించి, మాణిక్ సాహాకు కిరీటం పెట్టడమూ బీజేపీకి వ్యూహాత్మకంగా ఫలించింది. గతంలో వరుసగా 7 సార్లు త్రిపురను పాలించి, శాసించిన సీపీఎంకు ఆ రాష్ట్రంలో ఇది వరుసగా రెండో పరాజయం. పైగా ఓట్లు 42 శాతం నుంచి 24 శాతానికి పడిపోవడం ఆ పార్టీకి ప్రమాదఘంటిక. 'టిప్రా' కింగ్‌మేకర్‌గా ఆవిర్భవించకున్నా, కలసి బరిలోకి దిగిన సీపీఎం – కాంగ్రెస్ అవకాశాలను దెబ్బ తీసింది. బెంగాలీ ఓటర్లపై టీఎంసీ పెట్టుకొన్న ఆశ అడియాసైంది. 2018తో పోలిస్తే బీజేపీ కూటమికి 11 శాతం ఓట్లు తగ్గినా, కమలనాథులే సొంతంగా సర్కారు ఏర్పాటు చేసే స్థితికి చేరుకోవడం ప్రతిపక్షాల అనైక్యతకు ప్రతిఫలం!

శుభవార్త ఏమంటే, అరవై ఏళ్ళ నాగాలాండ్ చరిత్రలో తొలిసారిగా మహిళలు ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావడం! పితృస్వామ్య భావజాలం ప్రబలంగా ఉండే ఈ గడ్డపై గతంలో పట్టణ మునిసిపల్ ఎన్నికల్లో స్త్రీల రంగప్రవేశానికి ప్రయత్నం జరిగినా, హింస రేగి పోటీ నుంచి తప్పుకోవాల్సొచ్చింది. కానీ ఈసారి ఏకంగా ఇద్దరు మహిళలు గెలవడం గమనార్హం. ఇది మార్పు పవనాలకు ప్రతీక. ఇక, వివిధ రాష్ట్రాల పార్టీలు (జేడీ–యూ, లోక్‌జనశక్తి, శరద్ పవార్ ఎన్సీపీ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా) నాగాలాండ్ బరిలో దిగడం చిత్రం. ఆరు సీట్లలో ఎన్సీపీ గెలవడం, పశ్చిమాన మహారాష్ట్ర నుంచి వచ్చి తూర్పున నాగాలాండ్‌లో సత్తా చాటి, పెద్ద ప్రతిపక్షంగా అవతరించడం విచిత్రం.

ఈశాన్య రాష్ట్రాల్లో అంచనాలకు అల్లంత దూరంలో ఆగిన కాంగ్రెస్ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరిగిన 6 ఉప ఎన్నికల్లో మాత్రం 3 చోట్ల విజయాలు సాధించింది. తమిళనాట ఈరోడ్ (ఈస్ట్), మహారాష్ట్రలోని కస్బాపేట్, బెంగాల్‌లో టీఎంసీ నుంచి చేజిక్కించుకున్న సాగర్‌దిఘీ స్థానాలు హస్తానికి కొంత ఊరట. ఈరోడ్ గెలుపు వెనుక అధికార డీఎంకెతో పొత్తు, కస్బాలో విజయానికి మహా వికాస్ అఘాడీ కూటమి మద్దతు, 2021 ఎన్నికల్లో ఖాతా తెరవలేకపోయిన బెంగాల్‌లో ఈసారి సీపీఎం అండ కాంగ్రెస్‌కు కలిసొచ్చింది నిజమే. అయితే, 32 ఏళ్ళుగా కంచుకోటైన పుణేలోని కస్బాపేట్‌లో బీజేపీ ఓటమి ఆలోచన రేపుతోంది. అదే సమయంలో మిగతా 3 ఉప ఎన్నికల్లో బీజేపీ గెలవడం, అందులోనూ రామ్‌గఢ్‌ను కైవసం చేసుకోవడం విస్మరించలేం.

ఒకరకంగా ఈ ఫలితాలు ప్రతిపక్షాలకు ఆత్మశోధన అవకాశం. ఏ మాటకా మాట – ఈశాన్య రాష్ట్రాల ఎన్నికలను బీజేపీతో పోలిస్తే కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాలు ఏ మేరకు సీరియస్‌గా తీసుకున్నాయన్నది అనుమానమే. ప్రధాని, కేంద్ర హోమ్‌మంత్రి సహా పలువురు పదేపదే ఈశాన్యంలో పర్యటించారు. ప్రతిపక్షాలపై ప్రచారదాడి చేశారు. స్థానిక స్థితిగతులకు అనుగుణంగా వ్యాఖ్యలు, వ్యూహాలు మార్చుకున్నారు. ప్రతిపక్షాల్లో గెలిచితీరాలనే ఆ పట్టుదల, ఎన్నికల చాణక్యం కొరవడ్డాయి. మరి రెండు నెలల్లో కర్ణాటక, ఆ వెంటనే మధ్యప్రదేశ్, రాజస్థాన్ – ఇలా అనేక రాష్ట్రాల్లో ఎన్నికలు రానున్న వేళ ప్రతిపక్షాలకు ఈ ఫలితాలు ఓ మేలుకొలుపు. ఐక్యత, ఐడియాలజీ ఏదీ లేకుండా ఒక్క మోదీ వ్యతిరేక మంత్రమే ఫలిస్తుందనుకుంటే పొరపాటు. ప్రత్యర్థి బలవంతుడైనప్పుడు ప్రత్యామ్నాయ వ్యూహాలు, అజెండాలు లేకుండా సవాలు చేస్తే శృంగభంగం తప్పదు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు మేలుకుంటే... కోలుకుంటాయి. లేదంటే, ఎన్నికలు ఏవైనా ఫలితాలు కాస్త అటూ ఇటుగా ఇలాగే ఉంటాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.ఏకాదశి ఉ.8.53 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** పునర్వసు సా.4.27 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** రా.1.21 నుండి 3.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.42 నుండి 9.29 వరకు, తదుపరి ప.12.34 నుండి 1.23 వరకు, **అమృతఘడియలు:** ప.1.47 నుండి 2.45 వరకు

సూర్యోదయం : 6.22
సూర్యాస్తమయం: 6.02
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

పెట్టుబడులకు పట్టం... ప్రగతికి సాక్ష్యం

సందర్భం



గుడివాడ అమర్‌నాథ్

'మనసుంటే మార్గం ఉంటుంద'నే మన తెలుగువాళ్ల నానుడి జగన్ ప్రభుత్వ వ్యవహార శైలికి చక్కగా నప్పుతుంది. రాష్ట్ర అభివృద్ధి కేవలం ప్రభుత్వం దగ్గర నిధులు ఉంటేనే సాధ్యం అనేది ఈ గ్లోబల్ యుగంలో అవాస్తవం అని వైసీపీ ప్రభుత్వం నిరూపిస్తోంది. ఆయా ప్రాంతాలలో ఉన్న వనరుల లభ్యతను అధ్యయనం చేసి... మూడు ప్రాంతాలలో స్థానిక పరిస్థితులకు అనుకూలమైన పరిశ్రమల స్థాపనకు ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోంది. దేశంలోనే రెండో అతి పొడవైన కోస్తా తీరాన్ని కలిగి ఉన్న ఏపీ... అద్భుతమైన వ్యూహంతో దానిని అభివృద్ధి వనరుగా మార్చుకో చూడటం ఇందుకు ఒక ఉదాహరణ. విశాఖలో గ్లోబల్ సమ్మిట్ ద్వారా ఇటువంటి ఎన్నో వనరుల వినియోగాన్ని సాకారం చేయబోతోంది ఏపీ ప్రభుత్వం.

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక విప్లవానికి అంకురార్పణ జరుగుతోంది. పారిశ్రామిక ప్రగతి ఇప్పటివరకు ఒక లెక్క... ఇకపై ఇంకో లెక్క. గత ప్రభుత్వాలకు అసాధ్యమైన పారిశ్రామిక అభివృద్ధిని చేసి చూపించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. మనసుపెట్టి ప్రయత్నిస్తే పరిశ్రమలు రాష్ట్రానికి పరుగులు తీస్తాయన్న గట్టి నమ్మకంతో తన శ్రేణులను నడిపిస్తున్నారు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి. గత ప్రభుత్వాలు రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని చిన్నచూపు చూశాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు పరిశ్రమలను తీసుకురావాలన్న ఆలోచన ఆయా ప్రభుత్వాలకు కలగకపోవడం వల్లే ఈ రెండు ప్రాంతాలు అభివృద్ధిలో వెనకబడి పోయాయి. రాష్ట్ర విభజన తర్వాత అయినా రెండు ప్రాంతాలపై దృష్టి సారించిన దాఖలా గత ప్రభుత్వానికి లేకుండా పోయింది. ఫలితంగా వేలాది మంది వలసపోవలసిన పరిస్థితి వచ్చింది. కానీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని మూడు ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి పదునైన ప్రణాళిక రచించారు.

రాష్ట్రంలో ఉన్న 974 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతాన్ని ఎలా ఉపయోగించుకోవాలో గత ప్రభుత్వాలకు తెలియలేదు. తీరం వెంబడి పెద్ద ఎత్తున పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి భారీ అవకాశాలు ఉన్నాయని గ్రహించిన ముఖ్యమంత్రి ఇప్పటివరకు అడ్రస్ లేకుండా పడి ఉన్న 'మ్యారిటైమ్ బోర్డు'ను వెలుగులోకి తీసుకువచ్చారు. ఈ బోర్డు ద్వారా 15 వేల కోట్ల రూపాయలు పెట్టుబడితో... పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి పునాది వేశారు. ఇవి సాకారం అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుంది. గత ప్రభుత్వం పోర్టుల పేర్లు చెప్పి పునాదిరాళ్లు వేసి ప్రచారం చేసుకుందే తప్ప... ఒక పోర్టు పని కూడా ప్రారంభించలేక పోయింది.

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్ల కాలాన్ని కరోనా మింగేసింది. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను తట్టుకుంటూనే భవిష్యత్తు ప్రణాళికలపై విస్తృతమైన ఆలోచనలు చేస్తూ వచ్చింది. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలను తీసుకురావాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు'ను విశాఖలో నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సుకు దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామిక దిగ్గజాలను ఆహ్వానించింది. ముఖ్యమంత్రి స్వయంగా ఢిల్లీ వెళ్లి ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఈ సదస్సుకు ఆహ్వానించారు. దేశ, విదేశాల నుంచి సుమారు 26 చార్టెడ్ ఫ్లైట్‌లలో పారిశ్రామిక ప్రముఖులు తరలి వస్తున్నారంటే ఈ సదస్సుకున్న ప్రాముఖ్యత ఏమిటో అర్థమవుతుంది. ముఖ్యమంత్రి జగన్ నాయకత్వం, వాణిజ్యవేత్తలతో ఆయన నెరపే స్నేహపూర్వక శైలి, పారదర్శక



పరిపాలన, కార్యాలయాలకు వెళ్లనవసరం లేకుండానే ఆన్‌లైన్‌లో ఒక్క క్లిక్‌తో అన్ని అనుమతులు పొందగలగడం... పెట్టుబడిదారులు ఏపీ వైపుకు రావడానికి కారణాలు అని చెప్పడం అతిశయోక్తి కాదు.

ఈ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు విశాఖలో నిర్వహించడానికి ప్రత్యేక కారణాలు లేకపోలేదు. సౌందర్యానికి పుట్టినిల్లు అయిన ఈ నగరాన్ని దేశ పటంలో అగ్రగామిగా నిలపాలన్నది ముఖ్యమంత్రి ఆలోచన. భారతదేశానికి గేట్ వేగా నిలిచిన విశాఖ... పారిశ్రామిక నగరంగా ఇప్పటికే గుర్తింపు పొందింది. తనకున్న పలుకుబడిని ఉపయోగించి ఈ నగరానికి మరిన్ని పరిశ్రమలను తీసుకువస్తే, పారిశ్రామిక రాజధానిగా వెలుగొందుతుందన్నది ఆయన ఆలోచన. పరిపాలన రాజధానిని విశాఖకు తీసుకురావాలని నిర్ణయించుకున్న ఆయన ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

తూర్పు తీరంలో రోడ్డు, రైలు, జల, వాయు రవాణా నెట్ వర్క్ సౌకర్యం కల్గిన రెండవ పెద్ద పారిశ్రామిక నగరం విశాఖ. అద్భుతమైన సహజ నౌకాశ్రయం ఇక్కడే ఉంది. విశాఖ నుంచి దేశ నలుమూలలకూ ప్రయాణించేందుకు అనువైన ఫోర్ వే నెట్ వర్క్ మార్గం ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పోర్టులు, సముద్ర వాణిజ్యం, సెజ్‌లు, కారిడార్లు, భారీ పరిశ్రమలు, విద్యుత్తు పరిశ్రమలు, సర్వీసు సెక్టార్, వేలల్లో చిన్న తరహా పరిశ్రమలు, రక్షణ, ఫార్మా, ఆయుర్వేదం, ఐటీ, వ్యవసాయం, గిరిజన ఉత్పత్తులు, మైనింగ్ పరిశ్రమలు, విద్యా హబ్, హెల్త్ టూరిజం, అంతర్జాతీయ పర్యాటక రంగాల నుంచి విశాఖకు ఎంతో ఆదాయం లభిస్తోంది.

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రభుత్వం 2019 జూన్ నుంచి 2022 డిసెంబర్ వరకూ వివిధ ఔట్‌రీచ్ కార్యక్రమాలను నిర్వహించింది. 2019 ఆగస్టులో నిర్వహించిన తొలి ఔట్ రీచ్‌లో 34 దేశాల రాయబారులు, హైకమిషనర్లు, కాన్సులేట్ జనరళ్లు భాగస్వాములయ్యారు. 2022 ఫిబ్రవరి 11 నుండి ఫిబ్రవరి 17 వరకు దుబాయ్ ఎక్స్‌పోలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాల్గొంది. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లోనూ ముఖ్యమంత్రి నాయకత్వంలో మంత్రులు– అధికారుల బృందం పాల్గొంది. ఈ సందర్భంగా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల స్థాపన కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యక్ష, పరోక్షంగా 38,000 మందికి ఉపాధి కల్పించే 4 అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసింది.

2019–2022లో 60.5 వేల మందికి ఉపాధి కల్పించేందుకు కట్టుబడి ఉన్న ప్రభుత్వం 21 భారీ, మెగా ప్రాజెక్టులకు తగిన ప్రోత్సాహకాలను మంజూరు చేసింది. వాటిలో జిందాల్ స్టీల్ పవర్ లిమిటెడ్, ఇండోసాల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్, జేఎస్ డబ్ల్యూ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి మేజర్ పరిశ్రమలు ఏపీలో ఈ మూడేళ్ల కాలంలో కొలువుదీరాయి.

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం స్పష్టమైన విధానాలు రూపొందించి అనేక పారిశ్రామిక ప్రోత్సాహకాలను అందజేస్తోంది. 'పారిశ్రామిక అభివృద్ధి విధానం 2020–23','ఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్స్ పాలసీ 2022–27', 'ఆంధ్రప్రదేశ్ ఎగుమతి ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ పాలసీ 2022–27' వంటి అనేక విధానాలను రూపొందించి జగన్ ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకూ, ఇప్పటికే స్థాపించినవాటికీ ఇంతకు ముందెన్నడూ లేని విధంగా ప్రోత్సాహకాలు అందిస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వం ఎమ్ఎస్ఎమ్ఈ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తోంది. కోవిడ్ మహమ్మారి సమయంలో ఎంఎస్ఎమ్ఈలు ఎదుర్కొన్న కష్టాలను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం రూ. 962.42 కోట్ల 'రీస్టార్ట్' ప్యాకేజీతో ముందుకు వచ్చింది. ఇది సుమారు 8 వేల ఎమ్మెస్ఎమ్ఈలు ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకుని నిలబడటానికి సహాయపడింది.

అనుకూలమైన పారిశ్రామిక విధానాల ద్వారా అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా 'వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం' వంటి పథకాలను రూపొందించింది ప్రభుత్వం. ఈ పాలసీ ప్రధాన లక్ష్యం... పరిశ్రమలకు, ప్రత్యేకించి షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు వంటివారితో సహా నిరుపేద వర్గాలచే ప్రారంభించబడిన ఎమ్ఎస్ఎమ్ఈలకు అదనపు ప్రోత్సాహాన్ని అందించడం.

గత పాలకులు... ముఖ్యంగా రాష్ట్ర విభజన తర్వాత అధికారాన్ని వెలగబెట్టినవారు సమతుల అభివృద్ధికి ఏమాత్రం కృషిచేయని నేపథ్యంలో వైసీపీ... ఏపీ ప్రభుత్వ పగ్గాలు చేపట్టి తనదైన విజన్‌తో ముందుకు దూసుకుపోతుందనేది పై వివరాల వల్ల అర్థమవుతోంది. ఈ పురోగామి ప్రయాణంలో విశాఖ సమ్మిట్ కేవలం ఒక మజిలీ మాత్రమే!

వ్యాసకర్త ఏపీ పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

జీవన లీల



మన మానవ జాతి ఉనికిలోకి వచ్చిన ఈ రెండు లక్షల సంవత్సరాల్లోనే 110 బిలియన్ల(11,000 కోట్ల) మంది చనిపోయారు. ఉఫ్! అయినప్పటికీ ఇంకా ఈ వాస్తవం వెనుక ఉన్న పరమార్థం ఏమిటో మనకు ఏమాత్రం తెలీదు. బతికి ఉన్నవాళ్లలో కూడా కొందరు మాత్రమే దీన్ని పట్టించుకుంటారు.

– జోసెఫ్ టి. నూనీ, రచయిత

ఆసక్తికరం



హిందుత్వ తొలి ప్రాధాన్యమైన బీజేపీ, ఈశాన్య భారత రాష్ట్రాల్లో ఎలా ప్రజాదరణ పొందుతోంది అనేదాని మీద వివరణాత్మక విశ్లేషణలు రావాలి. ఏదో ఎన్నికల రోజు నాలుగు హడావిడి మాటలు కాకుండా.

– దీప్ హల్దార్, సంపాదకుడు

ఎలా ఎదుర్కొంటుంది?



న్యాయవ్యవస్థ భారత ప్రజాస్వామ్యంతో పోరాడుతోంది. దీనిగురించి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం ఏం చేస్తుందన్నది ప్రశ్న.

– నూపుర్ జె. శర్మ, సంపాదకురాలు

మనమే పెద్దలం



తల్లిదండ్రులతో ప్రయాణం అంటే, వాళ్లకు సంబంధించిన ప్రతిదీ చూసుకోవడం, వాళ్లు నిద్రిస్తున్నప్పుడు కూడా. మనం పిల్లలుగా ఉన్నప్పుడు వాళ్లు మనల్ని చూసుకున్నట్టే.

– దీపశిఖా ఘోష్, వైద్యురాలు

వన్‌సైడ్ మ్యాచ్



ఇండియా–ఆస్ట్రేలియా మ్యాచ్ స్కోర్లను మరిచిపోండి. దానికంటే రసవత్తరమైన మ్యాచ్ పాకిస్తాన్‌లో జరుగుతోంది. అందరికళ్లూ పాకిస్తాన్ రూపాయి విలువ (డాలర్‌తో పోల్చితే) 300కు పడిపోతుందా అనేదానిమీదే ఉన్నాయి. ఒక్కరోజులోనే 10 శాతం తగ్గింది. ఇది పతనానికి ప్రారంభం.

– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

చారిత్రక సంస్కరణ



ఎన్నికల కమిషన్‌ను సంస్కరించేలా కీలక మార్గదర్శకం ఇస్తూ చారిత్రక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టుకు అభినందనలు. ఎన్నికల కమిషనర్లు ఇకనుంచీ కేవలం ప్రభుత్వం వల్ల మాత్రమే నియమితులు కాకుండా – ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ వారిని నియమిస్తుంది. ప్రభుత్వానికి ఏజెంటుగా పనిచేస్తున్న ఎన్నికల కమిషన్ పనితీరు మీద దీనివల్ల మంచి ప్రభావం పడగలదు.

– ప్రశాంత్ భూషణ్, యాక్టివిస్టు– న్యాయవాది

అద్దె మేలు



కలల నగరం ముంబయిలో నేను నివసిస్తాను. నా ఫ్లాట్ విలువ 7 కోట్లు. కానీ నేను చెల్లించే అద్దె 1.5 లక్షలు. దాన్నే నేను కొనివుంటే నెల కిస్తీ కింద 5 లక్షలు కట్టాల్సి వచ్చేది. అది కూడా డౌన్ పేమెంట్ 1.4 కోట్లు చెల్లించిన తర్వాత. అందుకే నేను ఇల్లు కొనను.

– శరణ్ హెగ్డే, ఫైనాన్స్ క్రియేటర్

ఇంటర్ పిల్లలు చితికి పోవాల్సిందేనా?

చదువు అంటే ఏమిటి? అది ర్యాంకులు, మార్కుల కోసమేనా లేక జ్ఞానం, దాని ద్వారా వచ్చే చైతన్యం కోసమా? ర్యాంకులు, మార్కుల పోటీలో పడి పిల్లలు తనువు చాలించాలా? చదువంటేనే ర్యాంకులు అనే నిర్వచనాన్ని ఇవ్వడం సమంజసమేనా? 'దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మాణం అవుతుంది' అని చెప్పిన కొఠారీ కూడా చదువు ఇలా కార్పొరేట్ చేతుల్లో బందీ అయ్యి దేశ భవిష్యత్తు నిర్మించే వారిని బలి తీసుకుంటుందని ఊహించలేదు. ఇప్పుడు ఎంత డబ్బు పెడితే అంత చదువు అనే సిద్ధాంతం పుట్టుకొచ్చింది. చదువుకు పెట్టే పెట్టుబడి తిరిగి ఉద్యోగ రూపంలో సంపాదించడం తప్ప... సమాజం, సమాజ అవసరాల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదనే భావన పిల్లలూ, తల్లి దండ్రుల్లో కలిగేలా చేసింది కార్పొరేట్ విద్యా వ్యవస్థ. బాగా సంపాదించాలంటే మంచి మార్కులు రావాలి. మంచి మార్కులు కోసం కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదవాలి, మంచి మార్కులు రాకపోతే జీవితం వ్యర్థం అనే భావనను కార్పొరేట్ విద్యాసంస్థలు కల్పించాయి.

అందుకే విద్యార్థులకు మంచి మార్కులు, ర్యాంకులు రాకపోతే పిల్లలను తల్లిదండ్రులూ దండిస్తున్నారు. 2016–2019 మధ్య దేశ వ్యాప్తంగా 23,671 మంది విద్యార్థులు చనిపోయారని కేంద్రమంత్రి పార్లమెంట్‌లో ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ విద్యలో ఈ రకమైన ర్యాంకుల, మార్కుల దాహంతో కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులను వారి వ్యాపార కాంక్ష కోసం బలితీసుకుంటున్నాయి. అందుకే...


'అసలు అవి ఇంటర్ కాలేజీలు కాదు, కాన్సన్ట్రేషన్ క్యాంపులు' అంటూ వ్యాఖ్యానించారు ప్రొఫెసర్ నీరదా రెడ్డి. 2001లో విద్యార్థి ఆత్మహత్యలపై అప్పటి ప్రభుత్వం నీరదా రెడ్డి కమిటీని నియమించింది. ఇంటర్ విద్యను కార్పొరేట్ రంగం ఎలా శాసిస్తుందో ప్రొఫెసర్ నీరదా రెడ్డి నివేదిక వివరించింది. రోజుకు 16 గంటలు పాఠాలు చెప్తున్నారనీ, మార్కుల ప్రకటన రోజు ఆత్మహత్యలు మామూలు అయిపోయాయనీ, హాస్టళ్లు సరిగా లేవనీ, ఒత్తిడిలో ఉన్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చే వ్యవస్థ లేదనీ... ఇలా ఎన్నో లోపాలు ఎత్తి చూపారామె. ఆటలు, వినోదం అసలు లేవు. అసలు సైన్స్ ల్యాబ్ అనే ప్రశ్నే లేదు. మార్కులు తగ్గితే తక్కువ సెక్షన్లకు మార్చే పనిష్మెంట్ విధానం పిల్లలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. కానీ ఆ కమిటీ నివేదిక వచ్చిన 22 ఏళ్ల తరువాత కూడా పరిస్థితి ఏమీ మారలేదు. నార్సింగిలో ఈ వారంలో సాత్విక్, అంతకంటే ముందు ఫిర్జాదిగూడలో రమాదేవి 20 రోజుల వ్యవధిలోనే ఒకే కార్పొరేట్ విద్యా సంస్థకు చెందిన కాలేజీల్లో మరణించారు. ప్రతిరోజూ 16 గంటల పాటు చదువులోనే గడపడం వల్ల నిద్ర కరువై, మానసిక ప్రశాంతత లేక అత్యధిక ఒత్తిడితో పెద్ద ఎత్తున విద్యార్థులు చనిపోతున్నారు. ఒకప్పుడు విద్యార్థి ఆత్మహత్య అంటే కాలేజీలు అట్టుడికిపోయేవి. ఇప్పుడు ప్రతి ఏటా కార్పొరేట్ కాలేజీల్లో ఆత్మహత్యలు మామూలే అనే పరిస్థితి వచ్చింది.

చివరగా సాత్విక్ రాసిన సూసైడ్ నోట్ చదివైనా తల్లి దండ్రులు మారాలి. ర్యాంకులు, మార్కులు మాత్రమే జీవితాలను నిలబెట్టవు. ఎంత డబ్బు పెడితే అంత చదువు అనే భ్రమలో నుండి తల్లిదండ్రులు బయటకు రావాలి. ఆత్మహత్యలు ఆగిపోవాలంటే ప్రభుత్వాలు విద్యారంగంలో తగిన మార్పులు తేవాలి. ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేసి నమ్మకం కల్పించాలి. అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్యను అందించాలి.

– టి. నాగరాజు, ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి । 94900 98292

వెనుకటి గుణమేల మాను...

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గది మా అడ్డ. మా దోస్తులంత గాడ జమైతరు. గీ దాని మీద గా దాని మీద అనకుంట అన్నిటి మీద మాట్లాడుతుంటరు. రాజకీయాల మీద మాట్లాడుకుంట మాటల్లోనే కొట్లాడ్తుంటరు. గా దినం నేను బోక ముందు ఏం మాట్లాడుకుండ్రో నాకెర్క లేదు. గని నేను బోయినంక గీ తీర్గ మాట్లాడుకున్నరు.

''గియ్యాల్రేపు కుక్క కాట్లు ఎక్వ అయినయి గదా! కుక్కలను పట్టుకునే తండ్కు జీహెచ్ఎంసీ ఏం జేస్తున్నది'' అని సత్నారి అడిగిండు.

''ఏం జేస్తున్నదో నాకెర్క లేదు గని కుక్కలు కర్వకుండ ఉండాలంటె ఏం జెయ్యాలని జెప్పిందో నాకెర్క'' అని ఇస్తారి అన్నడు.

''ఏం జెప్పిందో జెర జెప్పరాదు''

''కుక్క అంటె ఎవరు. కాలభైరవుడు. కాలభైరవుడు అంటె ఎవరు? దేవుడు. గా దేవునికి గుడి గట్టాలె. దినాం పూజలు జెయ్యాలె. కాలభైరవ అష్టకం సద్వాలె. భౌ భౌ మనుకుంట బజనలు జెయ్యాలె. గట్ల జేస్తిరా అంటె కుక్కలు మీ తెరువు రావు అని జీహెచ్ఎంసీ జెప్పింది.''

''ఇంకేమన్న జెప్పిందా?''

''బిస్కిట్ పుడ దగ్గర ఉంచుకోండ్రి. తొవ్వ పొంటి బోతుంటె కుక్కలు గిన గండ్లబడ్తె బిస్కిట్లు ఎయ్యండ్రి. బిస్కిట్లు దినుకుంట గవ్వి మీ దగ్గరకు రావు.గిట్ల రొండు మూడు దినాలు బిస్కిట్లు ఏస్తిరా అంటె మిమ్ములను సూడంగనే గవి తోక ఊపుతయి. కుక్కలను నువ్వు ప్రేమిస్తె కుక్కలు నిన్ను ప్రేమిస్తయి. కుక్కలు ప్రేమతోని దగ్గరకొస్తె జల్దిజల్ది నడ్వొద్దు. గట్ల జేస్తిరా అంటె కుక్కలకు తిక్క లేస్తది. కుక్క మీ దిక్కు గిన జూస్తె మీరు ఇంకొక దిక్కు సూడుండ్రి. కుక్క కండ్లల్ల కండ్లు బెట్టి జూస్తిరా అంటె గా దాన్కి కోపమొస్తది. ఒక కుక్కను ఇంకొక కుక్క సూటిగ జూస్తె నడుస్తది. గని నీ అసుంటోడు నా అసుంటోడు జూస్తె నడ్వదు. కుక్కకు కుక్కనే సమానం. మన్సి గాదు. కుక్క గిన మొర్గుకుంట దగ్గరకొస్తె అటిటు మెస్లకుండ్రి. బొమ్మ లెక్క నిలబడుండ్రి. గట్ల నిలబడ్తిరా అంటె మిమ్ములను ఆసన జూస్తది. ఆసన జూసినా బొమ్మ లెక్కనే ఉండుండ్రి. గది కాలు మీదికి లేపి జెర సేపైనంక బోతది అని జీహెచ్ఎంసీ జెప్పింది.''

''వాడ కట్టుల గుడ్క కుక్కలున్నయి జాగ్రత్త అనేటి బోర్డులు బెడ్తం. గా బోర్డులు జూసినోల్లు అటిటు జూస్కుంట మెల్లగ నడ్వాలె. జూ జూ అని బిలిస్తె కుక్కలు మీతోని దోస్తి జేస్తయి. కటీ కటీ అని కోప్పడ్తిరా అంటె అవి కరుస్తయి. ఎండ కాలమొస్తున్నది. మనకు దూపైన తీర్గనే కుక్కలకు గూడ దూపైతది. గవ్విటికి నీల్లు తాపియ్యాలె. నెలకు రొండుపార్లు మాంసం బెట్టాలె. గట్ల జేస్తిరా అంటె కుక్క కాటు బాద ఉండదు అని మేయర్ అన్నది'' అని యాద్గిరి జెప్పిండు.



''ఒగాల్ల కుక్కలన్ని మీటింగ్ బెట్టు కుంటె గా మీటింగ్ల మన గురించి ఏమ నుకుంటయి'' అని ఇస్తారి అడిగిండు.

''రాష్ట్రంల ఉన్న కుక్కలన్ని మీటింగ్ బెడ్తె లష్కర్ల ఉన్న పరేడ్ మైదాన్ల మీటింగ్ బెడ్తయి. గా మీటింగ్‌కు అన్ని తీర్ల గల్లి కుక్కలు వొస్తయి. భౌ భౌ మనుకుంట విష్ చేసుకుంటాయి. తోకలూపు కుంట కౌగిలిచ్చుకుంటయి'' అని సత్నారి ఇంకేమొ జెప్పబోతుంటె ఇస్తారి అడ్డం దల్గి – ''గవి ఏం మాట్లాడుకుంటయో జెప్పు'' అని అన్నడు.

''ముందుగాల కుక్కలన్నిటిని కూసోమని కుక్కల లీడర్ జెప్పింది. కుక్కలన్ని గూసున్నంక కుక్కల లీడర్ స్పీచ్ షురువు జేసిండు. ఐదు పది కుక్కలు మన్సులను గర్సె తల్కె పుజాల్ల అన్ని కుక్కలను బద్నాం జేస్తున్నరు. యానిమల్ బర్త్ కంట్రోల్ జేస్తమంటున్నరు. గిదేమన్న బాగున్నదా'' అని ఇంకేమొ మాట్లాడ బోతుంటే –

''మన కుక్కలు కర్వ బట్కె పట్నంల ఒక పిల్లగాడు సచ్చిపోయిండు గదా'' అని ఒక కుక్క అన్నది.

''కుక్క కాటుకు పిల్లగాడు సచ్చిపోయినందుకు మీ అందరి దిక్కు కెల్లి సంతాపం తెలియజేస్తున్న. మన్సుల కన్న మనమే మంచోల్లం. ఎవలన్న మనలను పెంచుకుంటె దినాం నాత్రి గాల్ల ఇల్లు కావలి గాస్తం. పోలీ సోల్లకు శాతగాని పనులు గూడ మనం జేస్తం. కుక్క కాటు కుక్క కాటు అనుకుంట మనలను పుజాల్ల బద్నాం జేస్తున్నరు. లీడర్ల కాటు గురించి ఎవలు మాట్లాడ్త లేరు. లీడర్ల కాటుకు ఎంతమంది సస్తున్నరో జెప్త లేరు. కుక్కలు మొరుగుతున్నయంటున్నరు. గని పార్టీల లీడర్లు ఒకల్లను జూసి ఒకలు ఏ తీర్గ మొర్గు తున్నరో ఎవ్వలకు ఎర్క లేదనుకుంటున్నరు. కుక్క తోక వొంకర అంటున్నరు. మన తోకనే వొంకర. గని మన్సుల బుద్దులే వొంకర. కనకపు సింహాసనమున శునకము గూర్చుండ బెట్టి అనుకుంట వెనుకటి గుణమేల మాను అని మనమీద పద్దెం రాసిండ్రు. గని కుర్సిల మీద గూసున్న లీడర్లు గాల్ల వెనకటి గుణం మానిండ్రా అని కుక్క లీడర్ అడిగింది'' అని సత్నారి అన్నడు.

తొమ్మిది గొట్టిదాంక గీ తీర్గ మా దోస్తులు ముచ్చట బెట్టిండ్రు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

క్లుప్తంగా...

త్వరలో తిరుమలకు 10 ఎలక్ట్రిక్ బస్సులు



ఓలెక్ట్రా కంపెనీ ఎలక్ట్రిక్ బస్సు (ధర్మ రథం)

తిరుమల: మేఘా ఇంజినీరింగ్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) ఆధ్వర్యంలోని ఓలెక్ట్రా గ్రీన్టెక్ లిమిటెడ్ టీటీడీకి నూతనంగా 10 ఎలక్ట్రిక్ బస్సులను (ధర్మరథం) అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. హైదరాబాద్‌లోని ఓలెక్ట్రా ఫ్యాక్టరీలో తయారు చేసిన ఎలక్ట్రిక్ బస్సులను టీటీడీ ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డి గురువారం పరిశీలించారు. తిరుమలలో భక్తులను తరలించేందుకు ప్రస్తుతమున్న 12 ధర్మరథాల స్థానంలో టీటీడీ సూచనలకు అనుగుణంగా ప్రత్యేకంగా ఎలక్ట్రిక్ బస్సులను ఓలెక్ట్రా కంపెనీ తయారు చేసింది. ఈ బస్సుల వినియోగం ద్వారా తిరుమలలో వాతావరణ కాలుష్యం మరింతగా తగ్గనుంది. కంపెనీ ఎండీ కేవీ ప్రదీప్ మాట్లాడుతూ 9 మీటర్లు పొడవు కలిగిన 10 ఎలక్ట్రిక్ బస్సులను త్వరలోనే టీటీడీకి అందజేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 50 ఎలక్ట్రిక్ బస్సులను ఏపీఎస్ఆర్టీసీకి అందించామని, ప్రస్తుతం తిరుపతి–తిరుమల మధ్య ప్రయాణికులను రవాణా చేస్తోందన్నారు.

కాణిపాకంలో గణపతి హవనానికి అంకురార్పణ



అంకురార్పణ పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

యాదమరి (చిత్తూరు జిల్లా): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి 3 రోజులపాటు నిర్వహించనున్న లక్ష మోదక లక్ష్మీ గణపతి హవనానికి గురువారం గణపతి పూజతో అంకురార్పణ చేశారు. ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాసన, అంకురార్పణ, అఖండ దీపారాధన నిర్వహించి అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహించారు. విశాఖ శ్రీ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి, వారి శిష్య బృందంతో లక్ష్మీ గణపతి హవనాన్ని నిర్వహించనున్నారు. అనంతరం దివ్య అనుగ్రహ సందేశాలు ఇవ్వనున్నారు.

సీబీఐ ముందు హాజరైన పీబీసీ ఉద్యోగి

కడప అర్బన్: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో కడపలోని కేంద్ర కారాగారం గెస్ట్‌హౌస్‌లో సీబీఐ అధికారుల ముందు పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) ఉద్యోగి సుధాకర్ గురువారం హాజరయ్యారు. హత్య జరిగిన రోజున వివేకా ఇంటికెళ్లిన వారిని సీబీఐ అధికారులు విచారణకు పిలిపించారు. సుధాకర్‌ను 2 గంటలకు పైగా విచారించారు. ఎంపీ అవినాష్‌రెడ్డితో ఫొటో దిగిన విషయమై ప్రశ్నించినట్లు సుధాకర్ చెప్పారు.

5 లేడి కూనల నరికివేత



స్వాధీనం చేసుకున్న లేడి కూనల తలలు, మాంసం

ఆత్మకూరు రూరల్: మాంసం కోసం 5 లేడి కూనల తలలు నరికివేసిన ఘటన నంద్యాల జిల్లా ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని వెలుగోడు రేంజ్ విబిఆర్ జలాశయం పక్కనున్న మామిడి తోటలో జరిగింది. కొందరు వేటగాళ్లు బుధవారం రిజర్వాయర్‌లో దాహం తీర్చుకోవడానికి వచ్చిన 5 లేడి కూనలను ఉచ్చులో బిగించి వాటి తలలు వేరు చేశారు. మాంసంగా మార్చి విక్రయం కోసం తూకాలు వేస్తుండగా సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది దాడిచేయగా వడ్డి శ్రీను, తెలుగు జయన్న, వడ్డి ఈశ్వర్ అనే వేటగాళ్ళు అక్కడ నుంచి పరారయ్యారు. ఘటనా స్థలంలో తలలు వేరుచేసిన లేడి కూనల కళ్లు ప్రతి ఒక్కరి గుండెలను బరువెక్కించాయి.

'చివరకు గెలిచేది బహుజన వాదమే'

తాడికొండ: పేదల సంక్షేమాన్ని అడ్డుకునేందుకు రాష్ట్రంలోని కులవాదులంతా ఏకమై ఎన్ని తప్పుడు కేసులు వేసినా చివరకు గెలిచేది బహుజన వాదమేనని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 886వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో గురువారం పలువురు మాట్లాడారు. దోపిడీకి అలవాటుపడ్డ బాబు అండ్ కో తప్పుడు ప్రచారాల కోసం ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని వండి వార్చుతున్న అవాస్తవ కథనాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

'ఆకాశం' నుంచి ఊడిపడ్డాయ్

స్మార్ట్‌ఫోన్‌లోని డిజిటల్ కెమెరా.. మెమరీ ఫోమ్ పరుపులు.. కారు టైర్లు.. గీతలు పడని లెన్స్.. వాటర్ ఫిల్టర్.. ఇవన్నీ 'ఆకాశం' నుంచి ఊడిపడ్డాయ్ తెలుసా? ఎందుకంటే ఇవన్నీ అంతరిక్ష ప్రయోగాల కోసం శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనల్లోంచి పుట్టినవి. మనం నిత్యం వాడే వస్తువులుగా మారిపోయాయి. మరి వీటి విశేషాలు ఏమిటో చూద్దామా..

మీకు తెలుసా?

గ్రహాంతర ప్రయోగాలు.. ఫోన్ కెమెరా..

➤ శాటిలైట్లలో బిగించేందుకు.. నాసాకు చెందిన జెట్ ప్రొపల్షన్ లేబొరేటరీ (జేపీఎల్) ఇంజనీర్ యూజీన్ లల్లీ మొదటిసారిగా 1960 దశకంలో డిజిటల్ కెమెరాలను రూపొందించారు. అవి పెద్ద పరిమాణంలో ఉండి, ఎక్కువ విద్యుత్ అవసరం పడేవి. దీంతో తక్కువ సైజులో ఉండే డిజిటల్ కెమెరాలపై పరిశోధన చేసిన జేపీఎల్ ఇంజనీర్ ఎరిక్ ఫోసమ్.. 1990 దశకం మొదట్లో 'సీఎంఓఎస్– యాక్టివ్ పిక్సెల్ సెన్సర్ (ఏపీఎస్)'ను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఫోన్ కెమెరాలు, వెబ్‌క్యామ్‌లు వంటి మినియేచర్ కెమెరాల్లో వాడుతున్న టెక్నాలజీ ఇదే.





అంతరిక్షంలోకి పంపకున్నా.. ఇళ్లలోకి వాటర్ ఫిల్టర్..

➤ నాసా చంద్రుడిపైకి మనుషులను పంపేందుకు సిద్ధమవుతున్న సమయంలోనే.. వాళ్లకు మంచి నీళ్ల ఎలాగనే పరిశోధనలూ చేసింది. వాడిన నీటిని తిరిగి శుద్ధిచేసుకుని వినియోగించుకునేలా 'ఎలక్ట్రోలైటిక్ సిల్వర్ అయాన్ జనరేటర్'ను అభివృద్ధి చేసింది. ఈ వాటర్ ఫిల్టర్‌ను అంతరిక్ష ప్రయోగాల్లో వాడలేదు. కానీ ప్రపంచవ్యాప్తంగా ఇళ్లలోకి వచ్చేసింది. అయితే దీనికన్నా మెరుగైన, ఖరీదైన టెక్నాలజీని 'అపోలో' ప్రయోగాల్లో వాడారు.

స్పేస్ షటిల్‌లో సీట్లు.. మెమరీ ఫోమ్ పరుపులు



➤ స్పేస్ షటిల్స్ అంతరిక్షంలోకి వెళ్లినప్పుడు, తిరిగి వచ్చేప్పుడు అత్యంత వేగంగా ప్రయాణిస్తాయి. వాటిలో ఉండే వ్యోమగాములపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. అలా ఒత్తిడిని తట్టుకోవడంతో పాటు మృదువుగా, సౌకర్యవంతంగా ఉండేందుకు నాసా 1960వ దశకంలో 'పాలీయూరేథీన్ సిలికాన్ ప్లాస్టిక్ (మెమెరీ ఫోమ్)' మెటీరియల్‌ను అభివృద్ధి చేసింది. స్పేస్ షటిల్ సీట్లలో అమర్చింది. అవే ఇప్పుడు మనం వాడుతున్న మెమరీ ఫోమ్ పరుపులు, దిండ్లు.

మార్స్‌పై దిగే ప్యారాచూట్ తాళ్లు.. కారు టైర్లు..



➤ 1976లో నాసా ప్రయోగించిన 'వైకింగ్ ల్యాండర్' అంగారకుడిపై సురక్షితంగా దిగేందుకు ప్యారాచూట్‌లను వినియోగించారు. అసలే మార్స్‌పై తేలికైన వాతావరణం, ఎక్కువ బరువున్న ప్రోబ్.. ప్యారా చూట్ తాళ్లు అత్యంత బలంగా ఉండాలి. దీనిపై నాసా విజ్ఞప్తి మేరకు.. 'గుడ్ ఇయర్ టైర్ అండ్ రబ్బర్ కంపెనీ' ఉక్కుకన్నా బలమైన రబ్బర్ మెటీరియల్‌ను రూపొందించింది. తర్వాత దీనిని వాహనాల టైర్ల తయారీలో వాడటం మొదలుపెట్టారు.

అనుకోకుండా కనిపెట్టిన.. స్క్రాచ్ రెసిస్టెంట్ లెన్స్..



➤ వ్యోమగాములు హెల్మెట్ కోసం గాజును వాడితే ప్రమాదకరం కావడంతో నాసా ఫైబర్ గ్లాస్‌ను వినియోగించింది. కానీ దానిపై సులువుగా గీతలు పడి ఇబ్బంది వస్తుండటంతో పరిష్కారంపై ప్రయోగాలు మొదలుపెట్టింది. అయితే చిత్రంగా టెడ్ వైడెవెన్ అనే శాస్త్రవేత్త వాటర్ ఫిల్టర్ కోసం చేస్తున్న ప్రయోగాల సందర్భంగా.. స్క్రాచ్ రెసిస్టెంట్ కోటింగ్‌ను అభివృద్ధి చేశారు. ఇప్పుడు కళ్లద్దాల నుంచి టీవీలు, మానిటర్లు, ఫోన్ స్క్రీన్ల దాకా ఈ కోటింగ్‌ను వాడుతున్నారు.

ఇంకా ఎన్నో..

➤ స్పేస్ ఫ్లైట్లలో, విమానాల్లో వాడేందుకు నాసా తోపాటు యునైటెడ్ ఎయిర్ లైన్స్ శాస్త్రవేత్తలు కలిసి వైర్ లెస్ హెడ్‌సెట్‌ను అభివృద్ధి చేశారు.
➤ నాసా స్పేస్‌లో ఆల్గే (నాచు)ను ఉపయోగించి ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే ప్రయోగాలు చేస్తుండగా.. పిల్లలకు పాలకు బదులుగా ఇచ్చే 'బేబీ ఫార్ములా' టెక్నాలజీని అభివృద్ధి చేశారు.
➤ స్టాన్‌ఫర్డ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్త డోగ్ ఎంగెల్‌బర్ట్.. నాసా చేసిన ఆర్థిక సాయం, సూచనలతోనే కంప్యూటర్ 'మౌస్'ను తయారు చేశారు.

– సాక్షి సెంట్రల్ డెస్క్

రాజకీయ కక్షలకు పరిశ్రమలు బలి

- చంద్రబాబు నాలుగుసార్లు దావోస్ పర్యటన
- సీఎం జగన్ ఒక్కసారి మాత్రమే వెళ్లారు
- రాష్ట్రంలో పరిశ్రమలపై టీడీపీ 'వాస్తవ పత్రం' విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రాజకీయ కక్షలు, ముడుపులకు పరిశ్రమలు బలైపోయాయని తెలుగుదేశం పార్టీ ఆరోపించింది. నాలుగేళ్లుగా పారిశ్రామికవేత్తలను అన్ని విధాలుగా వేధించి, ఇప్పుడు ఎన్నికల కోసం ప్రజలను భ్రమింపజేస్తూ విశాఖ సమ్మిట్ పెడుతున్నారని విమర్శించింది. గురువారం 'రాష్ట్రంలో పరిశ్రమలపై వాస్తవ పత్రం' పేరిట ఓ లేఖను విడుదల చేసింది. 'నాలుగేళ్లలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. కడప స్టీల్ ప్లాంట్‌కు రెండుసార్లు శంకుస్థాపన చేసినా, అడుగు ముందుకు పడలేదు. సీఎం జగన్ విధ్వంసంతో ఎన్నో పరిశ్రమలు మూతపడ్డాయి. రూ.17 లక్షల కోట్ల పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయి. చంద్రబాబు సీఎంగా దావోస్‌లో నాలుగుసార్లు పర్యటించి రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చి, 5.13 లక్షల ఉద్యోగాలు కల్పించారు. జగన్ మాత్రం దావోస్ సదస్సుకు ఒక్కసారి మాత్రమే హాజరయ్యారు. ప్రత్యేక హోదా అనే మాటే లేకుండా చేశారు. విభజన చట్టం కింద రావాల్సిన వాటిని సాధించలేకపోయారు. ఐటీ రంగాన్ని అటకెక్కించారు' అని ఆ లేఖలో పేర్కొంది.

పక్కాగా వైద్య పరికరాల నిర్వహణ

సాక్షి, అమరావతి: వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ఆ శాఖలో 49వేల ఉద్యోగాల భర్తీతోపాటు ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య పరికరాలు సమకూరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు వాటి నిర్వహణపైనా ప్రత్యేక దృష్టిపెట్టింది. ప్రభుత్వాస్పత్రుల్లో ఎక్కడైనా వైద్య పరికరం పాడైతే జాప్యం జరగకుండా వాటికి మరమ్మతులు చేపట్టడం.. అవసరమైతే మరో ప్రత్యామ్నాయ పరికరం సమకూర్చేలా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఈ పరికరాల నిర్వహణ బాధ్యతను సైరిక్స్ సంస్థకు వైద్యశాఖ అప్పగించింది.

ప్రతి పరికరానికి ట్యాగ్

ప్రభుత్వాస్పత్రుల్లో ఉండే ప్రతి వైద్య పరికరాన్ని ఓ గుర్తింపు నెంబర్‌తో పాటు, బార్ కోడ్‌తో ట్యాగ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న 1,139 పీహెచ్‌సీలు, 541 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 177 సీహెచ్‌సీలు, 52 ఏరియా, 13 జిల్లా, 5 ఎంసీహెచ్, 38 బోధన, రెండు డెంటల్ ఆస్పత్రుల్లో ఇప్పటికే ట్యాగింగ్ ప్రక్రియ పూర్తయింది. ఈ ఆస్పత్రుల్లో మొత్తం 90,089 పరికరాలున్నాయి. వీటిని క్రిటికల్, నాన్–క్రిటికల్ ఇలా రెండు విభాగాలుగా విభజించారు. క్రిటికల్ పరికరాలను 24 గంటల్లో, నాన్–క్రిటికల్ పరికరాలను ఏడ్రోజుల్లోగా మరమ్మతులు పూర్తిచేయాల్సిందిగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ) ఖరారుచేశారు.

ప్రత్యేక యాప్

ఇక ఈ వైద్య పరికరాల నిర్వహణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం వినియోగిస్తున్నారు. ఇందుకు ఓ ప్రత్యేక యాప్‌ను రూపొందించి డ్యాష్ బోర్డును ఏర్పాటుచేశారు. ఈ డ్యాష్ బోర్డులో రాష్ట్రంలోని అన్ని ఆస్పత్రులు, వాటిలో ఉన్న పరికరాలు, మరమ్మతుల్లో ఉన్నవి ఇతర వివరాలు ఉంటాయి. యాప్‌లో ప్రతి ఆస్పత్రికి ఒక లాగిన్ కేటాయించారు. ఈ క్రమంలో ఆస్పత్రిలో ఏదైనా పరికరం పనిచేయనట్‌లైతే వైద్యులు, సిబ్బంది యాప్‌లో లాగిన్ అయి టికెట్ రైజ్ చెయ్యొచ్చు. లేదంటే టోల్ ఫ్రీ నెంబర్ 18004253877కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసేలా అవకాశం కల్పించారు. నిర్దేశించిన సమయంలోగా పరికరాలకు మరమ్మతులు పూర్తిచేసే అవకాశంలేనప్పుడు ప్రత్యామ్నాయ పరికరాలను సమకూర్చాల్సిన బాధ్యత కాంట్రాక్టు సంస్థపై ఉంటుంది.

సకాలంలో మరమ్మతులు చేయకపోతే పెనాల్టీ

ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య పరికరాల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాం. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.70 కోట్ల మేర ఖర్చుచేయనుంది. నిర్ణీత గడువులోగా కాంట్రాక్టు సంస్థ పరికరాల మరమ్మతులు నిర్వహించకపోతే ఆన్‌లైన్‌లో మాకు కనిపిస్తుంది. ఇలా జరిగిన సందర్భాల్లో నిబంధనల ప్రకారం పెనాల్టి విధిస్తాం. ఇప్పటికే కాంట్రాక్టు సంస్థ పరికరాల నిర్వహణ ప్రారంభించింది. అన్ని ఆస్పత్రులకు ప్రత్యేకంగా లాగిన్ ఐడీలు ఇచ్చాం. ఏదైనా పరికరం పనిచేయకపోతే యాప్‌లో లాగిన్ అయి ఫిర్యాదు చెయ్యొచ్చు.

– జె. నివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్

విద్యే అభివృద్ధికి మార్గం

- విద్యావ్యవస్థలో దేశానికే మార్గదర్శకం సీఎం జగన్
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల



మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి

గుంటూరు రూరల్: విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, విద్యావ్యవస్థలో సమూల మార్పులను తెచ్చి ప్రతి విద్యార్థికి కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజావ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. గుంటూరులోని 41వ డివిజన్ అడవితక్కెళ్లపాడు సుందరయ్య కాలనీలో ప్రొఫెసర్ ఎం.వి.ఎస్.కోటేశ్వరరావు మెమోరియల్ ప్రాథమికోన్నత పాఠశాల భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేదరికంలో ఉన్న చిన్నారులకు విద్యను అందించి వారి అభివృద్ధికి కృషిచేసిన పాఠశాల కమిటీని అభినందించారు. అందరూ కలిసికట్టుగా కృషిచేస్తే సాధించలేనిది ఏదీలేదని ఈ పాఠశాల కమిటీ నిరూపించిందని ప్రశంసించారు. సీఎం జగన్ అమ్మ ఒడి పథకం ప్రవేశపెట్టటంతోపాటు ప్రతి విద్యార్థికి మంచి కార్పొరేట్‌స్థాయి విద్యను అందించాలనే తపనతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేయాలని నాడు–నేడు కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. దీనిద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చిన సీఎం దేశంలోనే మార్గదర్శకంగా నిలిచారన్నారు. ప్రభుత్వ ఆస్తులు, పాఠశాలలు, ఆస్పత్రులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన చెప్పారు. ఎమ్మెల్యే మేకతోటి సుచరిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న విద్యావ్యవస్థలో మార్పులు తెచ్చి నేడు దేశంలోని ప్రతి రాష్ట్రం మనరాష్ట్ర విద్యావిధానాలు అవలంభించే స్థాయికి తెచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరి, ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, లేళ్ళ అప్పిరెడ్డి, కె.ఎస్.లక్ష్మణరావు, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డిప్యూటీ మేయర్‌లు షేక్ షజిల, బాలవజ్రబాబు (డైమండ్‌బాబు), స్థానిక కార్పొరేటర్ బి.స్మితపద్మజ, సీపీఎం సీనియర్ నాయకుడు మధు, పాఠశాల కమిటీ సభ్యులు రమణ, సాంబశివరావు, గూడెం చంద్రమౌళి దంపతులు, వెంకటేశ్వరరెడ్డి, ఎల్.ఎస్.భారవి, ప్రిన్సిపల్ తాండవకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా తెస్తాం

- తెలంగాణ, కేంద్రంపై అలుపెరగని పోరాటం చేస్తాం
- విభజన చట్టంలోని అన్ని అంశాలను సాధిస్తాం : టీడీపీ నేత లోకేశ్



తిరుపతి రూరల్: 'మేం అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తాం. దానితోపాటు విభజన చట్టంలోని అన్ని అంశాలను సాధించేందుకు తెలంగాణ రాష్ట్రంతోపాటు కేంద్ర ప్రభుత్వంపైనా అలుపెరగని పోరాటం చేస్తాం' అని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. యువగళం పేరుతో లోకేశ్ చేపట్టిన పాదయాత్ర గురువారం చంద్రగిరి నియోజకవర్గంలోని పాకాల నుంచి కొమ్మిరెడ్డిగారిపల్లి వరకు సాగింది. దామలచెరువు వద్ద ముస్లింలు, కొండెపల్లి క్రాస్ వద్ద రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా వస్తేనే రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ముస్లింల కోసం ఇస్లామిక్ బ్యాంక్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని గంజాయి కేంద్రంగా మార్చారని ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

గుడారాల పండుగ ప్రారంభం

- భారీగా తరలివచ్చిన క్రైస్తవులు

గుంటూరు రూరల్: గుంటూరు నగర శివారు గోరంట్ల గ్రామంలో 46వ గుడారాల పండుగ గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలను హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, పాస్టర్లు ప్రెడిపాల్, రాజు, రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ శాంతి కపోతాలను వదిలారు. అనంతరం తమిళనాడుకు చెందిన పాస్టర్ మోహన్ సీ లాజరస్ రిబ్బన్ కట్‌చేసి సభను ప్రారంభించారు. హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. దేవుడు తన రాజ్య భారాన్ని తన భుజాలపై మోయునని చెప్పారు. దేవుని ఎడల వాత్సల్యంతో ఆయనను ఘనపరచాలన్నారు. క్రీస్తు నామం, క్రీస్తు గీతాలతో ఆ ప్రాంతం మారుమోగింది. ఈ సందర్భంగా నైజీరియాకు చెందిన భక్తులు 'అద్వితీయుడా నా ఏసయ్య' అనే పాటల పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సౌత్ ఆఫ్రికాకు చెందిన జాషువా మోజెస్ హోసన్న మినిస్ట్రీస్ నూతనంగా రూపొందించిన పాటల ఆల్బమ్‌ను ఆవిష్కరించారు. ఆదివారం వరకు గుడారాల పండుగ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు 2 లక్షలకు పైగా భక్తులు హాజరైనట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం ఆరోగ్య శాఖ, ఆర్టీసీ ఏర్పాట్లు చేశాయి.

భద్రంపల్లె కేసు కొట్టివేత

తొండూరు: వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం తొండూరు మండలం భద్రంపల్లెలో గతంలో జరిగిన సంఘటనకు సంబంధించిన కేసును విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టు కొట్టివేసినట్టు అడ్వొకేట్ ఓబుళరెడ్డి తెలిపారు. 2015 డిసెంబర్ 18న భద్రంపల్లె గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మరో ఇద్దరిని అప్పటి పోలీసులు వేధిస్తుండటంతో వారు కర్ణాటక రాష్ట్రంలోని మసూర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో తలదాచుకునేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు మరణించారు. మృతదేహాలతో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు తొండూరు పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. అప్పటి ఎస్ఐ శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైఎస్ అవినాష్‌రెడ్డి, మరో 96 మందిపై కొండాపురం సీఐ రవిబాబు కేసు నమోదు చేశారు. వైఎస్ అవినాష్‌రెడ్డి ఎంపీ అయినందున విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టు 9 మంది సాక్షులను విచారించింది. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుబ్బారావు వాదించారు. నిందితుల తరపు ఓబుళరెడ్డి, శివరాజులు వాదించారు. ఈ కేసులో పబ్లిక్‌ప్రాసిక్యూటర్ వారు నేరాన్ని రుజువు చేయకపోవడంతో కోర్టు కేసును కొట్టేసింది.

నేటి నుంచి తిరుమలలో తెప్పోత్సవాలు

తిరుమల: తిరుమలలోని శ్రీవారి పుష్కరిణిలో శుక్రవారం నుంచి 5 రోజులు పాటు తెప్పోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా విద్యుద్దీపాలతో తిరుమల ఆలయం, పరిసరాలను శోభాయమానంగా అలంకరించారు. ఈసారి తెప్పలపై ఉన్న మండపాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. శ్రీవారి తెప్పోత్సవాల్లో పాల్గొనాలనుకునే భక్తుల కోసం టీటీడీ కరెంట్ బుకింగ్ ద్వారా ప్రతిరోజు 200 టికెట్లను జారీ చేయనుంది. ఈ టికెట్లు ఉన్న భక్తులను టీటీడీ పుష్కరిణిలోకి ప్రత్యేకంగా అనుమతించనుంది.

విజయవాడ మీదుగా బెంగళూరుకు ప్రత్యేక రైళ్లు





రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సర్ విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు–నర్సాపూర్ (06549) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5న ఉదయం 11.20 గంటలకు సర్ విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు స్టేషన్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (06550) ఈ నెల 6న మధ్యాహ్నం 3.40 గంటలకు నర్సాపూర్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు సర్ విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు చేరుకుంటుంది. అలాగే, సర్ విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు–నర్సాపూర్ (06521)రైలు ఈ నెల 3న ఉదయం 11.20 గంటలకు సర్ విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు స్టేషన్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (06522) ఈ నెల 4న మధ్యాహ్నం 3.40 గంటలకు నర్సాపూర్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు సర్ విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు చేరుకుంటుంది. సర్ విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు–కాచిగూడ(06523) ఈ నెల 3, 5 తేదీల్లో మధ్యాహ్నం 3.30 గంటలకు సర్ విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు స్టేషన్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 5.20 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (06524) ఈ నెల 4, 6 తేదీల్లో రాత్రి 10.55 గంటలకు కాచిగూడలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 11.45 గంటలకు సర్ విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరుకు చేరుకుంటుంది.

'కులం కోసమే ఆ పత్రికలు, టీవీలు'

సాక్షి, తిరుపతి: కులం కోసమే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 పెట్టుకున్నారని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, రామోజీ, రాధాకృష్ణ, బి.ఆర్.నాయుడులపై మండిపడ్డారు. వీరి కులపిచ్చి పరాకాష్టకు చేరిందని ధ్వజమెత్తారు. పత్రికలు, టీవీలు పెట్టుకుంది పెత్తందార్లు, భూకబ్జాదారుల కోసమేనని విమర్శించారు. కాంగ్రెస్‌కి వ్యతిరేకమని రామోజీరావు తన పత్రికలో ఎడిటోరియల్ కూడా రాశారని, అటువంటి రామోజీ ఏం చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. కమ్మ సామాజికవర్గానికి పని చేయాలనుకుంటే.. చంద్రబాబు తమ కులానికి చెందినవాడని, తమ కులానికి పెద్దగా పెట్టుకున్నామని బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం ఎడారైందని, అదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన రామరాజ్యాన్ని తలపిస్తోందని చెప్పారు. చంద్రబాబు టెర్రరిస్ట్‌కు మించిన మనస్తత్వం కలవాడని ధ్వజమెత్తారు. శేషాచలంలో, గోదావరి పుష్కరాల్లో, కందుకూరులో, గుంటూరులో జనం ప్రాణాలు పోవడానికి కారణం చంద్రబాబు కాదా? అని ప్రశ్నించారు. అమరావతిలో పంట భూములను తగలబెట్టిన వ్యక్తి, మహిళలను గుర్రాలతో తొక్కించిన చంద్రబాబు రాక్షస మనస్తత్వం కలిగిన టెర్రరిస్ట్ అని విమర్శించారు. మేనిఫెస్టోని తుంగలో తొక్కిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారా? అంటే అది చంద్రబాబేనని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు కన్నుమూత



గన్నవరం/సాక్షి, అమరావతి: ఎమ్మెల్సీ, టీడీపీ కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బచ్చుల అర్జునుడు (65) గురువారం కన్నుమూశారు. ఆయన జనవరి 28న తెల్లవారుజామున తీవ్ర గుండెపోటుకు గురికాగా విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి కోమాలో ఉన్న అర్జునుడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలోనే తుదిశ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మచిలీపట్నానికి చెందిన బచ్చుల అర్జునుడు టీడీపీలో ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఎమ్మెల్సీగా, రెండున్నరేళ్లుగా టీడీపీ గన్నవరం ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. ఆయన ఎమ్మెల్సీ పదవీకాలం ఈ నెల 25న ముగియనుంది. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నివాళులర్పించిన చంద్రబాబు

ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు పార్థివదేహాన్ని గురువారం రాత్రి గన్నవరంలోని టీడీపీ కార్యాలయానికి తీసుకొచ్చారు. అర్జునుడు పార్థివదేహానికి టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. అర్జునుడు మృతికి సంతాపం తెలిపారు. అనంతరం బచ్చుల కుటుంబసభ్యులను పరామర్శించారు. అర్జునుడు మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

గవర్నర్ సంతాపం

ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు మృతిపట్ల గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ సంతాపం తెలిపారు. బచ్చుల కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

చంపేసి.. చచ్చిపోవాలనుకున్నాడు..

- లీలాపవిత్ర హత్య కేసులో మరికొన్ని విషయాలు వెలుగులోకి..

బనశంకరి : లీలా పవిత్ర దారుణ హత్య చేసిన కేసులో మరికొన్ని విషయాలు వెలుగుచూశాయి. ఆమె పనిచేస్తున్న కంపెనీ వద్దకు దివాకర్ వెళ్లడంతో.. లీలాపవిత్ర తల్లికి ఫోన్ చేసింది. దివాకర్ వచ్చి బయటకు రావాలని వేధిస్తున్నాడని, ఏం చేయాలో తెలియడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేసింది. చివరకు బయటకు వచ్చి మా అమ్మతో మాట్లాడు అంటూ.. ఫోన్‌ను దివాకర్‌కు ఇచ్చింది. పవిత్ర తల్లి ఫోన్‌లో అతడిని మందలించి అక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించింది. అనంతరం లీల ఫోన్‌లో తల్లితో మాట్లాడుతుండగా దివాకర్ చాకు బయటకు తీశాడు. లీలాపవిత్ర భయపడి ఫోన్ కట్ చేసింది. ఆ తర్వాత కత్తితో ఆమెపై విచక్షణ రహితంగా దాడి చేసిన విషయం తెలిసిందే. తనను పెళ్లి చేసుకోకుంటే ఆమెను అంతమొందించి, తనూ ఆత్మహత్య చేసుకోవాలని నిందితుడు ముందుగానే నిర్ణయించుకున్నాడని, ఇదే విషయాన్ని లీలాపవిత్రకూ చెప్పాడని పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనే స్థాయి టీడీపీకి లేదు

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు కల్చరల్: వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనే స్థాయి టీడీపీకి లేదని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం కర్నూలులోని మౌర్యా ఇన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చివరి నిమిషంలో ఎన్నికల బరిలోంచి తప్పుకోవడం చాలా సందర్భాల్లో చూశామన్నారు. గతంలో ఎమ్మెల్సీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల బరిలోంచి తప్పుకున్న ఘటనలను ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం అదే పరిస్థితి కనిపించిందన్నారు. ప్రజలు కట్టే పన్నులతో జీతాలు తీసుకుంటూ ఉద్యోగులు అధికార పార్టీకి తొత్తులుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ 175 స్థానాల్లో పోటీ చేస్తామని చెప్పడం లేదని.. బీజేపీ, జనసేన కలిసి 175 స్థానాల్లో పోటీ చేస్తాయని స్పష్టం చేశారు. మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పార్థసారథి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వినూషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలు అందించిన నిమ్మకాయల దండతో త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా

ఈశాన్యంలో కమల వికాసం

మూడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు విడుదల

బీజేపీ 'మిషన్ నార్త్ఈస్ట్'కు బూస్ట్

త్రిపురలో సొంతంగానే స్పష్టమైన మెజార్టీ

నాగాలాండ్‌లో ఎన్‌డీపీపీ–బీజేపీ కూటమికే మళ్లీ అధికారం

మేఘాలయలో 2 సీట్లతో కింగ్‌మేకర్‌గా కమలం పార్టీ

ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం

అగర్తలా/షిల్లాంగ్/కోహిమా: 'మిషన్ నార్త్ఈస్ట్' పేరిట ఈశాన్య రాష్ట్రాల్లో జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పెట్టుకున్న భారతీయ జనతా పార్టీకి నూతనోత్తేజం లభించింది. ఈశాన్య భారతంలో కమలం వికసించింది. త్రిపుర, నాగాలాండ్, మేఘాలయా శాసనసభ ఎన్నికల ఫలితాలు గురువారం వెలువడ్డాయి. త్రిపురలో బీజేపీకి సంపూర్ణ మెజార్టీ దక్కింది. 60 స్థానాలకు గాను సొంతంగా 32 స్థానాలు గెలుకొని, ఒక్కే ఒక్క స్థానంలో నెగ్గిన మిత్రపక్షం ఐపీఎఫ్‌టీతో కలిసి వరుసగా రెండోసారి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతోంది. నాగాలాండ్‌లో 60 అసెంబ్లీ స్థానాలుండగా, నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(ఎన్‌డీపీపీ)–బీజేపీ కూటమి 37 స్థానాల్లో పాగా వేసింది. ఎన్‌డీపీపీకి 25, బీజేపీకి 12 సీట్లు లభించాయి. రెండు పార్టీలు కలిసి మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నాయి. 60 స్థానాలున్న మేఘాలయాలో ఒంటరిగా పోటీకి దిగి, కేవలం 2 సీట్లే గెలుచుకున్న బీజేపీ కింగ్‌మేకర్‌గా అవతరిస్తుండడం గమనార్హం. 26 సీట్లలో నెగ్గిన అధికార నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) బీజేపీ మద్దతుతో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. ప్రభుత్వంలో బీజేపీ మళ్లీ జూనియర్ భాగస్వామిగా చేరినా ఆశ్చర్యం లేదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. మరోవైపు ఈ ఎన్నికల ఫలితాలు ప్రతిపక్ష కాంగ్రెస్‌కు చేదు అనుభవాన్నే మిగిల్చాయి. నాగాలాండ్‌లో 5, త్రిపురలో 3 సీట్లు గెలుచుకున్న ఆ పార్టీ మేఘాలయాలో సున్నా చుట్టేసింది. త్రిపురలో కొత్త పార్టీ తిప్రా మోథా ఏకంగా 13 సీట్లు తన ఖాతాలో వేసుకుంది.



మేఘాలయ సీఎం కాన్రాడ్ సంగ్మా విజయోత్సాహం

త్రివేణికే ఈ మొత్తం క్రెడిట్: మోదీ


ఎన్నికల్లో బీజేపీ స్థిరంగా విజయాలు సాధిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. మేఘాలయా, నాగాలాండ్, త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఆయన స్పందించారు. గురువారం పార్టీ ప్రధాన కార్యాలయంలో నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. మూడు రాష్ట్రాల్లో పార్టీ పనితీరు పట్ల కార్యకర్తలకు అభినందనలు తెలియజేశారు. బీజేపీ గెలుపునకు గాను క్రెడిట్ మొత్తం 'త్రివేణి'కే ఇవ్వాలన్నారు. బీజేపీ ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి పనులు, ఆయా ప్రభుత్వాల పని సంస్కృతి, పార్టీ కార్యకర్తల అంకితభావం వల్లే విజయాలు లభిస్తున్నాయని స్పష్టం చేశారు. ఈశాన్య ప్రాంతం ఢిల్లీకి, దిల్(హృదయం)కి ఎక్కువ దూరంలో లేదన్న సంగతి ఈ ఫలితాలను బట్టి తెలుస్తోందన్నారు. త్రిపుర, నాగాలాండ్‌లో బీజేపీ కూటమి మళ్లీ అధికారం దక్కించుకోవడం పార్టీ కార్యకర్తలందరికీ గర్వకారణమని మోదీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. మర్ జా మోదీ(చనిపో మోదీ) అని ప్రతిపక్షాలు కోరుకుంటున్నాయని, ప్రజలు మాత్రం మత్ జా మోదీ(వెళ్లొద్దు మోదీ) అని నినదిస్తున్నారని ప్రధాని స్పష్టం చేశారు.

ఫలితాలు నిరుత్సాహకరం:కాంగ్రెస్

త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీల ఎన్నికల ఫలితాలు నిరుత్సాహం కలిగించాయని కాంగ్రెస్ పేర్కొంది. అయితే, ఉప ఎన్నికల్లో మూడు అసెంబ్లీ సీట్లలో సాధించిన విజయం ప్రోత్సాహం నింపిందని తెలిపింది. ఈ ఫలితాలపై సమీక్ష జరిపి, పార్టీ సంస్థాగత బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు.

త్రిపురలో కాషాయం రెపరెపలు

త్రిపురలో బీజేపీ–స్థానిక పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపీఎఫ్‌టీ) కూటమి రెండోసారి అధికారం దక్కించుకుంది. మొత్తం 60 సీట్లకు గాను ఎన్నికల్లో 33 సీట్లు గెలుచుకుంది. ప్రద్యోత్ కిశోర్ దేవ్‌వర్మ నేతృత్వంలోని తిప్రా మోథా పార్టీ 13 స్థానాలు గెలుచుకుంది. ఇక వామపక్షాలు–కాంగ్రెస్ కూటమికి 14 స్థానాలు లభించాయి. 28 స్థానాల్లో పోటీ చేసిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కనీసం ఖాతా తెరవలేక చతికిలపడింది. ఆ పార్టీకి కేవలం 0.88 శాతం ఓట్లు లభించాయి. 'నోటా' కంటే తక్కువ ఓట్లు పడడం గమనార్హం. బీజేపీ, ఐపీఎఫ్‌టీకి 2018తో పోలిస్తే ఈసారి సీట్ల సంఖ్య తగ్గింది. తిప్రా మోథా పార్టీ గణనీయంగా పుంజుకోవడమే ఇందుకు కారణం. ఈసారి 55 స్థానాల్లో పోటీకి దిగిన బీజేపీకి 32 స్థానాలు గెలుచుకుంది. ఐపీఎఫ్‌టీకి కేవలం ఒక స్థానం లభించింది. 47 సీట్లలో పోటీ చేసిన సీపీఎం కేవలం 11 సీట్లను తన ఖాతాలో వేసుకుంది. ఫార్వర్డ్ బ్లాక్, సీపీఐ, ఆర్ఎస్పీకి ఒక్క సీటు కూడా దక్కలేదు. కాంగ్రెస్ పార్టీ టిక్కెట్‌పై 13 మంది పోటీ చేయగా, ముగ్గురు విజయం సాధించారు. టౌన్ బార్డోవాలీ స్థానంలో పోటీ చేసిన మాణిక్ సాహా తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి ఆశిష్‌కుమార్ సాహాపై 1,257 ఓట్ల తేడాతో గెలుపొందారు.




మిస్టర్ క్లీన్‌కే మళ్లీ కిరీటం!

త్రిపురలో మిస్టర్ క్లీన్‌గా గుర్తింపు పొందిన సాహా వరుసగా రెండోసారి ముఖ్యమంత్రిగా గద్దెనెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. 10 నెలల క్రితం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని విజయపథంలో నడిపించారు. దంత వైద్యుడైన సాహా గతంలో కాంగ్రెస్‌లో పనిచేశారు. 2016లో బీజేపీలో చేరారు. 2020లో త్రిపుర బీజేపీ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టారు. 2022 ఏప్రిల్ 3 నుంచి జులై 4 దాకా రాజ్యసభ సభ్యుడిగా సేవలందించారు. గత ఏడాది జరిగిన టౌన్ బార్డోవాలీ నియోజకవర్గం ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా గెలిచారు. బీజేపీ విప్లవ్ దేవ్ స్థానంలో ఆయనను సీఎంగా నియమించింది. మాణిక్ సాహా నిజాతీయపరుడిగా, కష్టపడి పనిచేసే నాయకుడిగా ప్రజల మనసులు గెలుచుకున్నారు.

నాగాలాండ్‌లో ఎన్‌డీపీపీ-బీజేపీ హవా

నాగాలాండ్‌లో అధికార నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(ఎన్‌డీపీపీ)–బీజేపీ కూటమి మళ్లీ అధికార పీటం దక్కించుకుంది. 60 స్థానాలున్న అసెంబ్లీలో 37 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. కూటమిలోని ఎన్‌డీపీపీకి 25, బీజేపీకి 12 సీట్లు దక్కాయి. ఇతర పార్టీలేవీ రెండంకెల సీట్లు సాధించలేకపోయాయి. ఎన్సీపీ 7, నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) 5 సీట్లు గెలుచుకున్నాయి. ఎల్‌జేపీ(రామ్‌విలాస్ పాశ్వాన్) 2, ఆర్‌పీఐ(అథవాలే) 2, ఎన్‌పీఎఫ్ 2 సీట్లలో గెలుపొందాయి. జేడీ(యూ) ఒక స్థానంలో విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీకి ఒక్కటంటే ఒక్కటి కూడా దక్కలేదు. నలుగురు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన అన్ని పార్టీల అభ్యర్థులకు ఎన్‌డీపీపీ నేత, సీఎం రియో అభినందనలు తెలిపారు.




చరిత్ర సృష్టించిన మహిళా ఎమ్మెల్యేలు

60 ఏళ్ల నాగాలాండ్ చరిత్రలో తొలిసారిగా ఇద్దరు మహిళలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అధికార ఎన్‌డీపీపీ టిక్కెట్‌పై పశ్చిమ అంగామీ స్థానం నుంచి హెకాని జకాలు, దిమాపూర్–3 స్థానం నుంచి సల్‌హోటనో క్రుసె విజయం సాధించారు. వారిద్దరూ సిట్టింగ్ ఎమ్మెల్యేలను ఓడించడం విశేషం.

★ వీరిపై ప్రత్యేక కథనం ఫ్యామిలీలో..

మేఘాలయలో హంగ్!

మేఘాలయ శాసనసభ ఎన్నికల్లో ఓటర్లు ఏ పార్టీకీ స్పష్టమైన తీర్పు ఇవ్వలేదు. రాష్ట్రంలో హంగ్ పరిస్థితులు నెలకొన్నాయి. మేఘలయలో మొత్తం 60 అసెంబ్లీ స్థానాలుండగా, 59 స్థానాల్లో ఎన్నికలు నిర్వహించారు. సోహియోంగ్ నియోజకవర్గంలో యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ(యూడీపీ) అభ్యర్థి డొంకుపర్ రాయ్ లింగ్డో ఫిబ్రవరి 20న మృతిచెందడంతో పోలింగ్ వాయిదా పడింది. ఈ ఎన్నికల్లో 26 సీట్లు గెలుచుకున్న అధికార నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) అతిపెద్ద పార్టీగా అవతరించింది. మెజార్టీకి కొద్దిదూరంలోనే ఆగిపోయింది. కాన్రాడ్ సంగ్మా ప్రభుత్వంలో ఎన్‌పీపీ మిత్రపక్షంగా వ్యవహరించిన యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ(యూడీపీ) 11 స్థానాల్లో నెగ్గింది. కాంగ్రెస్ 5, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ 5 సీట్లు గెలుచుకున్నాయి. ఒంటరిగా పోటీ చేసిన జాతీయ పార్టీ బీజేపీ కేవలం రెండు సీట్లకే పరిమితమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, బీజేపీ అధినేత జేపీ నడ్డా వంటి అగ్రనేతలు ప్రచారంలో పాల్గొనప్పటికీ ఆశించిన ఫలితందక్కలేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఎన్‌పీపీ నేత, ముఖ్యమంత్రి కాన్రాడ్ కే సంగ్మా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మద్దతును కోరుతున్నారని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ వ్యాఖ్యానించడం ఆసక్తికరంగా మారింది. మేఘాలయలో ప్రభుత్వ ఏర్పాటుకు ఎన్‌పీపీకి సహకరించాలంటూ తమ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సూచించారని హిమంత బిశ్వ శర్మ వ్యాఖ్యానించారు. నూతన ప్రభుత్వ ఏర్పాటుకు వీలుగా ఎన్‌పీపీకి మద్దతు తెలియజేస్తూ లేఖ ఇవ్వబోతున్నామని మేఘాలయ బీజేపీ అధ్యక్షుడు ఎర్నెస్ట్ మారీ చెప్పారు. ముఖ్యమంత్రి సంగ్మా దక్షిణ తురా స్థానంలో గెలిచారు.




త్రిసభ్య కమిటీ సిఫార్సుతోనే..

ఎన్నికల కమిషనర్ల నియామకంపై సుప్రీం

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ), ఎన్నికల కమిషనర్(ఈసీ)ల నియామకాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన వ్యక్తులను నియమిస్తోందనే తీవ్ర ఆరోపణల నడుమ సర్వోన్నత న్యాయస్థానం సంచలనాత్మక తీర్పును వెలువరించింది. ఇన్నాళ్లూ కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు ఎన్నికల సంఘంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఎలక్షన్ కమిషనర్లను రాష్ట్రపతి నియమిస్తున్నారు. ఇకపై ఈ వ్యవస్థను రద్దుచేస్తున్నట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది. ప్రధాన మంత్రి, లోక్‌సభలో విపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండే త్రిసభ్య కమిటీ సిఫార్సు మేరకు రాష్ట్రపతి కేంద్ర ఎన్నికల సంఘంలో నియామకాలు జరపాలని జస్టిస్ కేఎం జోసెఫ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం చరిత్రాత్మక తీర్పు చెప్పింది.

అది ప్రజాస్వామ్యానికి సమాధి కడుతుంది

'శక్తివంతమైన తుపాకీ కంటే బ్యాలెట్ మరింత శక్తిమయం. ఎన్నికల ప్రక్రియ అతిగా దుర్వినియోగానికి గురైందంటే అది చివరకు ప్రజాస్వామ్యానికి సమాధి కడుతుంది. అధికారం ముందు సాగిలపడే వ్యక్తి ఎన్నికల కమిషనర్‌గా ఎన్నికకాకూడదు. ఇంకొకరి ఆదేశాలను శిరసావహించే వ్యక్తి ప్రజాస్వామ్య తలరాతను మార్చే హోదాలో ఉండకూడదు. ఎన్నికల ప్రక్రియ స్వతంత్రతను మరింతగా ఇనుమడింపజేసేందుకే ఈ ఆదేశాలు ఇస్తున్నాం. స్వచ్ఛత తగ్గిపోతే వినాశక పరిణామాలు సంభవిస్తాయి. పార్లమెంట్‌లో కొత్త చట్టం వచ్చేవరకు నూతన నియామక ప్రక్రియ అమలులో ఉంటుంది' అని ధర్మాసనం పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఇన్నాళ్లూ కేంద్రప్రభుత్వం రాష్ట్రపతికి కొత్త సీఈసీ, ఈసీల కోసం సిఫార్సుచేసేది. సిఫార్సులమేరకు రాష్ట్రపతి వారిని నియమించేవారు. ఇకపై కొత్త ప్రక్రియ ప్రకారం లోక్‌సభలో విపక్షనేత లేని సందర్భంలో లోక్‌సభలో సంఖ్యపరంగా అతిపెద్ద విపక్ష పార్టీ నేత త్రిసభ్య కమిటీలో సభ్యునిగా ఉంటారు. సీఈసీ, ఈసీల నియామకం కోసం కొలీజియం తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలంటూ పలు పిటిషన్లు సుప్రీంకోర్టులో గతంలో దాఖలైన నేపథ్యంలో వాటిని విచారించిన కోర్టు గురువారం ఈ తీర్పు చెప్పింది. రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ అజయ్ రస్తోగీ, జస్టిస్ అనురుద్ధ బోస్, జస్టిస్ హ్రిషికేశ్ రాయ్, జస్టిస్ సీటీ రవికుమార్‌లు సభ్యులుగా ఉన్నారు.



తీర్పును స్వాగతించిన విపక్షాలు

'ప్రభుత్వ ప్రమేయం, ప్రభావం బారిన పడకుండా ఈసీని కాపాడుతూ ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు కోర్టు తీర్పు బాటలు పరిచింది' అని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. తీర్పును ప్రజాస్వామ్యం సాధించిన విజయంగా తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ అభివర్ణించారు. 'ఇంతకాలం ప్రధాని ఎన్నికల ర్యాలీలు, ప్రభుత్వ పథకాల ప్రకటనలకు అనుగుణంగా ఎన్నికల తేదీలను ఈసీ నిర్ణయించేది. ఇకపై ఎన్నికల సంఘంలో ఎవరు ఉంటారనే త్రిసభ్య కమిటీ చూసుకుంటుంది' అని ఆప్ నేత సంజయ్ సింగ్ ఆశాభావం వ్యక్తంచేశారు.

కాంగ్రెస్‌కు ఊరట

న్యూఢిల్లీ: ఉప ఎన్నికల ఫలితాలు గురువారం కాంగ్రెస్‌కు కాస్త ఊరటనిచ్చాయి. మహారాష్ట్ర, బెంగాల్‌లలో అధికార బీజేపీ, టీఎంసీల సిట్టింగ్ స్థానాలను గెలుచుకున్న కాంగ్రెస్..తమిళనాడులో సిట్టింగ్ సీటును నిలబెట్టుకుంది. పశ్చిమబెంగాల్ అసెంబ్లీలోని సాగర్‌దిఘి స్థానంలో అధికార టీఎంసీ అనూహ్యంగా ఓటమి పాలైంది. ఇక్కడ వామపక్షాల మద్దతుతో బరిలో నిలిచిన కాంగ్రెస్‌కు చెందిన బేరన్ బిశ్వాసం సుమారు 23 వేల ఓట్ల మెజారిటీతో టీఎంసీ అభ్యర్థిపై గెలుపు సాధించారు. ఇక్కడ బీజేపీ మూడో స్థానంలో నిలిచింది. ఈ గెలుపుతో కాంగ్రెస్ పార్టీ ఏకైక ఎమ్మెల్యేతో బెంగాల్ అసెంబ్లీలోకి అడుగుపెట్టనుంది. మహారాష్ట్రలోని కస్బాపేత్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు చెందిన రవీంద్ర దంగేకర్ కాషాయ పార్టీ అభ్యర్థిపై విజయం సాధించారు. బీజేపీ గత 28 ఏళ్లుగా ఈ స్థానాన్ని గెలుచుకుంటూ వస్తోంది. అయితే, ఇదే రాష్ట్రంలోని చించ్‌వాడీ నియోజకవర్గాన్ని బీజేపీ నిలబెట్టుకుంది. తమిళనాడులోని ఈరోడ్ వెస్ట్ సీటుకు జరిగిన ఉప ఎన్నికలో డీఎంకే బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి ఈవీకేఎస్ ఎలంగోవన్ భారీ విజయం సాధించారు. జార్ఖండ్‌లోని రామగఢ్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ మద్దతుతో బరిలో నిలిచిన ఏజేఎస్‌యూ అభ్యర్థి గెలిచారు.

'అదానీ'పై సుప్రీం నిపుణుల కమిటీ

న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత దేశంలో 140 బిలియన్ డాలర్లకుపైగా సంపద ఆవిరైన నేపథ్యంలో మదుపర్ల ప్రయోజనాల పరిరక్షణ కోసం సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. అదానీ–హిండెన్‌బర్గ్ వ్యవహారంపై విచారణ జరపడంతోపాటు మదుపర్ల ప్రయోజనాలను కాపాడేలా చర్యలను సిఫార్సు చేయడానికి ఆరుగురు సభ్యులతో నిపుణుల కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే నేతృత్వం వహించే ఈ కమిటీలో ఎస్‌బీఐ మాజీ చైర్మన్ ఒ.పి.భట్, బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జె.పి.దేవధర్, బ్రిక్స్ న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు, ఇన్ఫోసిస్ లిమిటెడ్ మాజీ అధినేత కె.వి.కామత్, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) మాజీ అధినేత నందన్ నీలేకని, న్యాయవాది సోమశేఖర్ సుందరేశన్ సభ్యులుగా ఉంటారని తెలియజేసింది. స్టాక్ ధరల్లో అదానీ గ్రూప్ అవకతవకలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై కొనసాగిస్తున్న విచారణను రెండు నెలల్లోగా పూర్తి చేసి, నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పించాలని సెబీని ఆదేశించింది. హిండెన్‌బర్గ్ నివేదిక, అదానీ గ్రూప్ అక్రమాలపై దాఖలైన వివిధ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దివాలాల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల వల్ల మదుపరులు భారీగా నష్టపోయారని, మార్కెట్ ఒడిదొడుకుల కారణంగా వారు నష్టపోకుండా నియంత్రణ సంస్థలను బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించడానికి ఆరుగురు సభ్యులతో నిపుణుల కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. పెట్టుబడిదారులను చైతన్యవంతంచేయడానికి చేపట్టాల్సిన చర్యలను సైతం సిఫార్సు చేయాలని కమిటీకి స్పష్టంచేసింది. కమిటీ సభ్యులకు గౌరవ వేతనం చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అదానీ గ్రూప్ వ్యవహారాలపై దర్యాప్తునకు కమిటీని నియమించడానికి తమకు అభ్యంతరం లేదంటూ గత విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను సుప్రీంకోర్టు ధర్మాసనం తిరస్కరించినసంగతి తెలిసిందే. కేసు దర్యాప్తు పూర్తి పారదర్శకంగా జరగాలని కోరుకుంటున్నామని, తామే నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామని ధర్మాసనం ఇప్పటికే తేల్చిచెప్పింది. కాగా, కోర్టు నిర్ణయంపై గౌతమ్ అదానీ స్పందించారు. నిర్దిష్ట గడువులోగా ఈ వ్యవహారమంతా ఒక కొలిక్కి వస్తుందని భావిస్తున్నామని వెల్లడించారు. సత్యం గెలుస్తుంది అని పేర్కొన్నారు.

బెదిరిస్తున్నారా ? బయటికెళ్లండి

న్యూఢిల్లీ: న్యాయవాదుల చాంబర్ల కోసం సుప్రీంకోర్టు ప్రాంగణంలోని కొంత స్థలం కేటాయింపు విషయంలో సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్(ఎస్‌సీబీఏ) అధ్యక్షుడు వికాస్ సింగ్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దివాలాల ధర్మాసనం ఎదుట సంబంధిత కేసు విషయమై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ తన వాదనలు వినిపించారు. ' అప్పూ ఘర్ స్థలం ఎస్‌ఈబీఏ పిటిషన్ కారణంగానే సుప్రీంకోర్టు చేతికొచ్చింది. కానీ అందులో కేవలం ఒక్క బ్లాక్ మాత్రమే ఎస్‌ఈబీఏ, బార్‌కు కేటాయించారు. సంబంధిత కేసు ఆరునెలలైనా విచారణకు నోచుకోవట్లేదు' అని వికాస్ గట్టిగా మాట్లాడారు. దీంతో సీజేఐ ఆగ్రహంగా..' 'సీజేఐనే బెదిరిస్తున్నారా ? ఇలాగేనా ప్రవర్తించేది ? కోర్టు హాల్ నుంచి వెళ్లిపోండి. మార్చి 17న విచారిస్తాం' అని సీజేఐ ఆగ్రహంగా మాట్లాడారు. 2000 మార్చి 29వ తేదీ నుంచి ఇక్కడే ఉన్నాను. 22 ఏళ్లుగా ఇదే వృత్తిలో కొనసాగుతున్నా. ఎప్పుడూ ఇలా ఎవరితో ఇంతగా ఇబ్బంది పడలేదు' అని సీజేఐ వ్యాఖ్యానించారు.

సరిహద్దులో శాంతిపైనే చర్చ

న్యూఢిల్లీ: జీ20 విదేశాంగ మంత్రుల సమావేశం కోసం ఢిల్లీకి చేరుకున్న చైనా విదేశాంగ మంత్రి క్విన్ గాంగ్‌తో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ భేటీ అయ్యారు. ఇరుదేశాల సరిహద్దు వెంట బలగాల మొహరింపు, ఉద్రిక్తతల నేపథ్యంలో శాంతి నెలకొల్పడంపైనే చర్చల్లో ప్రధానంగా దృష్టిపెట్టినట్లు జైశంకర్ గురువారం చెప్పారు. ద్వైపాక్షిక భాగస్వామ్యానికి సవాళ్లుగా నిలుస్తున్న సమస్యలు భేటీలో చర్చకొచ్చినట్లు ఆయన ఆ తర్వాత ట్వీట్‌చేశారు. డిసెంబర్‌లో చైనా విదేశాంగ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న క్విన్‌తో జైశంకర్ భేటీ కావడం ఇదే తొలిసారి. జీ20 విదేశాంగ మంత్రుల సమావేశం ఎజెండాపైనా క్విన్‌తో మాట్లాడారు. గతంలో చివరిసారిగా నాటి చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో బాలీలో జీ20 సదస్సు సందర్భంగా జైశంకర్ మాట్లాడారు. తూర్పు లద్దాఖ్‌లో ప్రతిష్టంభనను తొలగించాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు.

ఏకాభిప్రాయం సాధిద్దాం

జీ20 విదేశాంగ మంత్రుల భేటీలో ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ: భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు జీ–20లో సహకారంపై ప్రభావం చూపనీయరాదని, ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు ఏకాభిప్రాయానికి రావాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఉక్రెయిన్ సంక్షోభంపై దేశాల మధ్య విభేదాలు పొడచూపిన నేపథ్యంలో గురువారం జీ–20 దేశాల విదేశాంగ మంత్రులకు ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశం పంపారు. 'మహాత్మాగాంధీ, గౌతమబుద్ధుడి నేలపై కలుసుకున్న మీరు, భారతదేశ నాగరికత, తాత్వికతల నుంచి ప్రేరణ పొందాలని, మనల్ని విభజించే వాటిపై కాకుండా, మనల్ని ఐక్యంగా ఉంచే అంశాలపై దృష్టి పెట్టాలి'అని సూచించారు. 'అభివృద్ధి, ఆర్థిక స్థిరత్వం, అంతర్జాతీయ నేరాలు, అవినీతి, ఉగ్రవాదం, ఆహారం, ఇంధన భద్రత'వంటి అంశాల్లో పరిష్కారం కోసం ప్రపంచం జీ–20 వైపు చూస్తోంది. ఈ విషయంలో ఏకాభిప్రాయం సాధించి, ఫలితాలను రాబట్టే సామర్థ్యం జీ–20కి ఉంది'అని ఆయన చెప్పారు. అంతర్జాతీయ సమాజంలో తీవ్ర విభేదాలు తలెత్తిన సమయంలో మనం కలుసుకున్నాం. మన మధ్య జరిగే చర్చలు భౌగోళిక రాజకీయాల ప్రభావం ఉండటం సహజం. అయితే, ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలున్న దేశాల ప్రతినిధులుగా ఇక్కడ లేని వారి పట్ల కూడా మనం బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది'అని ప్రధాని పేర్కొన్నారు.

వ్యవస్థలు విఫలం

'గత కొద్ది సంవత్సరాల్లో ఆర్థిక సంక్షోభం, వాతావరణ మార్పులు, కరోనా మహమ్మారి, ఉగ్రవాదం, యుద్ధాలు..వంటి వాటిని ఎదుర్కొన్న విధానం చూస్తే అంతర్జాతీయ వ్యవస్థలు ఎలా దారుణంగా విఫలమయ్యాయో స్పష్టమవుతోంది. ఈ వైఫల్యం విషాదకర పరిణామాలను అభివృద్ధి చెందుతున్న దేశాలే ఎక్కువగా ఎదుర్కొన్నాయనే విషయం మనం అంగీకరించాలి. ఏళ్లపాటు సాధించుకున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు తిరోగమించే ప్రమాదం ఉంది'అని ప్రధాని హెచ్చరించారు. అభివృద్ధి చెందుతున్న చాలా దేశాలు తమ ప్రజానీకానికి ఇంధన, ఆహార భద్రతను అందించే క్రమంలో తీవ్రమైన రుణ భారంతో అవస్థలు పడుతున్నాయన్నారు. ధనిక దేశాల కారణంగా వచ్చిన గ్లోబల్ వార్మింగ్ తోనూ ఆయా దేశాలు ప్రభావితమయ్యాయని చెప్పారు. తమ నిర్ణయాల వల్ల ఎక్కువగా ప్రభావితమైన వారి మాట వినకుండా ఏ వర్గం కూడా తమదే ప్రపంచ నాయకత్వమంటూ చాటుకోలేదని మోదీ అన్నారు. విదేశాంగ మంత్రి జై శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అమెరికా, రష్యా, చైనా, యూకేల విదేశాంగ మంత్రులు వరుసగా ఆంటోనీ బ్లింకెన్, లావ్రోవ్, క్విన్, క్లెవెర్లీతోపాటు ఈయూ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇటలీ ప్రధానితో చర్చలు



భారత్, ఇటలీలు రక్షణ సహకారంలో కొత్త అధ్యాయానికి తెరతీస్తూ తమ ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. గురువారం ఢిల్లీకి చేరుకున్న ఇటలీ ప్రధాని జియోర్జియా మెలోనీతో వివిధ అంశాలపై ఆయన విస్తృతంగా చర్చలు జరిపారు. అనంతరం మెలోనీతో కలిసి మోదీ మీడియాతో మాట్లాడారు. సంయుక్త భాగస్వామ్యం, సంయుక్త అభివృద్ధి రంగాల్లో భారత్‌లో నూతన అవకాశాలకు దారులు తెరుచుకున్నాయన్నారు. ఈ బంధం ఉభయతారకమని చెప్పారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం అంశాలపై రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయన్నారు.

'హథ్రాస్' నిందితుడికి జీవిత ఖైదు

హథ్రాస్(యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని హథ్రాస్‌లో 2020లో దళిత యువతి(20)పై అత్యాచారం, హత్య కేసులో ప్రధాన నిందితుడు సందీప్(20)కు ప్రత్యేక కోర్టు యావజ్జీవ జైలు శిక్ష విధించింది. సందీప్‌పై సెక్షన్ 304తోపాటు, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసుల్లో దోషిగా కోర్టు నిర్ధారించింది. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు రవి(35), లవ్‌కుష్(23), రాము(26)లను కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. దళిత యువతిని అగ్రవర్ణాలకు చెందిన వారు సామూహిక అత్యాచారం చేసి, క్రూరంగా చంపారనే వార్తలతో అప్పట్లో ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి.

అమెరికా, రష్యా, యూఏఈల వ్యోమగాములతో.. ఐఎస్ఎస్‌కు వెళ్లిన స్పేస్ ఎక్స్ రాకెట్

కేప్ కెనవెరాల్: అరబ్ దేశాల నుంచి మొట్టమొదటి వ్యోమగామి సహా మూడు దేశాలకు చెందిన నలుగురు వ్యోమగాములతో స్పేస్ఎక్స్ రాకెట్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)కు చేరుకుంది. ఆరు నెలల ఈ మిషన్‌లో యూఏఈ రెండో వ్యోమగామి సుల్తాన్ అల్–నెయాడీ పాలుపంచుకుంటున్నారు. నెయాడీతోపాటు అమెరికాకు చెందిన స్టీఫెన్ బోవెన్, వారెన్ హొబర్గ్, రష్యాకు చెందిన ఆండ్రీ ఫెడ్యాయెవ్ ఉన్నారు. వీరు అక్కడికి చేరుకున్నాక ఐఎస్ఎస్‌లో గత ఏడాది అక్టోబర్ నుంచి ఉంటున్న అమెరికా, రష్యా, జపాన్ వ్యోమగాములు భూమిపైకి చేరుకోవాల్సి ఉంది.

గ్రేటర్ తిప్రాల్యాండ్ డిమాండ్ నెరవేర్చలేం : బీజేపీ

అగర్తాలా: రాష్ట్రంలో తమ ప్రభుత్వానికి కొత్తగా వచ్చిన తిప్రా మోథా పార్టీ మద్దతు ఇవ్వాలనుకుంటే ఆ పార్టీ చేసే డిమాండ్‌లలో ప్రత్యేక రాష్ట్రం గ్రేటర్ తిప్రాలాండ్ డిమాండ్ మినహా మిగతావన్నీ నెరవేరుస్తామని బీజేపీ స్పష్టం చేసింది. ప్రద్యోత్ డెబ్బార్మా నేతృత్వంలోని తొలిసారిగా ఎన్నికల్లో పోటీ చేసిన తిప్రా మోథా 13 స్థానాల్లో విజయం సాధించింది. 60 స్థానాలున్న అసెంబ్లీలో బీజేపీ మేజిక్ ఫిగర్ దాటి 33 స్థానాల్లో గెలిచింది.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
శుక్రవారం । 3 । మార్చి । 2023

జీఎస్టీ భారం తగ్గించాలని కాంట్రాక్టర్ల వినతి

అన్నానగర్: తాంబరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎస్.ఆళగుమీనకు స్థానిక కాంట్రాక్టర్లు జీఎస్టీకి సంబంధించిన సమస్యలను తొలగించాలని గురువారం వినతిపత్రం సమర్పించారు. ఇందులో గతేడాది జూలై నుంచి జీఎస్టీ పన్నును శ్లాబును కేంద్రం సవరించిందన్నారు. అయితే పాత పనులకు సంబంధించిన అసెస్‌మెంట్ మొత్తానికి 12 శాతం జోడిస్తూ.. 18 శాతం జీఎస్‌టీ చెల్లించమని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ఫలితంగా అదనంగా 6 శాతం సొమ్ము వెచ్చించాల్సి వస్తోందని వాపోయారు. చెన్నై కార్పొరేషన్ తరహాలోనే తాంబరం కార్పొరేషన్‌లోనూ కాంట్రాక్టర్లకు సవరించిన పన్ను విధానాన్ని అమలు చేయాలని కోరారు. అలాగే బిల్లుల్లో జాప్యం లేకుండా చూడాలని విన్నవించారు. లేకుంటే తాము పూర్తిగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

జాతీయ రాజకీయాలపై దృష్టి పెట్టండి



సీఎం స్టాలిన్‌ను కలిసి అభినందిస్తున్న ఫరూక్ అబ్దుల్లా, డీఎంకే కూటమి సభ్యులు

సాక్షి, చెన్నై : జాతీయ రాజకీయాలపై ఇక పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని సీఎం ఎంకే స్టాలిన్‌కు కశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా సూచించారు. చెన్నై పర్యటనకు వచ్చిన ఆయన గురువారం ఉదయం అన్నా అరివాలయంలో స్టాలిన్‌తో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, తమిళనాడుకు ప్రకాశవంతమైన భవిష్యత్ ఉందన్నారు. డీఎంకే ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని సుసంపన్నం చేయడమే లక్ష్యంగా బృహత్తర కార్యక్రమాలతో ముందుకెళ్తోందని వివరించారు. అన్ని విభాగా లు, శాఖల్లోని పథకాలు ఇతర రాష్ట్రాలకే ఆదర్శంగా ఉంటున్నాయని తెలిపారు. ప్రధానంగా సీఎం స్టాలిన్ తమిళనాడు సమగ్రాభివృద్ధే లక్ష్యంగా శ్రమిస్తున్నారని, ఇందుకు తన అభి నందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. సీఎం స్టాలిన్ ఇక జాతీయ రాజకీయాలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందరూ కలిసి బలమైన భారత్‌ను నిర్మించాల్సి ఉందన్నారు. ఈ అంశంలో సీఎం స్టాలిన్ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

వాల్‌టాక్స్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

తిరువొత్తియూరు: వాల్‌టాక్స్ రోడ్డులో వాహనాల రద్దీ రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఈ నేపథ్యంలో రోడ్డును ఆక్రమించి ప్లాట్‌ఫారంపై వ్యాపారం చేస్తున్న దుకాణాలను గురువారం అధికారులు తొలగించారు. వివరాలు.. చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్ సమీపంలోని వాల్‌టాక్స్ రోడ్డులో ప్లాట్‌ఫారంను ఎక్కువ మంది ఆక్రమించుకుని దుకాణాలను నిర్మించుకున్నారు. ఈ కారణంగా ఇక్కడ ట్రాఫిక్ అధికంగా ఉంటోంది. ఫలితంగా వాల్‌టాక్స్ రోడ్డు, సెంట్రల్ రైల్వే స్టేషన్ నుంచి బేసిన్ బ్రిడ్జి వరకు వెళ్లే 5 కిలోమీటర్ల దూరానికి గంటల తరబడి సమయం పడుతోంది. దీంతో వాల్‌టాక్స్ రోడ్డులో ప్లాట్‌ఫారాలపై ఉన్న 100కు పైగా దుకాణాలను తొలగించారు.

నేడు బంగారు అడిగలర్ అవతార తిరునాళ్ వేడుక

కొరుక్కుపేట: ఆధ్యాత్మిక గురువు బంగారు అడిగలర్ 83వ అవతార దినోత్సవాన్ని ఈనెల శుక్రవారం కాంచీపురంలోని మేల్‌రువత్తూరులో ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గురువారం కలశ దీప హోమ పూజ చేపట్టారు. ఈ పూజను ఆదిపరా శక్తి ఆధ్యాత్మిక ఉద్యమ ఉపాధ్యక్షులు శ్రీదేవి రమేష్ ప్రారంభించారు. సేలం,నమక్కల్ జిల్లాల అధికారులు సిద్దర్ పీఠంకు విచ్చేసిన యాత్రికులకు పాద పూజ చేసి స్వాగతం పలికారు. బుధవారం భక్తులకు ప్రజా పాదపూజ వైభవంగా నిర్వహించారు. గురువారం బంగారు అడికలర్ నేతృత్వంలో ప్రజా సంక్షేమ కార్యక్రమం, పువ్వుల పంపిణీ ఘనంగా సాగింది. ప్రత్యేక అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి రామన్ పాల్గొన్నారు.

74 తీర్మానాలకు ఆమోదం

అన్నానగర్ : మేయర్ ప్రియ అధ్యక్షతన గురువారం చెన్నై కార్పొరేషన్ నెలవారీ బోర్డు సమావేశం జరిగింది. ఇందులో 74 తీర్మానాలను పాలకవర్గం ఆమోదించింది. ఇందులో మెట్రోపాలిటన్ చెన్నై కార్పొరేషన్‌లోని 844 ఆధునిక బస్ సర్వీస్ షాపులను నాలుగేళ్లకు పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ప్రాతిపదికన పునరుద్ధరణ, మార్పిడి హ్యాండ్లర్‌ను ఎంపిక చేయడం, భౌగోళిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా, మెట్రోపాలిటన్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని భవనాలను ఇంటింటికీ డ్రోన్‌ల ద్వారా తనిఖీ చేయడం, ఎప్పటికప్పుడు భవనాలను కొలవడం ద్వారా కార్పొరేషన్‌కు ఆదాయాన్ని పెంచడం జరిగింది వంటి తీర్మానాలు ఉన్నాయి.

ఇద్దరిపై మాజీ జవాను తుపాకీ కాల్పులు

– దిండుకల్లులో ఉద్రిక్తత

తిరువొత్తియూరు: దిండికల్లు సమీపంలో భూములు కొని విక్రయించడంలో ఏర్పడిన గొడవలో ఇద్దరిపై మాజీ జవాను తుపాకితో కాల్పులకు పాల్పడ్డాడు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వివరాలు.. శివగంగై జిల్లా కారైకుడికి చెందిన ధనపాల్ విశ్రాంత సైనికుడు. వ్యవసాయదారుడైన ఇతనికి దిండికల్లు జిల్లా చిరుమలై సమీపంలో తెన్మలై కాట్టుకోవిల్ ప్రాంతంలో వ్యవసాయ భూములు ఉన్నాయి. ధనపాల్‌తో పాటు సిరుమలై ప్రాంతానికి చెందిన రాజ్‌కన్ను, కరుప్పయ్య కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో భూముల క్రయ విక్రయాలకు సంబంధించి వీరి మధ్య గురువారం ఉదయం గొడవ ఏర్పడింది. దీంతో ఆగ్రహం చెందిన రైతు ధనపాల్ వద్ద ఉన్న నాటు తుపాకీతో రాజ్‌కన్ను, కరుప్పయ్యపై కాల్పులకు దిగాడు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వారిని దిండుకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఈరోడ్.. హస్తగతం

ఊహించినదే నిజమైంది. ఈరోడ్ తూర్పు నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థినే విజయం వరించింది. డీఎంకే మిత్ర పక్షాల మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థి ఈవీకేఎస్ ఇలంగోవన్ ఘన విజయం సాధించారు. ఎట్టకేలకూ రెండాకుల గుర్తును దక్కించుకున్న పళణిస్వామి వర్గం అభ్యర్థి తెన్నరసు డిపాజిట్ దక్కించుకుని పరువు నిలుపుకున్నారు. ఇక ఒంటరిగా బరిలోకి దిగినా.. 10 వేల ఓట్లతో నామ్ తమిళర్ కట్చి మూడో స్థానం దక్కించుకుంది. అయితే కెప్టెన్ నేతృత్వంలోని డీఎండీకే మాత్రం డిపాజిట్ కోల్పోయి నామమాత్రంగా మారింది.

విజయానంతరం తర్వాత స్వీట్లు పంచుకుంటున్న కాంగ్రెస్ అభ్యర్థి ఈవీకేఎస్ ఇలంగోవన్, నాయకులు



అన్నా అరివాలయం వద్ద బాణసంచా పేల్చుతున్న డీఎంకే కార్యకర్తలు



- ఉప ఎన్నికల్లో సత్తాచాటిన ఇలంగోవన్
- మళ్లీ కాంగ్రెస్ వశమైన తూర్పు నియోజకవర్గం
- 66 వేలకు పైగా మెజారిటీ
- సంబరాల్లో డీఎంకే కూటమి
- డిపాజిట్ దక్కించుకున్న అన్నాడీఎంకే
- ఉనికి చాటిన నామ్ తమిళర్ కట్చి
- కకావికలమైన డీఎండీకే

సాక్షి, చెన్నై: కొంగు మండలంలో ప్రధాన నగరంగా ఉన్న ఈరోడ్‌లో డీఎంకే కూటమి సత్తా చాటింది. తూర్పు అసెంబ్లీ నియోజక వర్గ ఉప ఎన్నికలో ఆ కూటమి తరఫున కాంగ్రెస్ సీనియర్ నేత ఈవీకేఎస్ ఇలంగోవన్ భారీ మెజారిటీతో గెలుపొందారు. వివరాలు.. కాంగ్రెస్ ఎమ్మెల్యే తిరుమగన్ ఈవేరా మరణంతో ఖాళీ అయిన ఈరోడ్ తూర్పు నియోజకవర్గానికి గత నెల 27వ తేదీన ఉప ఎన్నిక పోలింగ్ నిర్వహించారు. 75 శాతానికి పైగా ఓటింగ్ నమోదు కావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ ఎన్నికల్లో డీఎంకే కూటమిలోని కాంగ్రెస్ అభ్యర్థి, తిరుమగన్ తండ్రి ఈవీకేఎస్ ఇళంగోవన్, అన్నాడీఎంకే అభ్యర్థి తెన్నరసు మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఓట్ల చీలికలో కీలక పాత్ర పోషిస్తారనుకున్న డీఎండీకేకు ఈ ఎన్నికలు పెద్ద షాకే ఇచ్చాయి. ఇక నామ్ తమిళర్ కట్చి తన కంటూ ఓటు బ్యాంక్ ఉందని చాటుకుంది.

మొదటి రౌండ్ నుంచి..

చిత్తోడులోని ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఓట్లను లెక్కించారు. ఉదయం 8 గంటలకు గట్టి భద్రత నడుమ కౌంటింగ్ మొదలైంది. పోస్టల్ బ్యాలెట్‌లతో ఈవీకేఎస్ 250 ఓట్లతో మెజారిటీ సాధించారు. ఆ తర్వాత ప్రతి రౌండ్‌లోనూ ఆయన ఆధిక్యం ప్రదర్శించారు. కేవలం నాలుగో రౌండ్ వచ్చే సరికే ఈవీకేఎస్ గెలుపు ఖాయమైపోయింది. దీంతో కౌంటింగ్ కేంద్రం నుంచి అన్నాడీఎంకే అభ్యర్థి తెన్నరసు బయటకు వచ్చేశారు. ధన బలం గెలిచింది.. ప్రజాస్వామ్యం ఓడింది అంటూ తన అసహనాన్ని వ్యక్తం చేసి బయటకు వెళ్లిపోయారు. ఊహించినట్టే సాయంత్రం ఆరు గంటలకు తుది ఫలితం వెలువడింది. 15 రౌండ్ల ఓట్ల లెక్కింపులో ఇలంగోవన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. అన్నాడీఎంకే అభ్యర్థి తెన్నరసు ఇలాకాలోని పోలింగ్ బూత్‌లో సైతం ఈవీకేఎస్ భారీ మెజారిటీ సాధించడం విశేషం. అన్ని రౌండ్ల ఓట్ల లెక్కింపు ముగియడంతో అధికారులు తుది ఫలితాన్ని ప్రకటించారు. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థి ఈవీకేఎస్‌కు 1,09,959 ఓట్లు వచ్చాయి. రెండో స్థానాన్ని అన్నాడీఎంకే అభ్యర్థి తెన్నరసు 43,553 ఓట్లతో దక్కించుకున్నారు. అన్నాడీఎంకే గ్రూపుల్లోని విభేదాల నేపథ్యంలో తెన్నరసుకు ఈ మాత్రం ఓట్లు రావడాన్ని కొందరు ఆహ్వానించడం గమనార్హం. ఇక, డీఎండీకే అభ్యర్థి ఆనందన్ కేవలం 949 ఓట్లకే పరిమితం అయ్యారు. ప్రతి ఎన్నికల్లోనూ క్రమంగా పుంజుకుంటున్న నామ్ తమిళర్ కట్చి ఈ ఎన్నికల్లో మూడో స్థానాన్ని సొంతం చేసుకుంది. ఆపార్టీ అభ్యర్థి ఒంటరిగా బరిలోకి దిగిన మేనక నవనీతన్ ఏకంగా 10,804 ఓట్లను దక్కించుకోవడం విశేషం. మొత్తం మీద ఉప ఎన్నికలో 66 వేల ఓట్ల పై చిలుకు మెజారిటీతో విజయకేతనం ఎగుర వేసిన ఈవీకేఎస్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.



కౌంటింగ్ కేంద్రానికి వెళ్తున్న అన్నాడీఎంకే అభ్యర్థి తెన్నరసు



ఓట్ల లెక్కింపులో పాల్గొన్న అధికారులు

వాడవాడలా.. మిన్నంటిన సంబరాలు..

ఈ ఎన్నికలను డీఎంకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయం తెలిసిందే. అన్నాడీఎంకే కంచుకోటగా ఉన్న కొంగు మండలంలో తన బలాన్ని పెంచుకునేందుకు గత ఏడాదిన్నర కాలంగా డీఎంకే పాలకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పథకాలు, ప్రాజెక్టులు అంటూ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇందుకు ప్రతిఫలం అన్నట్లుగా.. ఉప ఎన్నిక డీఎంకే కూటమికి విజయాన్ని తీసుకొచ్చి పెట్టింది. అన్నాడీఎంకేలోని పళణి స్వామి శిబిరం సర్వశక్తులు ఒడ్డినా ఓటమి తప్పలేదు. ఉప ఎన్నిక ఫలితం పళణి స్వామి శిబిరానికి పెద్ద షాక్ అని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు ఈ పరిణామం పన్నీరు సెల్వం, శశికళ, దినకరన్ శిబిరాలకు ఆనందం కలిగించింది. ఇకనైనా అందరం ఏకమైన పార్టీని నడిపిద్దామనే నినాదంతో ఈ శిబిరాలు ముందుకెళ్తున్నాయి. అయితే ఇందుకు పళణి స్వామి అంగీకరించే అవకాశం మాత్రం లేదు. ఇక ఉప ఎన్నికల్లో విజయం అనంతరం డీఎంకే కూటమి, కాంగ్రెస్ పార్టీల నాయకులు పెద్దఎత్తున వేడుకలు చేసుకున్నారు. ఇక కాంగ్రెస్ విజయాన్ని తమ విజయంగా భావించిన డీఎంకే పాలకులు రాష్ట్రవ్యాప్తంగా సంబరాలకు ఆదేశించారు. దీంతో ఆయా జిల్లా కేంద్రాలు, నగరాలలోని డీఎంకే కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున బాణసంచా మోత మోగింది. డప్పు వాయిద్యాలతో కార్యకర్తలు ఆనంద తాండవం చేశారు.

లోక్‌సభ ఎన్నికలకు రెఫరెండం: సీఎం స్టాలిన్

ఉప ఎన్నికల్లో గెలుపు అనంతరం సీఎం ఎంకే స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ విజయం ద్రవిడ మోడల్ పాలనకు ప్రజలు కట్టిన పట్టం అని పేర్కొన్నారు. ఈ గెలుపు కోసం శ్రమించిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మిత్ర పక్షాల నేతలు, జిల్లాల కార్యదర్శులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిజేశారు. ఉప ఎన్నికల ప్రచారంలో తాను చెప్పిన అంశాలను ప్రజలు గ్రహించారని, ద్రవిడ మోడల్‌కు మరింత బలాన్ని కలిగించే విధంగా తీర్పు ఇచ్చారని తెలిపారు. తాను జాతీయ రాజకీయాల్లోనూ క్రియాశీలంగా ఉంటానని ఈ సందర్భంగా ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఎవరు పీఎం కావాలో..? అనే అంశం కన్నా, ఎవరు ప్రధాని కాకూడదో అన్న అంశంతోనే జాతీయ స్థాయిలో అన్ని పార్టీలను ఏకం చేసే ప్రయత్నంలో ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ఇక ఈరోడ్ గెలుపు రానున్న లోక్‌సభ ఎన్నికలకు రెఫరెండం అని సీఎం స్టాలిన్ పేర్కొన్నారు.

నమ్మకాన్ని వమ్ము చేయను: ఈవీకేఎస్

ఉప ఎన్నికల్లో గెలుపుపై ఈవీకేఎస్ ఇలంగోవన్ స్పందిస్తూ, ప్రజలు తనకు ఇచ్చిన అవకాశాన్ని, తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవలు అందిస్తానని తెలిపారు. ధన బలం గెలించిందని అన్నాడీఎంకే అభ్యర్థి తెన్నరసు పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలు తనను ఆదరించారని, డీఎంకే ప్రభుత్వం పథకాలు, సీఎం స్టాలిన్ సేవలకు లభించిన గెలుపుగా అభివర్ణించారు. ఇక కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ అళగిరి, ఎండీఎంకే నేత వైగో, వీసీకే నేత తిరుమావళవన్, సీపీఎం, సీపీఐ నేతలు ముత్తరసన్, బాలకృష్ణన్‌తో పాటు డీఎంకే కూటమి పార్టీల నేతలు ఈ గెలుపుపై ఆనందం వ్యక్తం చేశారు. అలాగే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సైతం ఈవీకేఎస్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ఓటర్లకు మరింత విస్తృత సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ గెలుపు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వ ఏడాదిన్న పాలనకు మెచ్చి ప్రలు ఇచ్చిన తీర్పు అని తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు, తమిళనాడు రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి పేర్కొన్నారు.

పరిహారం సొమ్ము రూ. 112 కోట్లు విడుదల

- అకాల వర్షం బాధితులకు అందజేయాలని సీఎం ఆదేశాలు

సాక్షి, చెన్నై: గత నెలలో అకాల వర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రూ.112 కోట్ల 72 లక్షలను సీఎం స్టాలిన్ కేటాయించారు. ఈ నిధులను విడుదల చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల అకాలవర్షం కారణంగా డెల్టాలోని నాగపట్నం, తిరువారూర్, తంజావూరు, మైలాడుతురై తదితర జిల్లాలలో వరి పంట దెబ్బతిన్న విషయం తెలిసిందే. రైతులను ఆదుకునేందుకు తక్షణం మంత్రుల నేతృత్వంలోని బృందం ఆయా జిల్లాల్లో పర్యటించి నివేదికను సిద్ధం చేసింది. అలాగే కేంద్ర బృందం సైతం పర్యటించి వరిలో తేమ శాతంపై పరిశీలన జరిపింది. ఈ పరిస్థితుల్లో పంట కోల్పోయిన రైతులను ఆదుకునే విధంగా సీఎం స్టాలిన్ గత నెలాఖరులో నష్ట పరిహారం ప్రకటించారు. రైతులకు ఉపశమనం కలిగించే విధంగా హెక్టారుకు రూ. 20 వేలు ప్రకటించారు. ఈ నష్ట పరిహారం రైతులకు అందించేందుకు వీలుగా సమగ్ర వివరాలను సేకరించారు. పరిహారం చెల్లింపు నిమిత్తం విపత్తు సహాయ నిధి నుంచి రూ. 112.72 కోట్లు కేటాయిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మొత్తాన్ని ఆయా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నారు.



దెబ్బతిన్న వరి పంట

'సీఎం పరిశోధన పథకానికి' రూ. 12 కోట్లు..

సీఎం పరిశోధన సహాయక పథకానికి రూ 12.32 కోట్లను కేటాయించారు. గత ఏడాది ఆగస్టులో జరిగిన వీసీల మహానాడులో ప్రసంగించిన సీఎం స్టాలిన్ పరిశోధన పరంగా విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ప్రత్యేక పథకాన్ని ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులను అర్హత పరీక్షల ఆధారంగా ఈ పథకం కోసం ఎంపిక చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఈ పథకాన్ని అమల్లోకి తీచ్చారు. ఇందుకోసం 12.32 కోట్లు కేటాయిస్తూ నిధులను విడుదల చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో 'పే' వార్డులు



పే వార్డును ప్రారంభిస్తున్న మంత్రులు

- మదురై ఆస్పత్రిలో ప్రారంభించిన మంత్రులు

సాక్షి, చెన్నై : ప్రభుత్వ ఆసుపత్రుల్లో పే వార్డులను విస్తృతం చేయనున్నామని ఆరోగ్యశఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ తెలిపారు. మదురైలో రూ. 1. 02 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ వార్డును గురువారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. వివరాలు.. రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులు ప్రైవేటుకు దీటుగా మల్టీ సూపర్ స్పెషాలిటీ సేవలతో దూసుకెళ్తున్న విషయం తెలిసిందే. చెన్నై, కోయంబత్తూరు, మదురై వంటి నగరాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సూపర్ స్పెషాలిటీ సేవలు, అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు విస్తృతమయ్యాయి. అదే సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో జనరల్ వార్డుతో పాటు నగదు చెల్లించే స్తోమత కలిగిన వారి కోసం పే వార్డుల ఏర్పాటుకు గత ఏడాది ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడతగా సేలంలో పే వార్డు ఏర్పాటు చేశారు. మలి విడతగా మదరైలో గురువారం రూ. 1.02 కోట్లత పే వార్డును ఏర్పాటు చేశారు. దీనిని ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ , వాణిజ్య పన్నుల శాఖమంత్రి పి. మూర్తి ప్రారంభించారు.

మరింత విస్తృతంగా..

మంత్రి సుబ్రమణియన్ మీడియాతో మాట్లాడుతూ, మదురై ప్రభుత్వ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య చికిత్సలు, శస్త్ర చికిత్సలను అందుబాటులోకి తెచ్చామని వివరించారు. రోగులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం వార్డుల అభివృద్ధిలో భాగంగా పే వార్డును ఏర్పాటు చేశామన్నారు. ఇందులో అన్ని రకాల వసతులు ఉంటాయని, నగదు చెల్లించే స్తోమత కలిగిన వారు వీటిలో చేరి చికిత్స పొందవచ్చునని చెప్పారు. అన్ని ఆసుపత్రుల్లో పే వార్డులను విస్తృతం చేయనున్నామని తెలిపారు. కాగా, ఈ పే వార్డులో ఏసీ సౌకర్యంతో పాటు లగ్జరీ సౌకర్యలు ఉంటాయని వివరించారు. సాధారణ వార్డులో రోజుకు రూ. 1,200, లగ్జరీ సౌకర్యాలుంటే రూ. 2 వేలు రుసుము వసూలు చేస్తామని పేర్కొన్నారు.

ఎస్‌ఆర్‌ఎంలో ఘనంగా మిలాన్- 2023

కొరుక్కుపేట: ఎస్ఆర్ఎంలో 15వ ఎడిషన్ మిలాన్ -2023 వార్షిక యూత్ ఫెస్టివల్ గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా తెలుగు నటుడు నాని హాజరై వేడుకలను ప్రారంభించారు. ఎస్ఆర్ఎం విద్యా సంస్థల ఆవరణలోని డాక్టర్ టీపీ గణేషన్ ఆడిటోరియం వేదికగా జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సినీ నటుడు నాని విద్యార్థులతో కలసి సందడి చేశారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేలా రెండేళ్ల తరువాత మిలాన్-2023 నిర్వహించడంపై నాని హర్షం వ్యక్తం చేశారు. 8000 మందికి పైగా విద్యార్థులు పాల్గొనడం గొప్ప విషయమన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో విజేతలకు మొత్తం రూ. 9 లక్షల నగదు పురస్కారాలు అందజేయనున్నట్లు ఎస్ఆర్ఎం వ్యవస్థాపక చాన్స్‌లర్ డాక్టర్ పారివేందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నటుడు నానిని సత్కరించారు.



నానికి జ్ఞాపిక అందజేస్తున్న ఎస్ఆర్ఎం వ్యవస్థాపక చాన్స్‌లర్ పారివేందర్

రెండు కనెక్షన్లు ఉంటే

ఉచిత విద్యుత్‌కు అనర్హులు

- స్పష్టం చేసిన విద్యుత్ శాఖ అధికారులు

కొరుక్కుపేట: విద్యుత్ కనెక్షన్‌తో ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసే పని పూర్తి కావడంతో ప్రక్షాళనపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఒకే ఇంటికి రెండు విద్యుత్ కనెక్షన్లు ఉన్న వారికి 100 యూనిట్ల ఉచిత విద్యుత్ సదుపాయం ఉండదని అధికారులు గురువారం వెల్లడించారు. వివరాలు.. ప్రత్యేక విద్యుత్ కనెక్షన్ తమిళనాడు పవర్ బోర్డ్ రాష్ట్రంలోని 2.32 కోట్ల కుటుంబాలకు 100 యూనిట్లను ఉచితంగా, 500 యూనిట్లను సబ్సిడీ ధరపై అందిస్తోంది. కుటీరాలు, వ్యవసాయానికి పూర్తిగా ఉచితం. పవర్ లూమ్‌లకు కూడా రాయితీపై విద్యుత్‌ను అందజేస్తున్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం ఉచిత, సబ్సిడీ విద్యుత్ కోసం ఏటా రూ.12 వేలకోట్లు ఖర్చు చేస్తోంది. తాజాగా విద్యుత్ చార్జీల రాయితీని చాలా మంది దుర్వినియోగం చేస్తుండడంతో అలాంటి వారిని గుర్తించేందుకు.. కేంద్ర ప్రభుత్వం ఆధార్ నంబర్‌ను విద్యుత్ కనెక్షన్‌కు అనుసంధానం చేయాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను గత ఏడాది నవంబర్‌లో ప్రారంభించింది. మొదట్లో చాలా మంది ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయడానికి వెనుకాడారు. ఈనేపథ్యంలో ఒక వ్యక్తికి ఎన్ని కనెక్షన్లు ఉన్నా, 100 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని మంత్రి ప్రకటించారు. ప్రభుత్వ గృహాలలో నివసిస్తున్న చాలా మందికి 100 యూనిట్లు ఉచితం అని వెల్లడించారు. కొంతమంది వ్యక్తులు ఒకే ఇంటికి 5 కంటే ఎక్కువ కనెక్షన్లు కలిగి ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం విద్యుత్ కనెక్షన్ నంబర్‌తో ఆధార్ అనుసంధానం పూర్తవడంతో విద్యుత్ బోర్డు తమిళనాడు ఎలక్ట్రిసిటీ గవర్నెన్స్ ఏజెన్సీకి వినియోగదారుల వివరాలను అందించింది. ఈ జాబితాలో ఒక్కో ఇంటికి ఒకరి పేరు మీద ఎన్ని కనెక్షన్లు ఉన్నాయి. భార్య పేరుతో విద్యుత్ కనెక్షన్ ఉందా..? అనే వివరాలను సేకరించారు. దీని ఆధారంగా విద్యుత్ బోర్డు ఉద్యోగులు ఇళ్ల వద్దకు వెళ్లి.. అక్రమ విద్యుత్ కనెక్షన్లు తొలిగించాలనే ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో 2 కనెక్షన్లు ఉండేవారికి 100 యూనిట్లు ఉచిత విద్యుత్ ఉండదని అధికారులు వెల్లడించారు.

• దివ్యాంగులకు సాయం



సీఎం ఎంకే స్టాలిన్ బర్త్‌డే వేడుకలను పురస్కరించుకుని గురువారం చూలైమేడులోని ఆదినాథ్ జైన్ ట్రస్ట్ నేతృత్వంలో 600 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, వీల్ చైర్ వంటి సహాయకాలను పంపిణీ చేశారు. దేవదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు లబ్ధిదారులకు ఈ సహాయకాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ ప్రతినిధులు, అతిథులు మనోజ్ జైన్, గంగా ప్రసాద్, అనోప్‌చంద్, ప్రమోద్ చోప్రా, ప్రకాష్ చంద్, మదుష్ లాల్ చౌవాటియా, శ్రీనిక్ జైన్, డాక్టర్లు భువనేశ్వరి రాజేంద్రన్, సురేంద్ర కుమార్ హాజరయ్యారు. – సాక్షి, చెన్నై

కమలనాథుల సందడి

- ఈశాన్య రాష్ట్రాల్లో గెలుపుతో సంబరాలు

సాక్షి, చెన్నై: ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ గెలుపుతో బీజేపీ వర్గాలు రాష్ట్రంలో సంబరాలు చేసుకున్నాయి. రాష్ట్రంలోని ఆ పార్టీ కార్యాలయల వద్ద బాణా సంచాలు పేల్చుతూ , స్వీట్లు పంచారు. వివరాలు.. ఈశాన్య రాష్ట్రాలైన మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్‌లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు గురువారం వెలువడ్డ విషయం తెలిసిందే. ఇందులో నాగలాండ్, త్రిపురలో బీజేపీ కూటమి అధికారం దక్కించుకుంది.

ఇక మేఘాలయాలోనూ బీజేపీ బలం పెరిగింది. ఈ ఆనందాన్ని పంచుకునే విధంగా తమిళనాడులోని బీజేపీ వర్గాలు సంబరాలు చేసుకున్నాయి. చెన్నై టీ నగర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉపాధ్యక్షుడు వీపీ దురై స్వామి నేతృత్వంలో సంబరాలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కమలాలలయాల వద్ద బాణ సంచాలు పేల్చుతూ, స్వీటుల పంచి పెట్టాడు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఉపాధ్యక్షుడు వీపీ దురైస్వామి మాట్లాడుతూ, ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ బలం పెరిగిందని ధీమా వ్యక్తం చేశారు. రానున్న లోక్ సభ ఎన్నికలకు రెఫరెండంగా ఈ ఫలితాలను భావిస్తున్నామన్నారు. మేఘాలయాలో గతంలో తమకు 2 సీట్లు వచ్చిందని, అదే ప్రస్తుతం ఐదు సీట్లుగా పెరడం ఆనందంగా ఉందన్నారు. నాగలాండ్, త్రిపురలో తమ పార్టీ ప్రభుత్వాలు ఏర్పాటు ఖావడం ఖాయమని తెలిపారు.

క్లుప్తంగా

మోసం కేసులో నిందితుడి అరెస్ట్

అన్నానగర్: అధిక వడ్డీ పేరుతో ప్రజల నుంచి వసూళ్లకు పాల్పడి కోట్లాది రూపాయలు కొట్టేసిన రగత్ బస్ ట్రాన్స్‌పోర్ట్ కేసులో నిందితుడిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వివరాలు.. ట్రాన్స్‌పోర్టు అధినేత కమాలుద్దీన్ భార్యతో పాటు బంధువులు, సంస్థలోని కొందరు ఉద్యోగులపై రూ.400 కోట్ల మోసం కేసు రెండేళ్ల క్రితం నమోదైంది. అనంతరం కేసును తిరుచ్చి ఆర్థిక నేరాల పరిశోధనా విభాగం పోలీసులకు బదిలీ చేశారు. ఈ క్రమంలో అధికారులు పోలీసులు కమాలుద్దీన్, అతని బంధువుల ఇళ్లకు తాళాలు వేసి సీలు వేశారు. అలాగే, ఈ కేసుతో సంబంధం ఉన్న ఎవరైనా విదేశాలకు పారిపోకుండా ఉండేందుకు వారి పాస్‌పోర్టులను కూడా స్తంభింపజేశారు. ఈ క్రమంలో, రాగత్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో మేనేజర్ గా పనిచేస్తున్న కరూర్‌కు చెందిన వడివేల్ (36)ను తిరుచ్చి ఆర్థిక నేరాల విభాగం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లిల్లీగ్రేస్ నేతత్వంలోని పోలీసులు తాజాగా అరెస్టు చేశారు. మదురైలోని తమిళనాడు ఇన్వెస్టర్ల రక్షణ ప్రత్యేక కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

భారీగా పేలుడు పదార్థాల స్వాధీనం

అన్నానగర్: కరమడైలో గురువారం పోలీసులు పేలుడు పదార్థాలను పెద్దఎత్తున స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. కోయంబత్తూరు జిల్లా పోలీసు ఎస్పీ బద్రి నారాయణన్ ఆదేశాల మేరకు కరమడై ఇన్‌స్పెక్టర్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం కరమడై ప్రాంతంలో పట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో కరమడై కన్నార్ పాళయం దగ్గర రోడ్డు పక్కన బైక్‌లపై నలుగురు నిలబడి ఉన్నారు. ఆ నలుగురిని బ్యాగులను పోలీసులు తనిఖీ చేయగా, అందులో డిటోనేటర్లు (పేలుడు పదార్థాలు) ఉన్నట్లు తెలిసింది. అనుమానం వచ్చిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. విచారణలో నిందితులు తిరుచ్చూరుకు చెందిన దినేష్ (23), ఆనంద్ (25), కరమడైకి చెందిన సురేష్ కుమార్ (41), తిరువారూరుకు చెందిన సెంథిల్‌కుమార్ (43)గా తేలింది. పాత భవనాలను కూల్చివేసే పనిలో ఉన్న కారమడైకి చెందిన రంగరాజ్‌తో కలిసి పని చేసేందుకు వచ్చినట్లు గుర్తించారు. అయితే ఎలాంటి అనుమతులు పొందక పోవడంతో అరెస్టు చేశారు. వారి నుంచి 1,244 ఎలక్ట్రికల్ డిటోనేటర్లు, 622 జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే వీరికి పేలుడు పదార్థాలను విక్రయించిన మరో నలుగురిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఉగ్రవాదాలతో వీరికి ఏమైనా సంబంధాలు ఉన్నామనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం

తిరువళ్లూరు: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉదయం మధ్యాహ్నం అందించే భోజనం నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మంత్రి నాజర్ తెలిపారు. తిరువళ్లూరు జిల్లా ఆవడిలోని కామరాజర్ ప్రభుత్వ పాఠశాలలో ఉదయం టిఫిన్ అందించే కార్యక్రమంతో పాటు బాలింతలకు పలు సహాయకాలను గురువారం ఉదయం ఆయన అందజేశారు. మంత్రి నాజర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1,545 పాఠశాలల్లో చదువుతున్న 1.14 లక్షల మంది విద్యార్థులకు టిఫిన్ అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటు పౌష్టికాహార లోపం వున్న 0–6 లోపు వయస్సు వున్న 3,885 చిన్నారులకు 56 రోజులకు సరిపడా ఆహార పదార్థాలను అందించారు. జిల్లాలోని 567 మందికి మొదటిసారి గర్భిణులకు పాలు,గుడ్లను సైతం అందజేశారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న 0–6 వయస్సు వున్న 72,238 పిల్లలను గుర్తించి వారికి పౌష్టికాహార లోపం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. కలెక్టర్ ఆల్బీ జాన్‌వర్గీష్ పాల్గొన్నారు.


బాలింతలకు సహాయకాలు పంపిణీ చేస్తున్న మంత్రి నాజర్

బస్సుల్లో ఎమర్జెన్సీ బటన్‌పై అవగాహన

తిరువళ్లూరు: నిర్భయ కింద ప్రభుత్వ బస్సులో అమర్చిన ఎమర్జెన్సీ(పానిక్)బటన్ వినియోగంపై ప్రయాణికులకు ప్రభుత్వ రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి కే. గోపాల్ అవగాహన కల్పించారు. తిరువళ్లూరు బస్టాండులో ప్రభుత్వ రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి గోపాల్ అధికారులతో కలిసి గురువారం ఉదయం తనిఖీ చేశారు. ప్రభుత్వ బస్సుల్లో సక్రమంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఇటీవల రద్దు చేసిన బస్సుల పునరుద్ధరించే అవకాశంపై అధికారులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అవసరమైన బస్సులను నడపాలని, అదనపు సర్వీసుల కోసం తమకు ప్రతిపాదన పంపితే పరిశీలిస్తామని చెప్పారు. అనంతరం ఎంటీసీ బస్సులో అమర్చిన ఎమర్జెన్సీ బటన్ వినియోగం, కలిగే ప్రయోజనంపై అవగాహన కల్పించారు. మేనేజింగ్ డైరెక్టర్ జోసెఫ్ డయాస్, జీఎం నెడుంజెళియన్, డివిజనల్ మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.


ఎంటీసీ బస్సులో ఎమర్జెన్సీ బటన్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి

ఇంజినీరింగ్‌కు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం


మాట్లాడుతున్న ఈఈపీసీ ఇండియా చైర్మన్ అరుణ్‌కుమార్

కొరుక్కుపేట: ఇంజినీరింగ్, రోబోటిక్ పరిశ్రమలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహం ఎనలేనిదని ఈఈపీసీ ఇండియా చైర్మన్ అరుణ్ కుమార్ అన్నారు . ఈ మేరకు గురువారం చెన్నైలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. భారత ప్రభుత్వ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మంత్రిత్వశాఖలోని కామర్స్ విభాగం, తమిళనాడు ప్రభుత్వ సహకారంతో ఈఈపీసీ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో చెన్నైలోని ట్రేడ్ సెంటర్ వేదికగా ఈనెల 16 తేదీ నుంచి 18వ తేదీ వరకు 10వ ఎడిషన్ అంతర్జాతీయ ఇంజినీరింగ్ సోర్సింగ్ షో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మూడు రోజుల పాటు సాగే ఈ సదస్సులో గ్లోబల్ సోర్సింగ్ సెమినార్‌లు, టెక్ సెషన్స్, జి 20 సెషన్స్, 450 ఓవర్‌సీస్ హోస్టెడ్ బైయర్స్ సమావేశాలతోపాటు 300 ఎగ్జిబిటర్లు పాల్గొని ఇంజినీరింగ్ ఉత్పత్తులను ప్రదర్శిస్తారని తెలిపారు. ఇంజినీరింగ్ పరిశ్రమలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహం కొనియాడదగినదని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఇండస్ట్రీ అండ్ కామర్స్ అడిషనల్ కమిషనర్ గ్రేషీ ఎల్ పంచుప్, బెల్జియం ట్రేడ్ కమిషనర్ జయంత్ నడిగెర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

వేలూరు: క్రీడలతో మానసిన ఉల్లాసం కలుగుతుందని పార్లమెంట్ సభ్యుడు కదిర్ ఆనంద్ సూచించారు. గురువారం ఉదయం వేలూరు జిల్లా కాట్పాడిలోని క్రీడా మైదానంలో ముఖ్యమంత్రి కప్ కోసం కబడీ పోటీలను కలెక్టర్ కుమరవేల్ పాండియన్ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాస్థాయిలో ముఖ్యమంత్రి కప్ కోసం వివిధ క్రీడా పోటీలు ఏర్పాటు చేశామని అందులో భాగంగా వేలూరు జిల్లాలోను పెద్దఎత్తున నిర్వహించినట్లు వెల్లడించారు. వేలూరు జిల్లా విద్యలో కొంత వెనుకంజలో ఉన్నా క్రీడల్లో మాత్రం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగు విభాగాల్లో జరగనున్న కబడ్డీ పోటీల్లో విద్యాశాఖ నుంచి ఎనిమిది జట్లు, కళాశాలలకు చెందిన 5 జట్లు, జనరల్ కేటగిరి, ప్రభుత్వ ఉద్యోగుల కేటగిరి సహా మొత్తం 17 జట్లు పాల్గొంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, కార్పొరేషన్ మొదటి జోన్ చైర్ పర్సన్ పుష్పలత వన్నియరాజ, జిల్లా స్పోర్ట్ అధికారి జాన్, పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ కదిర్ ఆనంద్

సేవాభావాన్ని అలవరుచుకోండి

కొరుక్కుపేట: సేవాభావాన్ని అలవరుచుకుంటూ సమాజ సేవలో మరింత ముందుకు సాగాలని వాసవీ క్లబ్ వీ502ఏ జోన్ చైర్‌పర్సన్ ఆర్‌వీఎల్ రత్నకుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వాసవీ క్లబ్ చెన్నై, వాసవీ క్లబ్ వనిత గ్రాండ్ చెన్నై క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జోన్ చైర్ పర్సన్స్ ఫ్రెండ్లీ విజిట్ –2023 ప్రాజెక్టు.. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్‌వీఎల్ రత్న కుమార్ హాజరయ్యారు. ఇందులో వాసవీ క్లబ్ చెన్నై అధ్యక్షుడు ఎంఎస్‌వీ రామ్, కాంచన, సెక్రటరీలు వీఆర్ సెంథిల్ మురుగన్, సుమిత్రా దేవి ,కోశాధికారులు శంకర్ సాయి రామ్, హేమలత తదితురులు పాల్గొన్నారు.


వాసవీ క్లబ్ చెన్నై సభ్యులతో రత్నకుమార్

పేద విద్యార్థులకు పాఠ్య పుస్తకాల వితరణ

వేలూరు: వేలూరు నేతాజీ మైదానంలో జిల్లా యంత్రాంగం, గ్రంథాలయం ఆధ్వర్యంలో మెగా పుస్తక ప్రదర్శన గత నెల 24 నుంచి ఈనెల 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఇందులో విద్య, ఆర్థికాభివృద్ధి, రాజకీయం, చరిత్ర, ఐఏఎస్, ఐపీఎస్ వంటి పుస్తకాలను విక్రయిస్తున్నారు. ఈ ప్రదర్శనను కలెక్టర్ కుమరవేల్ పాండియన్ గురువారం పరిశీలించారు. ఆ సమయంలో మేల్ మలయనూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ తన సొంత ఖర్చుతో పుస్తకాలను కొనుగోలు చేసి అందజేశారు.


పాఠ్య పుస్తకాలు వితరణ చేస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్

విద్యార్థులకు సహాయకాల పంపిణీ

పళ్లిపట్టు: సీఎం స్టాలిన్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా జంగాళపల్లె ప్రభుత్వ మాధ్యమిక తెలుగు పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లతో పాటు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. జంగాళపల్లె ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో సీఎం స్టాలిన్ 70వ పుట్టిన రోజు వేడుకలో భాగంగా గురువారం పార్టీ జిల్లా ప్రతినిధి గోపి ఆధ్వర్యంలో విద్యార్థులకు, స్వీట్లు పంచిపెట్టి నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. నేత గవాస్కర్ పాల్గొన్నారు.

తలైవా 170 షురూ


నిర్మాత సుభాష్కరన్, రజనీకాంత్

తమిళసినిమా: తలైవా అభిమానులకు తీపి కబురు అందింది. సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రస్తుతం జైలర్ చిత్ర షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రంలో ఆయన మరోసారి తన పవర్ ప్యాక్ యాక్టింగ్‌ను ప్రదర్శించనున్నారు. మాలీవుడ్ సూపర్‌స్టార్ మోహన్‌లాల్, కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్ కుమార్, టాలీవుడ్ స్టార్ సునీల్, వసంత రవి, యోగిబాబు, రమ్యకృష్ణ, మిల్కీబ్యూటీ తమన్నా వంటి ప్రముఖ స్టార్లు ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి నెల్సన్ దర్శకుడు. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుద్ సంగీతాన్ని, విజయ్ కార్తీక్ కన్నన్ చాయాగ్రహణం అందిస్తున్నారు. చిత్ర షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఆగస్టు నెలలో ప్రేక్షకుల ముందుకు రావడానికి ముస్తాబవుతోంది. కాగా, మరోపక్క రజనీకాంత్ తన వారసురాలు ఐశ్వర్య దర్శకత్వంలో లాల్‌సలాం అనే చిత్రంలో అతిథి పాత్రలో పోషించడానికి సిద్ధమవుతున్నారు. ఇందులోనూ ఫుల్ మాస్ పాత్రలో మెరవనున్నారని సమాచారం. దీన్ని లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇకపోతే సూపర్‌స్టార్ 170 చిత్రం గురించి చిత్ర పరిశ్రమలో చాలా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని కూడా లైకా సంస్థే నిర్మించనుంది. అయితే దీనికి దర్శకుడు ఎవరన్న విషయంపై రకరకాల ప్రచారం జరిగింది. ముఖ్యంగా డాన్ చిత్రం ఫేమ్ శిబిచక్రవర్తి ఈ చిత్రానికి దర్శకత్వం వహించినట్లు ప్రచారం పెద్దఎత్తున జరిగింది. అలాంటిది అనూహ్యంగా జై భీమ్ చిత్రం ఫేమ్ టీజే జ్ఞానవేల్ పేరు తెరపైకి వచ్చింది. ఇప్పుడు ఈ పేరే ఫిక్స్ అయ్యింది . ఈవిషయాన్ని గురువారం ఉదయం లైకా సంస్థ అధినేత సుభాష్కరన్ పుట్టినరోజు సందర్భంగా అధికారికంగా ప్రకటించారు. దీనికి రాక్‌స్టార్ అనిరుధ్ సంగీతాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రేజీ చిత్రాన్ని 2024లో విడుదల చేయనున్నట్లు కూడా ప్రకటించడం విశేషం. సూపర్‌స్టార్ రజనీకాంత్ తో మళ్లీ సినిమా చేయడం గర్వంగా ఉందని ఆ ప్రకటనలో తెలిపారు.

అరణ్మణై- 4లో ఆ ఇద్దరు


తమన్నా

తమిళసినిమా: అరణ్మణై.. 2014లో సుందర్.సీ రూపొందించిన విజయవంతమైన చిత్రం ఇది. హర్రర్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆ తరువాత అది అరణ్మణై–3 వరకు సక్సెస్ ఫుల్‌గా సీక్వెల్లు కొనసాగాయి. దీంతో సుందర్.సీ తాజాగా అరణ్మణై 4కు సిద్ధం అయ్యారు. ఇందులో నటుడు విజయ్‌సేతుపతి, సంతానం కథానాయకులుగా నటించనున్నట్లు ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు ఈ చిత్రం నుంచి నటుడు విజయ్‌సేతుపతి కాల్‌షీట్స్ సమస్య కారణంగా వైదొలిగినట్లు సమాచారం. దీంతో విజయ్ సేతుపతి పాత్రను దర్శకుడు సుందర్ సీనే పోషించనున్నట్లు తెలుస్తోంది. ఇకపోతే ఇంతకు ముందు వచ్చిన అరణ్మణై సీక్వెల్స్ అన్నింటిలోనూ ఇద్దరు కథానాయికలు నటించడం గమనార్హం. కాగా 4వ సీక్వెల్ లోనూ ఇద్దరు హీరోయిన్లు ఉంటారని, తమన్నా, రాశీఖన్నా ఖరారయ్యారని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగుతోంది. ఈ ఇద్దరు బ్యూటీస్ తమిళంలోనే కాదు, పాన్ ఇండియా స్థాయిలో పేరున్న నటీమణులే. కాగా దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.


రాశీఖన్నా

కోలీవుడ్ టాక్స్

తెరపైకి తొలి సూపర్‌స్టార్ బయోపిక్


పార్థిబన్

తమిళసినిమా: సినిమా అనుభవం ఉన్న ఎవరైనా తొలి తమిళ సినీ సూపర్‌స్టార్ ఎవరంటే పేరు టక్కున చెప్పే పేరు ఎం.కె త్యాగరాజ భాగవతార్. ఆయన్ని ఇండస్ట్రీలో ఎంకేటీ అని పిలిచేవారు. త్యాగరాజ భాగవతర్ నటించిన హరిదాసు చిత్రం 1944లో దీపావళి సందర్భంగా విడుదలై మూడేళ్ల పాటు విజయవంతంగా ప్రదర్శితమైంది. ఆ కాలంలో ప్రఖ్యాతి గాంచిన నటుడు త్యాగరాజ భాగవతార్. అలాంటి గొప్ప నటుడు తన 49వ ఏటనే అంటే 1959వ లో అనారోగ్యం కారణంగా కన్నుమూశారు. గత బుధవారం త్యాగరాజ భాగవతర్ 114వ జయంతి. ఈ సందర్భంగా నటుడు, దర్శకుడు పార్థిబన్ ఓ ట్వీట్ చేశారు. అందులో ఆయన పేర్కొంటూ. 'తమిళనాడు తొలి సూపర్‌స్టార్‌గా గుర్తింపు పొంది రాజభోగాలు అనుభవించిన నటుడు త్యాగరాజ భాగవతార్. పన్నీరుతో స్నానమాడి, కన్నీళ్లతో ముఖం తుడుచుకున్న నటుడు. చివరి దశలో దుర్భర జీవితం అనుభవించారు. ఆయన జీవిత చరిత్రను తెరకెక్కించడానికి కథ, కథనాలను కూడా సిద్ధం చేశాను' అని తెలిపారు. త్యాగరాజ భాగవతార్ బయోపిక్‌ను ఎప్పుడు తీస్తారు? అన్న ప్రశ్నకు పార్థిబన్ బదులిస్తూ కథ, స్క్రీన్‌ప్లే కూడా సిద్ధం చేశానని, అయితే బయోపిక్‌లను, పిరియడ్ కథా చిత్రాలను సాధారణ బడ్జెట్‌తో రూపొందించడం సాధ్యం కాదని, భారీ బడ్జెట్ అవసరం అవుతుందన్నారు. అలాంటి నిర్మాత లభించినప్పుడు త్యాగరాజ భాగవతర్ బయోపిక్‌ను కచ్చితంగా తెరకెక్కిస్తానని స్పష్టం చేశారు.

మేకప్ కోసం 3.5 గంటలు


కాజల్ అగర్వాల్

తమిళసినిమా: మేకప్ గురించి చెప్పాలంటే ముందుగా గుర్తొచ్చేది లోక నాయకుడు కమలహాసన్ పేరే. ఆయన పాత్రలకు ఎంత ప్రాముఖ్యతను ఇస్తారో, గెటప్పులకూ అంతే ప్రాధాన్యం ఇస్తారు. దశావతారం చిత్రంలో ఏకంగా 10 పాత్రల్లో నటించి మెప్పించారు. ఆ పాత్రల కోసం ఆయన కేవలం మేకప్ కోసమే నాలుగైదు గంటలు వెచ్చించేవారు. ఇక ఇండియన్ చిత్రంలోని కమలహాసన్ 90 ఏళ్ల వృద్ధుడిగా మారిపోయి గుర్తు పట్టలేనంతగా అబ్బురపరిచారు. ఇక అదే చిత్రంలో నటి సుకన్య కూడా ఆయనకు సరి సమాన మేకప్‌తో మేకోవర్ అయ్యి నటించి నప్పించారు. 1996లో విడుదలైన ఆ చిత్రం అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. కాగా తాజాగా ఆ చిత్రానికి సీక్వెల్‌గా ఇండియన్ –2 చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. అనేక ఒడుదుడుకుల మధ్య నాలుగేళ్లు గడిచిన ఈ చిత్రం షూటింగ్ ఇప్పుడు శరవేగంగా జరుపుకుంటోంది. శంకర్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో నటి కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీతిసింగ్, ప్రియాసినీ శంకర్, నటుడు సిద్ధార్థ్ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. కాగా ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ చెన్నైలో జరుగుతోంది. 90 ఏళ్ల వృద్ధుడు స్వాతంత్ర్య సమరయోధుడు సేనాపతిగా కమలహాసన్ నటిస్తుండగా, ఆయనకు జంటగా నటి కాజల్ అగర్వాల్ నటిస్తున్నట్లు తాజా సమాచారం. ప్రస్తుతం కాజల్ కూడా బామ్మ పాత్ర కోసం మేకోవర్ అవుతున్నట్లు తెలిసింది. ఇందుకోసం తనూ మేకప్ కోసం రోజూ మూడున్నర గంటల సమయాన్ని ప్రత్యేకంగా వెచ్చిస్తున్నట్లు చిత్రవర్గాలు పేర్కొన్నారు. ఇది ఇండియన్ చిత్రంలో నటి సుకన్య నటించిన పాత్రకు సీక్వెల్ అని సినీ వర్గాలు భావిస్తున్నారు.

శింబు కొత్త సినిమా కథ అదేనా?

తమిళ సినిమా: నటుడు శింబు.. ప్రస్తుతం పత్తుతల చిత్రంలో నటిస్తున్నారు. ప్రియ భవానీ శంకర్ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి చిల్లన్ను ఒరు కాదల్ చిత్రం ఫేమ్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. స్టూడియో గ్రీన్ పతాకంపై జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఇది కన్నడ చిత్రం మఫ్టికి రీమేక్ కావడం గమనార్హం. ఇందులో శింబు గ్యాంగ్‌స్టర్‌గా నటిస్తున్నారు. ఈ నెల 30వ తేదీన చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. దీంతో శింబు తదుపరి చిత్రం ఏమిటన్నది ఆసక్తిగా మారింది. కారణం ఇంతకు ముందు ఈయన గౌతమ్ మీనన్ దర్శకత్వంలో నటించిన వెందు తనిందదు కాడు చిత్రానికి సీక్వెల్ ఉంటుందని ఆ చిత్ర నిర్మాత ఐసరి గణేష్ వెల్లడించారు. అయితే ఆ చిత్రానికి ఇంకా సమయం ఉందని సమాచారం. ఇకపోతే ఇంతకు ముందు కన్నుమ్ కన్నుమ్ కొల్లైయడిత్తాల్ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అయిన దేసింగు పెరియసామి తదుపరి రజనీకాంత్ కోసం కథను సిద్ధం చేసుకున్నారు. ఆయన్ని కలిసి కథను వినిపించారు. రజనీకాంత్ కూడా కథ నచ్చిందని ప్రచారం జరిగింది. అయితే ఆయన దేసింగు పెరియసామిని పక్కన పెట్టి బీస్ట్ చిత్రం ఫేమ్ నెల్సన్‌కు అవకాశం ఇచ్చారు. ఆ చిత్రమే నిర్మాణంలో ఉన్న జైలర్. దీంతో ఎప్పటికైనా రజనీకాంత్‌తో చిత్రం చేస్తానని చెప్పిన దేసింగు పెరియసామి తాజాగా శింబు హీరోగా చిత్రం చేయడానికి రెడీ అవుతున్నట్లు సమాచారం. శింబు హీరోగా చేసే చిత్రం రజినీకాంత్‌కు చెప్పిన కథా లేక వేరేనా అన్న చర్చ కోలీవుడ్‌లో జరుగుతోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాలంటే కొద్ది రోజులు ఆగాల్సిందే.


నటుడు శింబు

కాంగ్రెస్, డీఎంకే శ్రేణుల సంబరాలు


తిరువళ్లూరు: స్వీట్లు పంచిపెడుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు


వేలూరులో..

తిరువళ్లూరు: ఈరోడ్డు ఉప ఎన్నికల్లో డీఎంకే కూటమి అభ్యర్థిగా బరిలో దిగిన కాంగ్రెస్ నేత ఈవీకేఎస్ ఇళంగోవన్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఈ నేపథ్యంలో తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్, డీఎంకే వీసీకే నేతలు బాణసంచా పేల్చి స్వీట్లు పంచి పెట్టి సంబరాలు నిర్వహించారు. తిరువళ్లూరు నగరంలో జరిగిన సంబరాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ పార్టీ సీనియర్ నేత పాన్ పాండ్యన్, మున్సిపల్ వైస్ చైర్మన్ రవిచంద్రన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాన్‌పాండ్యన్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉంటాయో ఈరోడ్ ఎన్నికలు చాటి చెప్పాయని అభిప్రాయపడ్డారు. డీఎంకే ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు, అన్నాడీఎంకే బీజేపీపై ఉన్న ప్రజావ్యతిరేకత స్పష్టంగా ఎన్నికల్లో కనిపించాయన్నారు. ఇదే విధంగా కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి రఘు రామన్ నేతృత్వంలోనూ పార్టీ నేతలు కార్యకర్తలు సంబరాలను నిర్వహించారు.

వేలూరులో..

వేలూరు: ఈరోడ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఈవీకేఎస్ ఇళంగోవన్ అత్యధిక మెజారిటీతో గెలుపొందడంతో వేలూరు అన్నారోడ్డులోని ఆ పార్టీ కార్యాలయం వద్ద సందడి నెలకొంది. పార్టీ జిల్లా కార్యదర్శి టీకా రామన్ అధ్యక్షతన కార్యకర్తలు అధిక సంఖ్యలో టపాకాయలు కాల్చి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మైనారిటీ విభాగం జిల్లా కార్యదర్శి వాహిద్ బాషా బాబు కుమార్ తదితరులున్నారు.

ఆర్కేపేటలో..

తిరుత్తణి: ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఘన విజయంతో ఆర్కేపేటలో ఎంపీ జగద్రక్షగన్ ఆధ్వర్యంలో గురువారం డీఎంకే శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్, మాజీ జిల్లా కార్యదర్శి భూపతి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు బాణసంచా పేల్చి ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. అమ్మయార్‌కుప్పం బజారులో మండల కార్యదర్శి షణ్ముగం, పంచాయతీ సర్పంచ్ ఆనంది సెంగుట్టువన్ సహా డీఎంకే శ్రేణులు వేడుకగా సంబరాలు జరుపుకున్నారు. తిరుత్తణి, పళ్లిపట్టు, పొదటూరుపేట సహా పరిసర ప్రాంతాల్లోనూ వేడుకలు మిన్నంటాయి.


తిరుత్తణి: స్వీట్లు పంచుతున్న ఎంపీ జగద్రక్షగన్

క్లుప్తంగా

గాయపడ్డ వ్యక్తి మృతి

వేలూరు: అంత్యక్రియల ఊరేగింపులో బాణసంచా పేలి గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. వేలూరు జిల్లా గుడియాత్తం తాలుకా కల్లూరు గ్రామానికి చెందిన వృద్ధురాలు మంగళవారం మృతిచెందింది. మృతదేహాన్ని దహనక్రియలు చేసేందుకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఊరేగింపులో బాణసంచా కల్లూరు గ్రామం శ్రీనివాసనగర్‌కు చెందిన ప్రభాకరన్(30), కేవీ కుప్పం సమీపంలోని కీల్ ఆలత్తూరు గ్రామానికి చెందిన బాబుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ ఇద్దరిని గుడియాత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఇద్దరిని వేలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రభాకరన్ గురువారం ఉదయం మృతిచెందాడు. గుడియాత్తం పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

బస్సు ఆపలేదని అద్దాలు ధ్వంసం

తిరువళ్లూరు: ఇంటికి సమీపంలో బస్సును ఆపలేదని ఆగ్రహంతో ఓ యువకుడు బస్సు వెనుక అద్దాలు ధ్వంసం చేశాడు. పెనాలూరుపేట నుంచి తిరువళ్లూరు వైపు ప్రభుత్వ బస్సు గురువారం ఉదయం 49 మంది ప్రయాణికులతో బయలుదేరింది. బస్సు పుల్లరంబాక్కం వద్ద వెళుతుండగా గుర్తు తెలియని యువకుడు బస్సుపై రాయి విసరడంతో వెనుక అద్దాలు ధ్వంసమయ్యాయి. డ్రైవర్ హేమనాథన్ పుల్లరంబాక్కం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. విచారణలో బుధవారం ఉదయం పుల్లరంబాక్కం గ్రామానికి చెందిన యువకుడు ఇదే బస్సులో ప్రయాణిస్తుండగా తన ఇంటి వద్ద బస్సు ఆపలేదని రాయి విసిరినట్లు తెలిసింది.

పప్పు గోడౌన్‌లో అగ్నిప్రమాదం

తిరువొత్తియూరు: చెన్నై చాకలిపేటలో పప్పు గోడౌన్‌లో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. చెన్నై చాకలిపేట నమ్మయ్యార్ మేస్త్రి వీధికి చెందిన రమేష్ (57). అదే ప్రాంతంలో పప్పు గోడౌన్ నడుపుతున్నాడు. ఇక్కడ 10 మందికిపైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఇక్కడ హోల్‌సేల్‌లో వ్యాపారులు పప్పులు తీసుకుని వెళుతుంటారు. గురువారం తెల్లవారుజామున గోడౌన్ నుంచి మంటలు రావడంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి, పోలీసులకు సమాచారం అందించారు. చెన్నై చాకలిపేట పోలీసులు, అగ్నిమాపకసిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.5లక్షల విలువ చేసే పప్పు కాలి బూడిదైంది. చాకలిపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడి అరెస్ట్

అన్నానగర్: తాంబరం సమీపంలోని ఓ చర్చిలో చోరీకి పాల్పడిన వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై తూర్పు తాంబరంలో ఉన్న ఫాతిమా క్రిస్టియన్ చర్చిలో పాస్టర్ జాన్‌కురియన్ గదిలోని మాతా విగ్రహం అద్దాల పెట్టెను పగులగొట్టి విగ్రహంలోని బంగారు చైన్, శిలువ, ఉంగరం చోరీ చేశారు. ఆలయంలో అమర్చిన సీసీ ఫుటేజీలను పరిశీలించగా సంఘటన జరిగిన రోజు ఉదయం ఆలయానికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ప్రార్థన చేసిన తర్వాత పాస్టర్ గదికి వెళ్లిన దృశ్యాలు రికార్డయ్యాయి. ఈ ఘటనపై సేలయూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో గురువారం తూర్పు తాంబరం బస్‌స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని విచారించారు. విచారణలో అతను తిరునెల్వేలి జిల్లాకు చెందిన డేనియల్ (23) పాత నేరస్తుడని తిరునల్వేలి, కన్యాకుమారి, నాగపట్నం ప్రాంతాల్లోని చర్చిల్లో చోరీకి పాల్పడేవాడని తెలిసింది. అతన్ని అరెస్ట్ చేసి మూడు సవర్ల బంగారు నగలను అతడి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.76 లక్షల మోసం

– చెన్నై విమానాశ్రయంలో యువకుడి అరెస్ట్

అన్నానగర్: ఆన్‌లైన్ వ్యాపారంలో రూ.76 లక్షలు మోసం చేసిన ఓ యువకుడు గురువారం దుబాయ్ నుంచి చెన్నైకి వస్తుండగా విమానాశ్రయంలో పట్టుబడ్డాడు. వివరాలు.. కడలూరు జిల్లా రామానందం ప్రాంతానికి చెందిన మహ్మద్ హనీబా (36) దివ్యాంగుడు. కడలూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయన గతంలో ఓ ఫిర్యాదు అందజేశారు. అందులో అదే జిల్లాకు చెందిన కదిర్ వేల్, ఇతని కుమారుడు కల్యాణ్‌కుమార్ పెరంబలూరు జిల్లాలోని బంధువు ద్వారా తనకు పరిచయమైనట్లు పేర్కొన్నారు. దివ్యాంగులుగా ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా డబ్బు పెట్టుబడి పెడితే అదనంగా డబ్బులు వస్తాయని చెప్పారు. దీంతో బ్యాంకు ద్వారా రూ.85 లక్షలు పలు దఫాలుగా కదిర్ వేల్, ఆయన కుమారుడు కల్యాణ్‌కుమార్‌కు చెల్లించినట్లు వాపోయారు. అయితే లాభాల పేరుతో కేవలం రూ.8.90 లక్షలు మాత్రమే ఇచ్చి మిగిలిన రూ.76 లక్షలను మోసం చేసినట్లు ఆరోపించారు. దీంతో కడలూరు జిల్లా క్రైం బ్రాంచ్ పోలీసులు కదిర్‌వేల్, ఇతని కుమారుడు కల్యామ్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. ఇందులో కదిర్‌వేల్‌ను అరెస్టు చేశారు. అయితే అతని కుమారుడు కల్యాణ్ కుమార్ (28) పరారీలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో కల్యాణ్ కుమార్ దుబాయ్‌లో ఉన్నట్లు చెన్నై ఇమిగ్రేషన్ విభాగానికి సమాచారం అందింది. గురువారం దుబాయ్ నుంచి చెన్నై వచ్చిన కల్యాణ్‌కుమార్‌ను చెన్నై విమానాశ్రయంలో అధికారులు పట్టుకుని కడలూరు జిల్లా క్రైం బ్రాంచ్‌కు అప్పగించారు. దీంతో పోలీసులు కడలూరు కోర్టులో హాజరుపరిచి స్థానిక సెంట్రల్ జైలుకు తరలించారు.

మేధో గురుదక్షిణామూర్తికి విశేష పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉన్న మేధో గురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. తొలుత కలశ ప్రతిష్ట చేసి, వినాయక, కలశ పూజలు చేశారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకం జరిపారు. అనంతరం పర్వత, చక్ర, కుంభ, మహా మంగళ హారతులు ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఎర్రస్మగ్లర్‌కు రిమాండ్

తిరుపతి లీగల్ : ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడుగా ఉన్న తమిళనాడు విల్లుపురం జిల్లా శంకరాపురం తాలూకా కార్యలూరుకు చెందిన ఆర్.పళణి వేలుకు ఈనెల 16వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ కోర్టు జడ్జి నాగరాజు గురువారం ఆదేశాలు జారీ చేశారు. 2018లో నిందితుడు పళణివేలుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఎర్రచందనం అక్రమ రవాణా కేసు నమోదు చేశారు. ఆ కేసులో అతను బెయిల్‌పై విడుదలై తిరిగి కోర్టు వాయిదాలకు హాజరుకాలేదు. దీంతో కోర్టు అతన్ని నాన్‌బెయిల్‌బుల్ వారెంట్‌పై హాజరుపరచాలని ఆదేశించింది. అయితే పళణి వారెంట్‌ను రీకాల్ చేయాలంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. న్యాయమూర్తి రీకాల్ పిటీషన్‌ను కొట్టివేసి అతన్ని రిమాండ్‌కు తరలిస్తూ ఆదేశాలు జారీచేశారు.

విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

- సాహితీ మాలతి సభలో జేవీ సత్యవాణి


విజేతలతో అతిథులు, నిర్వాహకులు

కొరుక్కుపేట: విద్యార్థులు వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం వంటి నైపుణ్యాలను సాధనతో మరింతగా పెంపొందించుకోవాలని ద్రవిశ్వ విద్యాలయం, భాషా సాంకేతిక బోధనా శాఖలో ఆచార్యలైన జేవీ సత్యవాణి విద్యార్థులకు పిలుపునిచ్చారు. చెన్నై పట్టాభిరాంలో ఉన్న ధర్మ మూర్తి రావు బహదూర్ కలవల కన్నన్ చెట్టి హిందూ కళాశాల తెలుగు శాఖ, మాలతీ చందూర్ కుటుంబం స్నేహితులు సంస్థ సంయుక్తంగా, సాహితీ మాలతి పేరుతో అంతర్ కళాశాల వార్షిక సాహిత్య పోటీలు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య జేవీ సత్యవాణి మాట్లాడుతూ.. నవలా రచయిత్రి దివంగత మాలతీ చందూర్ రచనలు భావి తరాలకు అందించాలనే తలంపుతో ఈ సాహిత్య పోటీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ కళాశాలకి చెందిన తెలుగు విద్యార్థులు, రాజధాని కళాశాల, మద్రాసు విశ్వ విద్యాలయం, డీబీ జైన్ కళాశాల తెలుగు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నగదు బహుమతులు అందుకున్నారు. అన్ని పోటీల్లో చక్కని ప్రతిభను చాటుకున్న వారికి మాలతీ చందూర్ జ్ఞాపికను హిందూ కళాశాల ఉదయం విభాగం విద్యార్థులు వి. నితీష్, వై. శ్రిత దక్కించుకున్నారు. వెంకట్ త్రివేద్ వర్మ, ధనుష్, చరిష్మ, సలోమి, సాయి కల్యాణి, నీలిమ, మాళవిక విద్యార్థులు బృందాలుగా పాల్గొని జ్ఞాపికలను, ధ్రువ పత్రాలను అందుకున్నాయి. విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరై నగదు బహుమతులను గెలుచుకున్నారు. కళాశాల ప్రధాన అధ్యాపకురాలు డా. జి. కల్విక్కరశి అధ్యక్షోపన్యాసం చేసి.. ముఖ్య అతిథిని శాలువాతో ఘనంగా సత్కరించారు. పోటీలను మాధురి పర్యవేక్షించారు.

కల్తీ నూనె కేసులో 9 మంది అరెస్ట్


అరెస్టయిన నిందితులు

– 2.70 లక్షల లీటర్ల కల్తీ ఆయిల్ సీజ్


ఆయిల్ కల్తీకి ఉపయోగించిన ట్యాంకర్లు

తిరువళ్లూరు: తిరువళ్లూరు జిల్లా రెడ్‌హిల్స్‌కు సమీపంలో కల్తీ నూనెను తయారు చేసి విక్రయిస్తున్న 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు వారి నుంచి 2.70 లక్షల లీటర్ల కల్తీ నూనెను స్వాధీనం చేసుకున్నారు. రెడ్‌హిల్స్‌లోని పెద్దనల్లూరు గ్రామంలో అవలేంజ్ ఇంప్యాక్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ ఉంది. ఈ కంపెనీలో ఆయిల్‌ను కల్తీ చేసి రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నట్టు రెడ్‌హిల్స్ పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న సీఐ ఆనందకుమార్, ఎస్‌ఐ తిరుజ్ఞానసంబంధంతో కూడిన ప్రత్యేక పోలీసు బృందం కంపెనీపై దాడులు నిర్వహించింది. ఆ సమయంలో ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన ఆయిల్ ట్యాంకర్‌ను సీజ్ చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన తులసీసింగ్‌రాజ్ బుడ్, అశోక్, ముఖేష్‌కుమార్, రామ్‌సింగ్, బింద్ర ప్రసాద్, దీపక్, కడలూరు జిల్లా బన్రుట్టి ప్రాంతానికి చెందిన ట్యాంకర్ డ్రైవర్ ఉదయరాజ్, తిరువణ్ణామలైకు చెందిన కృష్ణమూర్తి సహా సహా 9 మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి 2.70లక్షల లీటర్లు కల్తీ ఆయిల్, ట్యాంకర్‌ను సైతం సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

తెప్పోత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఐదు రోజుల పాటు శ్రీవారి తెప్పోత్సవాలు
- భారీ ఏర్పాట్లు చేపట్టిన టీటీడీ


దేదీప్యమానంగా శ్రీవారి పుష్కరిణి

తిరుమల: ప్రతి ఏటా ఫాల్గుణ మాసం ఏకాదశి నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించే శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలకు టీటీడీ సర్వం సిద్ధం చేసింది. శుక్రవారం నుంచి తెప్పోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈమేరకు తెప్పలను పుష్కరిణిలో ప్రయోగాత్మకంగా అధికారులు ఇప్పటికే పరిశీలించారు. తెప్పోత్సవాలను పురస్కరించుకున్ని శ్రీవారి పుష్కరిణిని కూడా సర్వాంగ సుందరంగా అలంకరించారు. తెప్పోత్సవాల నేపథ్యంలో ఐదు రోజుల పాటు పలు ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.

తెప్పోత్సవాలు ఇలా..

- మొదటి రోజు స్వామి వారు త్రేతాయుగానికి ప్రతీకగా శ్రీరాముని అవతారంలో మాడ వీధుల్లో ఊరేగనున్నాయి. అనంతరం పుష్కరిణికి చేరుకుని తెప్పలపై విహరించనున్నారు.
- రెండో రోజు ద్వాపరయుగానికి ప్రతీకగా శ్రీకృష్ణుని అవతారంలో తెప్పలపై విహరిస్తారు.
- మూడవ రోజు కలియుగానికి ప్రతీకగా భూదేవి, శ్రీదేవి సమేతుడై శ్రీవారు తెప్పలపై విహరిస్తారు.
- నాలుగో రోజు మలయప్పస్వామి తెప్పలపై ఐదు ప్రదక్షిణలు చేసి భక్తులను కనువిందు చేయనున్నారు.
- చివరిగా ఐదోరోజు స్వామి వారు పుష్కరిణిలో ఏడు ప్రదక్షిణలు చేయనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలను పురస్కరించుకున్ని టీటీడీ అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. శ్రీవారి పుష్కరిణిలో టీటీడీ ఇంజినీరింగ్ అధికారులు తెప్పల ట్రయల్‌రన్‌ను నిర్వహించి లోటు పాట్లును సరిదిద్దారు. ఈసారి తెప్పలపై ఉన్న మండపాని అత్యంత సుందరంగా తీర్చిదిదారు. తెప్పోత్సవాలు జరిగే ఐదు రోజుల పాటు టీటీడీ ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల పుష్పాలతో తెప్పను సుందరంగా అలంకరించనున్నారు. ఇప్పటికే పుష్కరిణికి వచ్చే మార్గంతో పాటు పుష్కరణి లోపల కూడా పుష్పాలతో వివిధ రకాల కటౌట్లను ఏర్పాటు చేస్తున్నారు. టీటీడీ విద్యుత్‌శాఖ అధికారులు కూడా మాడ వీధులతో పాటు పుష్కరిణి, పరిసర ప్రాంతలను విద్యుత్ దీపకాంతులతో శోభయమానంగా అలంకరిస్తున్నారు. భక్తుల కోసం టీటీడీ కరెంట్ బుకింగ్ ద్వారా రోజూ 200 టిక్కెట్లను జారీ చేస్తోంది ఈ టిక్కెట్లు కలిగిన భక్తులను టీటీడీ పుష్కరిణిలోకి ప్రత్యేకంగా అనుమతించనున్నది.

పలు సేవలు రద్దు

తెప్పోత్సవాలను పురస్కరించుకొని శ్రీవారికి జరిగే నిత్య సేవ అయిన సహస్రదీపాలంకరణ సేవలను ఐదు రోజుల పాటు టీటీడీ రద్దు చేసింది. మార్చి 3 నుంచి 5వ తేది వరకు ఆర్జిత బ్రహ్మోత్సవాలను రద్దు చేసింది. ఇక పౌర్ణమి రోజున జరిగే శ్రీవారి గరుడసేవను కూడా రద్దు చేసింది.



నీటికుంటలో ఇద్దరి గల్లంతు

వేలూరు: నీటి కుంటలో స్నానానికి వెళ్లిన ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. రాణిపేట జిల్లా ఆర్కాడు సమీపంలోని నంద్యాలం గ్రామానికి ముబారక్(16), రియాజ్(16) మేల్ విషారం ప్రాంతంలోని ప్రయివేటు పాఠశాలలో ప్లస్‌వన్ చదువుతున్నారు. గురువారం మధ్యాహ్నం నుంచి కళాశాలకు సెలవు ప్రకటించడంతో మధ్యాహ్నం 2 గంటల సమయంలో బైకులో నంద్యాలం ప్రాంతంలోని పాత రాళ్ల క్వారీ వద్దకు స్నానానికి వెళ్లారు. అయితే నీటిలో దిగిన ఇద్దరు విద్యార్థులు బయటకు రాకపోవడంతో స్థానికులు గమనించి రత్నగిరి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు, రాణిపేట అగ్నిమాపక సిబ్బంది కుంట వద్దకు చేరుకుని విద్యార్థుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు వారి ఆచూకీ లభించలేదు. విద్యార్థుల బైకు, చెప్పులు, దుస్తులు, పాఠశాల బ్యాగులు మాత్రమే కుంట మిట్టపైన కనిపించడంతో విద్యార్థులు కుంటలో మునిగి మృతి చెంది ఉండవచ్చని రత్నగిరి పోలీసులు అనుమానిస్తున్నారు.



ముబారక్ (ఫైల్), రియాజ్ (ఫైల్)

విస్తృతస్థాయి పరిశోధనలే లక్ష్యం


ప్రతినిధులకు సత్కారం

కొరుక్కుపేట: మధుమేహంపై విస్తృత స్థాయి పరిశోధనలే లక్ష్యంగా ముందుకుసాగాలని డీకెన్ విశ్వవిద్యాలయం(ఇంటర్నేషనల్) ఫ్యాకల్టీ ఆఫ్ హెల్త్ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డేవిడ్ ఆస్టిన్ తెలిపారు. మద్రాసు డయాబెటీస్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎండీఆర్ఎఫ్), డీకిన్ విశ్వవిద్యాలయం భాగస్వామ్యానికి పదేళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా వేడుకలను గురువారం నిర్వహించారు. డాక్టర్ మోహన్స్ డయాబెటీస్ స్పెషాలిటీ సెంటర్, ఎండీఆర్ఎఫ్ చైర్మన్, చీఫ్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ వి మోహన్ అధ్యక్షత వహించి పదేళ్ల భాగస్వామ్యానికి గుర్తుగా ముందుగా డీకిన్ విశ్వవిద్యాలయం అధ్యాపకులను ఘనంగా జ్ఞాపికలతో సత్కరించారు. ఎండీఆర్ఎఫ్ ప్రెసిడెంట్ డాక్టర్ అంజన పాల్గొన్నారు.

గంజాయి కేసులో యువకుడు అరెస్ట్

తిరువొత్తియూరు: చెన్నై మెరీనా తీరంలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చెన్నై ట్రిప్లికేన్ మాట్టాంకుప్పం, మెరీనా ప్రాంతంలో రాత్రి వేళల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు మెరీనా పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో పోలీసులు బుధవారం మాట్టాంకుప్పం మెరీనా తీరంలో నిఘావేశారు. ఆ సమయంలో ఓ యువకుడు బైక్‌లో గంజాయి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. వెంటనే పోలీసులు అతన్ని పట్టుకుని విచారణ చేశారు. విచారణలో అతను చెన్నై పల్లవన్‌సాలై ఎస్ఎం నగర్‌కు చెందిన షెరీఫ్ అలియాస్ ముస్తఫా (19) అని తెలిసింది. పోలీసులు అతన్నిఅరెస్ట్ చేసి, రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ పరిశీలన


రూముల కేటాయింపు కౌంటర్లను తనిఖీ చేస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుమల: మార్చి 1 నుంచి తిరుమలలో ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమలలోని గదులు కేటాయించే కేంద్రాలు, ఉప విచారణా కార్యాలయాలను ఈఓ గురువారం పరిశీలించారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తిరుమలలో దళారీ వ్యవస్థను పూర్తిగా తగ్గించేందుకు, టీటీడీ అందిస్తున్న సౌకర్యాలు సామాన్య భక్తులకు చేరేందుకు ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ ఉపయోగపడుతుందన్నారు. తిరుమలలో సర్వదర్శనం, లడ్డూప్రసాదం, గదుల కేటాయింపు, రీఫండ్ చెల్లింపు అంశాల్లో ఈ పరిజ్ఞానం ప్రయోగాత్మకంగా ప్రారంభించినట్టు వెల్లడించారు. తద్వారా గదులను రొటేషన్ చేసే పద్ధతిన పూర్తి స్థాయిలో అరికట్టవచ్చన్నారు. రెండవ వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచి టోకెన్లు లేకుండా సర్వదర్శనానికి వెళ్లే భక్తులకు కూడా ఈ సాంకేతిక పరిజ్ఞానంతో రూ.50 ఉచిత లడ్డూ టోకెన్లు ఇవ్వడం జరుగుతోందని, ఈ పరిజ్ఞానం ద్వారా లడ్డూ ప్రసాదాలలో దళారీ వ్యవస్థను కట్టడి చేయవచ్చని చెప్పారు. అంతకుముందు ఈఓ ఏఆర్పీ, సీఆర్ఓ, ఎంబీసీ 34 గదుల కేటాయింపు కేంద్రాలు, ఏఎంసీ, ఎస్ఎంసీ, టీబీసీ ఉపవిచారణ కార్యాలయాలను పరిశీలించారు. ఈఓ వెంట డిప్యూటీ ఈఓలు హరీంద్రనాథ్, భాస్కర్, ఏఈఓ వెంకటేశ్వర్లునాయుడు, ఓఎస్డీ రామకృష్ణ ఉన్నారు.

ఒప్పందాలు..



ఇంటర్నేషనల్ కామర్స్ ఒలింపియాడ్ నిర్వహణ, పాఠశాలల విద్యార్థులకు అవగాహన, అకడమిక్ సహకారమే లక్ష్యంగా సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్‌తో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఇండియా అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. చెన్నైలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు మనీష్ గుప్తా, బి నరసింహన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఇందులోని ముఖ్యాంశాలు, కార్యక్రమాలను వివరించారు. – సాక్షి, చెన్నై

క్లుప్తంగా...

రాష్ట్ర సత్తా చాటేలా సదస్సు

- విశాఖ, రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు సమ్మిట్‌తో నాంది
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని



దొండపర్తి (విశాఖ దక్షిణ): గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఆంధ్రప్రదేశ్ సత్తాను చాటే చక్కటి వేదికని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి విడదల రజని పేర్కొన్నారు. గురువారం విశాఖలోని ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో సదస్సు ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. విశాఖ, రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు సమ్మిట్‌తో నాంది పలుకుతామన్నారు. విశాఖను పరిపాలనా రాజధానిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నాటి నుంచి కార్యాచరణ ఆ క్రమంలోనే కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో సరికొత్త వ్యాపారాలు, కొత్త పరిశ్రమల స్థాపనకు సమ్మిట్ స్వాగతం పలుకుతుందని ఆకాంక్షించారు. 40 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్న నేపథ్యంలో ఏపీలో పరిశ్రమల స్థాపనకు ఉత్సాహంగా ముందుకు రావడం గర్వ కారణమన్నారు. రాష్ట్రానికి, విశాఖకు ఉన్న సహజ వనరులే పారిశ్రామిక వికాసానికి ఆభరణాలుగా అభివర్ణించారు. వైద్య రంగంలో అపార పెట్టుబడులు రానున్నాయని, ఇందుకోసం పీపీపీ విధానాన్ని అనుసరిస్తామని వెల్లడించారు. సమ్మిట్ ద్వారా రూ.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నామని చెప్పారు. జీఐఎస్‌తో రానున్న రెండేళ్లలో లక్షలాది మంది ఐటీ, హెల్త్‌కేర్, డిజిటల్ మార్కెటింగ్ నిపుణులు అందుబాటులోకి రానున్నారని తెలిపారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఆయనకు వత్తాసు పలికే పార్టీలు జీఐఎస్‌పై గోబెల్స్ ప్రచారం చేస్తున్నాయని మంత్రి రజని మండిపడ్డారు. టీడీపీ హయాంలో ఫేక్ ఎంవోయూలు జరిగాయని గుర్తు చేశారు.

13న విధులను సర్దుబాటు చేయండి

- ప్రైవేట్ టీచర్లు, ఉద్యోగులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు సహకరించండి
- యాజమాన్యాలకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశం

సాక్షి, అమరావతి: ఈ నెల 13వ తేదీన రాష్ట్రంలో మూడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు పోలింగ్ జరుగుతున్నందున అక్కడ ఓటర్లుగా నమోదైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అనుమతి ఇవ్వాలని ప్రైవేట్ యాజమాన్యాలను కేంద్ర ఎన్నికల కమిషన్ గురువారం ఆదేశించింది. రాష్ట్రంలోని శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం, ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు, వైఎస్సార్-అనంతపురం-కర్నూలు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు, ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు, వైఎస్సార్-అనంతపురం-కర్నూలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు ఈ నెల 13వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని కమిషన్ తెలిపింది. ఈ మేరకు పోలింగ్ సమయంలో విధుల వేళలను మార్పు చేయడం లేదా షిఫ్టును ఆలస్యంగా సర్దుబాటు చేయడం ద్వారా పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించాలని ప్రైవేట్ విద్యాసంస్థలు, బిజినెస్, ట్రేడ్, పరిశ్రమల యాజమాన్యాలకు సూచించింది.

రేణుక పిచ్చికి ఆరోగ్యశ్రీతో వైద్యం

- గ్లోబల్ సమ్మిట్ నుంచి దృష్టి మళ్లించే నాటకం: రజనీ చౌదరి
- ఆమె ప్రస్థానం బాటిల్‌తో మొదలైతే కుమార్తె డ్రగ్స్ దాకా తీసుకెళ్లింది
- అసమర్థ సంతానంతో చంద్రబాబు, రేణుక అవస్థలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంతో సంబంధం లేని రేణుక చౌదరి సీఎం జగన్‌పై విమర్శలు చేయడం ఏమిటని వైఎస్సార్‌సీపీ మహిళా నేత కొత్తపల్లి రజనీ చౌదరి నిలదీశారు. అసమర్థ సంతానంతో చంద్రబాబు, రేణుకా చౌదరి అవస్థలు పడుతున్నారని చెప్పారు. రేణుకా చౌదరి కుమార్తె తల్లి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుందన్నారు. రేణుక చౌదరి ప్రస్థానం బాటిల్‌తో మొదలైతే ఆమె కుమార్తె డ్రగ్స్ దాక తీసుకెళ్లిందని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న విశాఖ గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందన్న కడుపుమంటతో చంద్రబాబు ఆడుతున్న చిల్లర నాటకంలో భాగంగా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. విశాఖ సదస్సు నుంచి ప్రజల దృష్టి పక్కదారి పట్టించేందుకే ఆమెను రంగంలోకి దించారన్నారు. ఆమె ఎక్కడ పోటీచేసినా ఓడించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. చంద్రబాబుకు ఉమెన్ వెర్షన్ రేణుకా చౌదరేనని చెప్పారు. నోరు అదుపులో పెట్టుకోకుంటే బడితపూజ ఖాయమని హెచ్చరించారు. రజనీ చౌదరి గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పిచ్చిపట్టినట్లుగా మాట్లాడుతున్న రేణుకకు ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్స చేయిస్తామన్నారు. రేణుకచౌదరి కాదు.. రాక్షస చౌదరి అని దుయ్యబట్టారు. నాడు రాజ్యసభలో ప్రధాని మోదీనే ఆ పేరు పెట్టారని గుర్తు చేశారు. దివంగత వైఎస్సార్ ఒంటి చేత్తో కాంగ్రెస్‌ను గెలిపించి ముఖ్యమంత్రి అయితే సీఎం జగన్ కూడా ఒంటి చేత్తో వైఎస్సార్‌సీపీని గెలిపించి అధికారంలోకి వచ్చారన్నారు.



తొండంగి సమీపంలో కెఎస్ఈజెడ్‌లో నిర్మాణంలో కాకినాడ గేట్‌వే పోర్టు

పారిశ్రామిక దిక్సూచి కాకినాడ సెజ్

పదేళ్ల తర్వాత కేఎస్ఈజెడ్‌లో తొలి అడుగులు

రూ.2,000 కోట్లతో ఫార్మా పెన్సిలిన్‌జీ యూనిట్

- ఈ ఏడాది చివరి నాటికి ఉత్పత్తి ప్రారంభించాలన్నది లక్ష్యం
- మేకిన్ ఇండియా తొలి ప్రాజెక్టు బల్క్‌డ్రగ్ పార్కు ఇక్కడే..
- ఇందుకు 2,000 ఎకరాలు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- దీనితో రూ.40 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా
- రూ.1,000 కోట్లతో కేంద్రం మౌలిక వసతులు
- చురుగ్గా రూ.2,500 కోట్లతో కాకినాడ గేట్ వే పోర్టు నిర్మాణం

సాక్షి ప్రతినిధి, కాకినాడ

రాష్ట్రంలో కాకినాడ స్పెషల్ ఎకనమిక్ జోన్ (కేఎస్ఈజెడ్) సరికొత్త ఆశలు రేపుతోంది. ఏర్పాటైన పదేళ్ల తరువాత ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు కార్పొరేట్ దిగ్గజాలు అడుగులు వేస్తున్నాయి. చంద్రబాబు హయాంలో భూముల బదలాయింపే తప్ప ఒక్కటంటే ఒక్కటి కూడా చెప్పుకోదగ్గ పరిశ్రమ ఇక్కడకు వచ్చిన దాఖలాల్లేవు. కానీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు మెచ్చి బహుళజాతి సంస్థలు ఒక్కొక్కటిగా కాకినాడ సెజ్‌లో పరిశ్రమలు ఏర్పాటుచేస్తున్నాయి. మరోవైపు.. శుక్రవారం నుంచి విశాఖ వేదికగా రెండ్రోజులపాటు జరగనున్న గ్లోబల్ ఇండస్ట్రియల్ సమ్మిట్‌తో బహుళజాతి సంస్థల దృష్టి కాకినాడ సెజ్‌పై పడుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. సహజ వనరులు సమృద్ధిగా ఉండి సముద్ర తీరానికి ఆనుకుని సుమారు ఏడువేల ఎకరాలు అన్ని అనుమతులతో సిద్ధంగా ఉండటం కలిసొచ్చే అంశమంటున్నారు.

ఇక చైనా దయ అక్కర్లేదు

ఏటా 15,000 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంట్ ఏర్పాటవుతోంది. రూ.2,000 కోట్ల వ్యయంతో దీనిని ఏర్పాటుచేస్తున్నారు. చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్న పలు కీలక ముడి ఔషధాలను దేశీయంగా ఉత్పత్తి చేయాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఉత్పత్తితో ముడిపడిన ప్రోత్సాహక పథకాన్ని (పీఎల్ఐఎస్) ప్రకటించింది. ఈ పథకం కింద తొలిదశలో దేశంలోనే ఎంపికైన ప్రాజెక్టుల్లో మొదటి ప్రాజెక్టు లీఫియస్ ఫార్మా పెన్సిలిన్ జీ ప్రాజెక్టు కాకినాడ సెజ్‌లో ఏర్పాటుకానుండటం విశేషం. ఇక్కడ దేశీయంగా ఉత్పత్తి అయ్యే ముడి ఔషధాలతో విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని కోల్పోవాల్సిన అవసరం ఉండదు. ముడి ఔషధాల కోసం చైనా కంపెనీల దయపై ఆధారపడే పరిస్థితి భారత్‌కు తప్పుతుంది. ప్రాణరక్షణ ఔషధాల తయారీలో కీలకమైన ముడి ఔషధంగా పెన్సిలిన్ జీ ఉపయోగపడుతుంది. మొక్కజొన్నను ముడిపదార్థంగా ఉపయోగించి ఈ పెన్సిలిన్ జీని తయారుచేస్తారు. స్వీయ అవసరాల కోసం సముద్ర నీటిని శుద్ధిచేసేందుకు ఇక్కడ భారీ డీసాలినేషన్ ప్లాంట్ ఏర్పాటుచేస్తున్నారు. సముద్ర నీటిని సేకరించి శుద్ధిచేసి ప్లాంటులో ఉపయోగించి శుద్ధిచేసిన తర్వాత ఉప్పునీటిని మళ్లీ సముద్రంలోకి విడిచిపెట్టేలా పైపులైన్లు నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా కనీసం 4,000 మందికి ఉపాధి లభించే అవకాశముంది.

ఈ సెజ్‌లోనే భారీ బల్క్‌డ్రగ్ పార్కు కూడా..

మరో భారీ ప్రాజెక్టు బల్క్‌డ్రగ్ పార్క్ కూడా ఇక్కడకు వస్తోంది. కేంద్ర ప్రభుత్వం 'మేకిన్ ఇండియా'లో భాగంగా దేశీయంగానే ఔషధాలు తయారుచేయాలనే విధానంలో ఈ ప్లాంట్ రూపుదిద్దుకుంటోంది. దిగుమతులు తగ్గించుకోవాలని తీసుకున్న నిర్ణయంలో భాగంగా దేశంలో మూడు బల్క్ డ్రగ్ పార్కులు ఏర్పాటుచేయాలని సంకల్పించగా ఈ సెజ్‌లో ఒకటి కేటాయించడం విశేషం. పలు రాష్ట్రాలు పోటీపడగా సీఎం వైఎస్ జగన్ చొరవతో కాకినాడ సెజ్‌లో ఈ పార్కు ఏర్పాటవుతోంది. ఈ సెజ్‌కు రోడ్డు, రైలు, పోర్టు కనెక్టివిటీ వంటి మౌలిక సదుపాయాలు ఉండటంతో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు అవకాశం ఏపీకి దక్కింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సెజ్‌లో 2వేల ఎకరాలు సమకూర్చింది. మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు వెచ్చిస్తోంది. ఈ పార్కు ఏర్పాటుతో రూ.40 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా. ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేల మందికి ఉపాధి కల్పించడమే కాకుండా రాష్ట్ర అభివృద్ధిలో ఈ పార్క్ కీలకపాత్ర పోషిస్తుంది.

అతిపెద్ద పెన్సిలిన్ జి ప్లాంట్ ఇక్కడే..

కాకినాడ సెజ్ పరిధిలోని తొండంగి మండలంలో అరబిందో ఫార్మా దేశంలోనే అతిపెద్ద పెన్సిలిన్ జి గ్రీన్‌ఫీల్డ్ ఇన్‌ఫ్రా ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 416 ఎకరాలను సెజ్‌లో కేటాయించింది. అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ లీఫియస్ ఫార్మా ఏర్పాటుచేస్తున్న పెన్సిలిన్‌జి ఉత్పత్తి కేంద్రం ఈ ఏడాది చివరికల్లా ప్రయోగాత్మకంగా ఉత్పత్తిని ప్రారంభించాలనే సంకల్పంతో ఉంది. వచ్చే ఏడాది ప్రారంభంలో వాణిజ్య ఉత్పత్తి మొదలయ్యే అవకాశముందని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ప్లాంట్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.



కాకినాడ సెజ్‌లో చురుగ్గా జరుగుతోన్న పెన్సిలిన్‌జీ ప్లాంట్ పనులు

రూ.2,500 కోట్లతో కాకినాడ గేట్‌వే పోర్టు

ఇదే సెజ్‌లో ఇప్పటికే రూ.2,500 కోట్ల అంచనా వ్యయంతో కాకినాడ గేట్‌వే పోర్టు లిమిటెడ్ (కేజీపీఎల్) నిర్మాణం మొదలైంది. ఇందుకోసం సెజ్‌లో 1,650 ఎకరాలు ప్రభుత్వం కేటాయించింది. డీప్ సీ పోర్టుగా 11 బెర్తుల సామర్థ్యంతో చురుగ్గా నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ పోర్టు పూర్తయితే ఏటా 16 మిలియన్ టన్నుల కార్గో నిర్వహణ జరుగుతుంది. 2.70 లక్షల టన్నుల బరువును మోయగల భారీ ఓడలు కూడా ఇక్కడ నిలుపుకునేలా ఈ పోర్టు నిర్మాణం జరుగుతోంది. ఇది పూర్వయ్యాక తూర్పు తీరంలో అత్యంత ఆధునిక కార్గో హబ్‌గా కేజీపీఎల్ ఆవిర్భవించనుంది. ఈ పోర్టు కోసం అన్నవరం నుంచి ప్రత్యేక రైల్వేలైన్ నిర్మాణానికి డీపీఆర్ కూడా సిద్ధమైంది. పోర్టు నిర్మాణం పూర్తయిన తరువాత ప్రత్యక్షంగా 3,000, పరోక్షంగా 5,000 మందికి ఉపాధి లభించనుంది. వీటన్నింటితో తూర్పు తీరంలో కాకినాడ ప్రాంతం పారిశ్రామికంగా ప్రధాన అభివృద్ధి కేంద్రంగా మారి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థనే మార్చే అవకాశముంది. చమురు, సహజ వాయువు నిల్వలతో కూడిన కేజీ బేసిన్.. భారీ పరిశ్రమలు, సముద్ర ఉత్పత్తులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్న ఈ ప్రాంతం కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలితో మరింత ప్రగతి సాధిస్తుందనడంలో ఎలాంటి సందేహంలేదు.

నాటు తుపాకీతో భార్యను హతమార్చిన భర్త

- మద్యానికి డబ్బులివ్వలేదనే కారణంతో..
- అల్లూరి జిల్లాలో ఘటన



విజయ మృతదేహం

గూడెంకొత్తవీధి (అల్లూరి సీతారామరాజు జిల్లా): మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదన్న కారణంతో కట్టుకున్న భర్తే నాటుతుపాకీతో భార్యను కడతేర్చిన ఘటన గూడెంకొత్తవీధి మండలం మొండిగెడ్డలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మొండిగెడ్డ పంచాయతీ కేంద్రానికి ఆనుకుని ఉన్న గాలిమానువీధి గ్రామానికి చెందిన గబులంగి రామచంద్రరావుకు 15 ఏళ్ల క్రితం ఒడిశా ప్రాంతానికి చెందిన విజయతో వివాహమైంది. రామచంద్రరావు కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. తరచూ మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి మద్యం సేవించిన రామచంద్రరావు, కాఫీ గింజలు విక్రయించగా వచ్చిన సొమ్ము తనకు ఇమ్మని భార్యపై ఒత్తిడి తెచ్చాడు. ఇలా భార్యతో అర్ధరాత్రి వరకు గొడవ పడ్డాడు. అక్కడి నుంచి ఆమె వరండాలోకి వెళ్లిపోయి రామచంద్రరావు తల్లి లింగమ్మ పక్కన పడుకుంది. దీంతో కోపోద్రిక్తుడైన రామచంద్రరావు అడవి జంతువుల వేటకు వినియోగించే నాటు తుపాకీతో భార్యపై ఎక్కుపెట్టి కాల్చేశాడు. ఒక్కసారిగా అర్ధరాత్రి తుపాకీ పేలిన శబ్దం రావడంతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఆందోళనకు గురైన చుట్టుపక్కల వారు వెంటనే ఇంటికి వచ్చారు. అప్పటికే తుపాకీ కాల్పుల్లో కుడి తొడపై తీవ్రంగా గాయపడి రక్తస్రావంతో విలవిల్లాడుతూ విజయ రక్తపు మడుగులో కనిపించింది. వెంటనే జర్రెల పీహెచ్‌సీ అంబులెన్సుకు సమాచారం అందించారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఆమెను ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందింది. నిందితుడు రామచంద్రరావు గురువారం ఉదయాన్నే స్థానిక పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. నాటుతుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్, గూడెంకొత్తవీధి ఎస్ఐ అప్పలసూరి ఘటన ప్రాంతానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. కాగా విజయ మృతితో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు.

అది ఈనాడు.. ఫాల్స్ బుక్‌లెట్

- మంత్రి అప్పలరాజు మండిపాటు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచవ్యాప్తంగా ఎదురుచూస్తున్న పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజమార్గం వేసిందన్నారు. విశాఖలో ప్రతిష్టాత్మక గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ నిర్వహిస్తున్న తరుణంలో ఇండస్ట్రీస్ ఫ్యాక్ట్ చెక్ పేరుతో ఈనాడు పత్రిక ఫాల్స్ బుక్‌లెట్ విడుదల చేసిందని మండిపడ్డారు. గురువారం ఆయన శ్రీకాకుళంలో విలేకరులతో మాట్లాడారు. అదానీ, అంబానీ, టాటా, బిర్లా, జిందాల్ లాంటి ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్న విషయాన్ని ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. చంద్రబాబు హయాంలోనే సత్యం రామలింగరాజు, కోనేరు ప్రసాద్, నిమ్మగడ్డ ప్రసాద్‌ను వేధించిన సంగతి ప్రజలందరికి తెలుసన్నారు. సెట్‌టాప్ బాక్స్‌ల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు టీడీపీ హయాంలో రిలయన్స్ కంపెనీకి 50 ఎకరాలు లిటిగెంట్ భూమిని ఇవ్వడంతో న్యాయ వివాదాల కారణంగా ప్రాజెక్టు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. లూలూ కంపెనీకి రూ.వేల కోట్ల విలువైన భూమిని అప్పగించిన చంద్రబాబు ఒక్క రూపాయి కూడా పెట్టుబడి సాధించలేకపోయారని చెప్పారు. అదానీ డేటా సెంటర్‌కి గతంలో పైసా కూడా ఇవ్వకుండా వదిలేస్తే వైఎస్సార్‌సీపీ హయాంలో 150 ఎకరాలు ఇచ్చామన్నారు. అమర్‌రాజా కంపెనీ రాష్ట్రంలో కార్యకలాపాలు కొనసాగిస్తూనే తెలంగాణలో మరో బ్రాంచ్ ఏర్పాటు చేసిందని, పూర్తిగా ఎత్తివేయలేదన్నారు. ఇన్ఫోసిస్, గ్రాండ్ లాంటి సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. టీడీపీ హయాంలో రూ.20 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని ప్రచారం చేస్తున్న వారు ఎక్కడ వచ్చాయో వివరాలు వెల్లడించాలన్నారు. ఇప్పుడు ఏపీలో 11.4 శాతం గ్రోత్ రేట్ ఉంటే టీడీపీ అనుకూల మీడియాలో ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. వృద్ధిలో దేశంలోనే 4వ ర్యాంక్‌లో ఉన్నామన్నారు. లాజిస్టిక్స్‌లో ఏపీలో ఫస్ట్ ర్యాంక్‌లో ఉందన్నారు. పరిశ్రమలకు రూ.3,675 కోట్ల విద్యుత్ బకాయిలను చంద్రబాబు ఎగ్గొట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ వచ్చాక విద్యుత్ ఇన్సెంటివ్ రూపంలో రూ.1,143 కోట్లు ఇచ్చామని తెలిపారు. పారిశ్రామికవేత్తలకు రాయితీల రూపంలో రూ.1,715 కోట్లు అందచేశామన్నారు. చంద్రబాబు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారిస్తే వాటిని తీరుస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టాక రాష్ట్రానికి 108 భారీ పరిశ్రమలు వచ్చాయని, ఎంఎస్ఎంఈల ద్వారా 10.3 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చి ఉంటే మరిన్ని పరిశ్రమలు వచ్చి ఉండేవన్నారు. చంద్రబాబు ప్యాకేజీకి అమ్ముడుపోయి రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. భావనపాడు పోర్టుకు శంకుస్థాపన మరో నాలుగు వారాల్లో జరుగుతుందని తెలిపారు. సమావేశంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి రమేష్‌బాబు, మైలపల్లి నర్సింహులు, లుకలాపు గోవిందరావు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న సైబరాసురులు

విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన వ్యాపారి ఫోన్‌కు ఫిబ్రవరి 15న ఓ మెసేజ్ వచ్చింది. కరెంటు బిల్లు పెండింగ్ ఉందని.. వెంటనే చెల్లించకపోతే ఆ రోజు రాత్రి 9 గంటలకు సరఫరా నిలిపివేస్తామనేది మెసేజ్ సారాంశం. విద్యుత్ శాఖ ఏఈ పేరుతో మెసేజ్ రావడంతో కంగారుపడిన సదరు వ్యాపారి మెసేజ్ అడుగున ఉన్న నంబర్‌కు కాల్ చేసి వారం క్రితమే బిల్లు కట్టేశామని చెప్పారు. యాప్‌లో నమోదు కాలేదని, వెంటనే నమోదు చేసుకోవాలని యాప్‌కు సంబంధించిన వెబ్ లింక్‌ను పంపించాడు. అవతలి వ్యక్తి మాటల్ని నిజమని సదరు వ్యాపారి నమ్మేశాడు. వాట్సాప్‌కు వచ్చిన వెబ్ లింక్‌ను టచ్ చేశాడు. ఎలాంటి వివరాలు రాకపోవడంతో వ్యాపారి ఆ మోసగాడితో అదే విషయం చెప్పాడు. ఆ లింక్ అప్పుడప్పుడు సరిగ్గా పని చేయదని.. మరో లింక్ పంపుతానని చెప్పాడు. ఫోన్‌కు వచ్చిన మరో లింక్‌ను వ్యాపారి టచ్ చేయడంతో వెంటనే నెట్ బ్యాంకింగ్ పోర్టల్ ఓపెన్ అయింది. అవతలి వ్యక్తి సూచన మేరకు రూ.10ని వ్యాపారి అవతలి వ్యక్తి బ్యాంక్ ఖాతాకు పంపి.. యాప్‌లో తన వివరాలు నమోదయ్యాయని ఊపిరి పీల్చుకున్నాడు. మరుసటి రోజు వ్యాపార లావాదేవీల నిమిత్తం బ్యాంకుకు వెళ్లగా.. తన ఖాతాలోని రూ.14 లక్షలు, క్రెడిట్ కార్డులో రూ. 2.50 లక్షలు మాయమైనట్టు తెలిసి లబోదిబోమంటూ సైబర్ పోలీసులను ఆశ్రయించాడు.



కరెంటు బిల్లు పెండింగ్ అనే మెసేజ్‌లతో వల

- బిల్లు వివరాలు అప్‌లోడ్ చేసుకోవాలంటూ మాయమాటలు
- స్క్రీన్ షేరింగ్ యాప్ లింకు పంపి డబ్బు కొట్టేస్తున్న సైబరాసురులు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ప్రజల ఏమరుపాటును ఆసరా చేసుకుని సైబర్ నేరగాళ్లు సాగిస్తున్న దోపిడీ పర్వంలో తాజాగా విద్యుత్ బిల్లుల పెండింగ్ అంశం చేరింది. గత ఏడాది చెదురుమదురుగా ఇలాంటి ఘటనలు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఆరంభం నుంచే సైబర్ నేరగాళ్లు పూర్తిగా ఇదే అంశంపై దృష్టి సారించినట్టు తాజాగా వస్తున్న ఫిర్యాదులు తేటతెల్లం చేస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో ఈ తరహా మోసాలు ఇటీవల కాలంలో అత్యధికంగా వెలుగు చూస్తున్నాయి. గడచిన 50 రోజుల్లో జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో ఈ తరహా మోసాలు 40 వరకు చోటుచేసుకోవడం.. బాధితులు రూ.75 లక్షల వరకు నగదు పోగొట్టుకోడం ఆందోళన కలిగిస్తోంది.

ఎలా చేస్తారంటే..

విద్యుత్ వినియోగదారుల ఫోన్ నంబర్లు, వారి సర్వీస్ నంబర్లను సైబర్ నేరగాళ్లు సేకరిస్తున్నారు. వాటిలో బడా వ్యాపారుల నంబర్లను ఎంచుకుని.. ఆయా నంబర్లకు బిల్లు పెండింగ్ ఉందని, చెల్లించకపోతే వెంటనే సరఫరా నిలిపివేస్తామని మెసేజ్ పంపుతున్నారు. ఆ మెసేజ్ కింద 'ఏఈ, విద్యుత్ శాఖ' పేరిట ఓ ఫోన్ నంబర్ ఉంటోంది. దీనిని చూసిన వెంటనే వినియోగదారులు ఆ నంబర్‌ను సంప్రదిస్తున్నారు. దీంతో సైబర్ నేరగాడు వినియోగదారులను ముగ్గులోకి దించుతున్నాడు. అప్పటికే బిల్లు చెల్లించామని చెబితే.. విద్యుత్ శాఖ యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని.. చెల్లించలేదని చెబితే యాప్‌లో వెంటనే చెల్లించాలని నమ్మబలుకుతున్నారు. యాప్‌కు సంబంధించిన వెబ్‌లింక్‌ను వాట్సాప్‌కు పంపుతారు. సదరు వెబ్‌లింక్ స్క్రీన్ షేరింగ్ యాప్స్ (టీం వ్యూవర్, ఎనీ డెస్క్, వైసుర్-అండ్రాయిడ్ కంట్రోల్ ఆన్ పీసీ, స్కైప్, ఎయిర్ ఆండ్రాయిడ్, లెట్స్‌వ్యూ, జూమ్)కు సంబంధించినవి కావడంతో ఆ లింక్ క్లిక్ చేయగానే యాప్స్ ఆటోమేటిక్‌గా డౌన్‌లోడ్, ఇన్‌స్టాల్ అయిపోతాయి. ఈ విషయం బాధితుడికి తెలియదు. ఆ తరువాత మళ్లీ ఓ లింక్ పంపుతారు. బాధితుడు ఏ బ్యాంక్ ఖాతాదారుడు అయితే.. అదే బ్యాంక్‌కు సంబంధించిన నెట్ బ్యాంకింగ్ వెబ్‌సైట్ లింక్‌ను పంపుతారు. ఆ నెట్ బ్యాంకింగ్ ద్వారా రూ.10 తన ఖాతాకు బదిలీ చేస్తే విద్యుత్ శాఖ బిల్లుల చెల్లింపునకు యాప్ డౌన్‌లోడ్ అవుతుందని నమ్మిస్తారు. అప్పటికే స్క్రీన్ షేరింగ్ యాప్ బాధితుడి ఫోన్‌లో నిక్షిప్తం కావడంతో నెట్ బ్యాంకింగ్‌లో వినియోగదారుడు రూ.10 పంపే దృశ్యాన్ని సైబర్ నేరగాడు పూర్తిగా డెస్క్‌టాప్‌పై చూస్తాడు. బ్యాంకు ఖాతా నంబర్, పాస్‌వర్డ్, క్రెడిట్‌కార్డ్ వివరాలు, క్రెడిట్ కార్డ్ వెనుక వైపున ఉండే గ్రిడ్ అంకెల వివరాలన్నీ సైబర్ నేరగాడు తెలుసుకుంటాడు. తద్వారా బాధితుడి అకౌంట్‌లోని నగదు మొత్తాన్ని కొల్లగొట్టేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండండి



సైబర్ నేరగాళ్లు ప్రత్యేకంగా తయారు చేసుకున్న ప్రోగ్రామింగ్ ద్వారా పలు రకాలైన మోసాలకు పాల్పడుతున్నారు. విద్యావంతులు, ఉన్నత ఉద్యోగులు, బడా వ్యాపారస్తులు.. అన్నీ తెలిసిన వారే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారు. అపరిచితుల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదు. ఆ మెసేజ్‌లలో ఇచ్చిన వెబ్‌లింక్‌లను టచ్ చేయకూడదు. ఇలాంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండాలి.

– టీకే రాణా, పోలీస్ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా

• తెలంగాణ

పోస్ట్ కోవిడ్‌తో యువతలో గుండెపోటు!

ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని వైద్య ఆరోగ్యశాఖ సూచనలు

- బీపీ, షుగర్ నిరంతరం చెక్ చేయించుకోవాలి
- కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి
- పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి
- జంక్, ఫాస్ట్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి
- రోజుకు 30 నిమిషాల నుంచి గంటపాటు వ్యాయామం చేయాలి
- తగినంత నిద్ర, ఒత్తిడి నియంత్రణ తప్పనిసరి అని స్పష్టీకరణ
- ప్రత్యేకంగా అడ్వైజరీని విడుదల చేసిన డీహెచ్ శ్రీనివాసరావు



సాక్షి, హైదరాబాద్: ఇటీవల యువత, మధ్య వయస్సు వారిలో గుండెపోటు సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. జిమ్ చేస్తూ కొందరు, సాధారణ పనుల్లో ఉంటూనే మరికొందరు గుండెపోటుతో కుప్పకూలిపోయి అకాల మరణాల పాలవుతున్నారు. కొందరిలో కోవిడ్ సోకి తగ్గిన తర్వాత (పోస్ట్ కోవిడ్) ఏర్పడుతున్న ఆరోగ్య సమస్యలు ఇలా గుండెపోటు మరణాలకు కారణం అవుతున్నాయని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. ఈ నేపథ్యంలో యువకుల్లో గుండెపోట్లను నివారించడానికి ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు గురువారం ఒక అడ్వైజరీ (సలహాలు, సూచనల నివేదిక)ను విడుదల చేశారు. కొందరు కోవిడ్ సోకి కోలుకున్నా కూడా.. వైరస్ ప్రభావం వల్ల ఎండోథెలియం (గుండె రక్త నాళాల్లోని లోపలి పొర)లో మార్పులు జరుగుతున్నాయని తెలిపారు. యువతీ యువకుల ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా దీన్ని వెంటనే గుర్తించలేకపోతారని.. దీనితో ఒక్కోసారి అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మరణాలు సంభవిస్తున్నాయని విశ్లేషించారు.

పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ విడుదల చేసిన అడ్వైజరీ ఇదీ..

- యువతీ యువకులు కూడా నిర్ణీత కాలంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. 18 ఏళ్లు దాటినవారు కనీసం రెండేళ్లకోసారి బీపీ పరీక్షలు చేయించుకోవాలి. 18–39 మధ్య వయసు వారు ఏడాదికోసారి, 40 ఏళ్లు దాటినవారు తరచూ బీపీ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి.
- 20 ఏళ్ల వయసు నుంచే రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలను చెక్ చేసుకుంటూ ఉండాలి. దీని వల్ల గుండె జబ్బుల సమస్యను ముందుగా గుర్తించవచ్చు. పెద్దలు కనీసం 4 నుంచి 6 నెలలకోసారి కొలెస్ట్రాల్ పరీక్ష చేయించుకోవాలి.
- గుండె జబ్బులకు ప్రధాన కారణాల్లో మధుమేహం (షుగర్) ఒకటి. కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా షుగర్ ఉంటే, ముందస్తుగానే షుగర్ పరీక్షలు చేయించుకోవడం మంచిది.
- గుండె ఆరోగ్యంగా ఉండాలంటే.. పండ్లు, బీన్స్, చిక్కుళ్లు వంటివి, చేపలు, తక్కువ కొవ్వు లేదా కొవ్వు రహిత పాల ఉత్పత్తులు, తృణధాన్యాలు, ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు కలిగిన పదార్థాలు తీసుకోవాలి.
- ఎక్కువ ఉప్పు, చక్కెర ఉండేవి, ప్రాసెస్ చేసిన కార్బోహైడ్రేట్ ఆహారాలు, ఆల్కహాల్, మాంసం, కొవ్వు, పాల ఉత్పత్తులు, వేయించిన ఫాస్ట్ ఫుడ్, చిప్స్, కాల్చిన ఆహారం వంటివాటికి దూరంగా ఉండాలి.
- రోజూ 30 నుంచి 60 నిమిషాల వరకు వ్యాయామం చేయాలి. వారానికి కనీసం 150 నిమిషాలు మితమైన ఏరోబిక్ వ్యాయామం చేయాలి. లేదా వారానికి 75 నిమిషాలు రన్నింగ్ వంటి శ్రమతోకూడిన ఏరోబిక్ వ్యాయామాలు చేయాలి.
- ఎత్తుకు తగ్గ శారీరక బరువు ఉండేలా చూసుకోవాలి. 3 నుండి 5 శాతం వరకు బరువు తగ్గడం వల్ల రక్తంలో కొన్ని కొవ్వులు, రక్తంలో చక్కెర (గ్లూకోజ్) తగ్గడం, టైప్–2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడానికి తోడ్పడుతుంది.
- ఏ వయసు వారైనా కంటి నిండా నిద్రపోవాలి. పెద్దలకు రాత్రిపూట కనీసం ఏడు గంటల నిద్ర అవసరం. రోజూ ఒకే సమయాల్లో పడుకోవడం, మేల్కోవడం చేయాలి. పడకగది చీకటిగా, నిశ్శబ్దంగా ఉండేలా చూసుకోవాలి. తద్వారా తగినంత నిద్రపోవడం సాధ్యమవుతుంది.
- మానసిక ఒత్తిడిని నియంత్రణలో ఉంచుకోవాలి. శారీరక శ్రమ, ధ్యానం వంటివి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.
- ధూమపానం, పొగాకు వాడకాన్ని నిలిపివేయాలి. ఈ అలవాటు ఇప్పటికిప్పుడు మానేసినా గుండె జబ్బు ప్రమాదం సగం తగ్గుతుంది.

న్యూస్‌మేకర్స్

మహిళా ఎం.ఎల్.ఏలు చరిత్ర సృష్టించారు





నాగాలాండ్ ఏర్పడి 60 ఏళ్లు. 60 సీట్లు ఉన్న అసెంబ్లీలో ఇప్పటి వరకూ ఒక్క మహిళ కూడా అడుగుపెట్టలేదు. ఇప్పుడు ఆ ఘనతను ఇద్దరు ఎం.ఎల్.ఏలు దక్కించుకొని చరిత్ర సృష్టించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హెకాని జకాలు, సల్‌హౌటనో క్రుసె విజయం సాధించారు. గురువారం ఓట్ల లెక్కింపు జరగగా డిమాపూర్-3 నుంచి హెకాని, పశ్చిమ అంగమె నుంచి క్రుసె విజయం సాధించారు. అక్కడి పాలనాధికారంలో స్త్రీల ప్రాతినిధ్యం మొదలైంది. ఇది ఆగదు.

మహిళలను 'ఆకాశంలో సగం' అంటాం. వారికి అవకాశాలలో సగం దక్కాలన్న ఉద్యమాలు బయలుదేరి చాలా కాలం అయ్యింది. కాని ఇంకా కొన్నిచోట్ల వారికి అవాంతరాలు ఎదురవుతూనే ఉన్నాయి. పురుష భావజాలం స్త్రీలలో కూడా నాటుకుపోయి స్త్రీకి స్త్రీయే ప్రతికూలత సృష్టించేవరకూ వెళుతోంది. ఉదాహరణకు నాగాలాండ్‌లో పాలనాధికారంలో స్త్రీలు ఉండటాన్ని మొదటినుంచీ వ్యతిరేకించారు. అక్కడి మొత్తం ఓటర్లు 13 లక్షలు ఉంటే వారిలో దాదాపు ఆరున్నర లక్షల ఓటర్లు మహిళలే అయినా వారు ఒక్క మహిళనూ గెలిపించుకోలేదు. దానికి కారణం అక్కడ ఇంటి పెద్ద, సమూహం పెద్ద, ఊరి పెద్ద ఎవరికి ఓటెయ్యమంటే స్త్రీలు వారికే ఓటు వేయాలి. పురుషులే సంపాదనపరులు కనుక పురుషుల మాట వినాలని స్త్రీలు అనుకుంటారు. పురుషులు సహజంగానే స్త్రీల ప్రాతినిధ్యాన్ని అంగీకరించరు. కనుక 1963లో నాగాలాండ్ ఏర్పడితే... 13 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే కేవలం 20 మందికే సీట్లు దక్కాయి. కాని ఎవరూ గెలవలేదు. డిపాజిట్లు కూడా రాలేదు. 2018లో 5 మంది స్త్రీలు పోటీ చేస్తే వారిలో ఎవరూ గెలువలేదు. కాని ఈ ధోరణిలో ఇప్పుడు మార్పు వచ్చిందనే సంకేతాలు అందుతున్నాయి. 2023 ఎన్నికలలో మొత్తం 183 మంది అన్ని పార్టీల నుంచి బరిలో దిగగా వీరిలో నలుగురు స్త్రీలు ఉన్నారు. ఈ నలుగురిలో నేషనల్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్.డి.పి.పి) నుంచి ఇద్దరు మహిళలు హెకాని, క్రుసె గెలిచారు. బి.జె.పితో కలిసి ఎన్.డి.పి.పి అక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. అందువల్ల ఈ ఇరువురిలో ఎవరైనా మంత్రి అయితే అదీ మరో చరిత్ర కాగలదు.

ఏడు ఓట్లతో గెలిచిన క్రుసె

నాగాలాండ్‌లోని పశ్చిమ అంగమి నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు ఉత్కంఠ భరితంగా సాగింది. చివరకు ఎన్.డి.పి.పి అభ్యర్థి, 56 సల్‌హౌటనో క్రుసె ఏడంటే ఏడే ఓట్లతో విజయం సాధించింది. పశ్చిమ అంగమెలో ఆమెకు ప్రత్యర్థిగా నిలిచిన నక్రో గతంలో నాగా పీపుల్స్ పార్టీలో ఉండేవాడు. ఆ తర్వాత ఎన్.డి.పి.పికి జంప్ చేశాడు. కాని ఈ ఎన్నికల్లో ఎన్.డి.పి.పి టికెట్ ఇవ్వకపోయేసరికి ఇండిపెండెంట్‌గా రంగంలో దిగాడు. అతణ్ణి ఓడించడానికి క్రుసె సర్వశక్తులు ఒడ్డి పోరాడాల్సి వచ్చింది. హోటల్స్ రంగంలో ఉన్న క్రుసె నాగాలాండ్‌లోని సామాజిక సంస్థలకు కలిసి పని చేస్తోంది. తన గిరిజన తెగ మహిళా విభాగానికి నాయకురాలిగా కూడా ఉంది. ఈమె గెలుపుతో అంగమిలో భారీ వేడుకలు మొదలయ్యాయి. జనం బారులు తీరి అభినందనలు తెలుపుతున్నారు.

మొదటి విజేత హెకాని

నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికలకు గురువారం జరిగిన ఫలితాల లెక్కింపులో ఆ రాష్ట్రంలో గెలిచిన మొదటి మహిళా ఎం.ఎల్.ఏగా ఎన్.డి.పి.పి అభ్యర్థి హెకాని జకాలు (47) మొదట డిక్లేర్ అయ్యింది. ఆ తర్వాతే రెండో మహిళా అభ్యర్థి క్రుసె గెలుపు ప్రకటితమైంది. అందువల్ల హెకాని విజయం విశేషంగా మారింది. డిమాపూర్-3 నియోజకవర్గంలో సిట్టింగ్ ఎం.ఎల్.ఏ జిమోమిని 1536 ఓట్లతో ఓడించింది హెకాని. అయితే ఈమెకు ఈ గెలుపు ఊరికే రాలేదు. సుదీర్ఘ కృషి ఉంది. డిమాపూర్‌లో పుట్టి పెరిగిన హెకాని ఢిల్లీలో చదువుకుంది. ఆ తర్వాత అమెరికాలో శాన్‌ఫ్రాన్సిస్కోలో లా చదివింది. నాగాలాండ్‌లో 'యూత్‌నెట్ నాగాలాండ్' అనే ఎన్.జి.ఓను స్థాపించి యువతీ యువకుల చదువుకు, ఉపాధికి మార్గం చూపింది.

'మేడ్ ఇన్ నాగాలాండ్' పేరుతో వస్తు ఉత్పత్తి, ఆవిష్కరణల కోసం కోహిమాలో ఒక సెంటర్ నడుపుతోందామె. అందుకే ఆమెకు నారీశక్తి పురస్కారం లభించింది. ఈ ఎన్నికలలో ఆమె తన విజయం కోసం గట్టిగా పోరాడింది. స్త్రీల విద్య, ఉపాధికి హామీలు ఇచ్చింది. ఆమె కోసం అస్సాం ముఖ్యమంత్రి బిశ్వ శర్మ ప్రచారం చేశాడు.

బ్యూటిప్స్

సహజ సిద్ధమైన యూత్ ప్యాక్స్

పార్టీలు, వేడుకలకు వెళ్లాలనుకొన్నప్పుడు ముఖానికి తక్షణ నిగారింపు రావడం కోసం రకరకాల ఫేస్ ప్యాక్‌లు ఉపయోగిస్తుంటారు. అయితే ఒక్కోసారి అవి అందుబాటులో ఉండవు. ఉన్నా, చర్మానికి పడవు. అలాంటప్పుడు... సహజసిద్ధమైన ఈ ఫేస్ ప్యాక్స్ ప్రయత్నించండి. ఇవి మీ చర్మానికి తగిన పోషణను ఇవ్వడంతో పాటు యవ్వన కాంతినిస్తాయి.

చందనం, రోజ్ వాటర్

చందనం ముఖం పై ఉన్న మృతకణాలను తొలగించి చర్మం మెరిసిపోయేలా చేస్తుంది. రోజ్‌వాటర్ చర్మానికి మెరుపునందిస్తుంది. వేసవిలో ఈ ప్యాక్ వేసుకోవడం ద్వారా సూర్యరశ్మి ప్రభావానికి గురైన చర్మానికి ఉపశమనం దొరుకుతుంది. ఇందుకోసం... ● గంధపు చెక్కను రోజ్ వాటర్‌తో అరగదీసి.. ముఖానికి ఫేస్ ప్యాక్‌లా వేసుకోవాలి. ఆరిన తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకొంటే సరిపోతుంది. మీ దగ్గర గంధపు చెక్క లేకపోతే.. దానికి బదులుగా గంధపు పొడిని ఉపయోగించవచ్చు. గంధం పొడిలో సరిపడినంత రోజ్ వాటర్ కలిపి ముఖానికి మాస్క్‌లా వేసుకొంటే సరిపోతుంది.

ఓట్ మీల్‌తో...



ఓట్‌మీల్ సహజసిద్ధమైన స్క్రబ్‌లా పనిచేస్తుంది. దీనిలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్ గుణాలు, ఇతర పోషకాలు చర్మానికి మెరుపునిస్తాయి. ఓట్ మీల్ సహజసిద్ధమైన క్లెన్సర్‌గా పనిచేసి చర్మాన్ని శుభ్రపరుస్తుంది. రెండు టేబుల్‌స్పూన్ల ఓట్ మీల్‌లో టీస్పూన్ చందనం పొడి వేసి సరిపడినంత రోజ్ వాటర్ కలిపి పేస్టులా తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి పావుగంట ఆరనివ్వాలి. ఆ తర్వాత కొన్ని నీళ్లు చల్లుకుంటూ మసాజ్ చేసుకొంటున్నట్టుగా ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మంపై ఉన్న మృత కణాలు తొలగిపోతాయి.

వసంతాలు విరిసేవేళ

ఫ్యాషన్









పూర్తి వైట్ ఇష్టపడని వారు క్రీమ్ కలర్, ఇతర కాంబినేషన్ కలర్స్‌తో ఉన్న డ్రెస్సులనూ ఎంపిక చేసుకోవచ్చు. ఇండో-వెస్ట్రన్ స్టైల్ డ్రెస్సులు అన్ని పార్టీలలోనూ ప్రత్యేకంగా ఉంటాయి.

**వసంతం విచ్చేసిందని
ప్రకృతి మనకు పంపించే
తొలి కబురు రంగుల వేడుకైన హోలి.
రాబోయే వేసవిని తట్టుకోవడానికి
మన మేనిని హాయిగొలిపేలా ఉంచడానికి
స్వచ్ఛమైన తెలుపును పరిచయం చేసేది హోలి.
ఎందుకంటే రంగుల హంగులను
అందంగా ఇముడ్చుకునేది తెలుపే!
ఇంద్రధనుస్సు ఎలాగూ వేసుకున్న దుస్తులను
అందంగా పలకరిస్తుంది
పువ్వుల నవ్వుల్ని, పచ్చదనాన్నీ అద్దుతుంది.
ఆ హంగులను అద్దుకున్న తెలుపు
మన జీవితాలను ఆనందమయం చేస్తుంది.
అందుకే, వసంతాలు విరిసేవేళా
నిన్ను నేను చూశాను...అంటూ
తెలుపు రంగు డ్రెస్‌ల ఎంపికకు
మొదటి ఓటు వేయవచ్చు.**



తెలుపుతోపాటు క్రీమ్ కలర్ థీమ్ ఉన్న డ్రెస్సులు ఎంతో అందాన్నీ, హాయినీ ఇస్తాయి. వీటిలో కాటన్, లినెన్, చికన్ కారీ వర్క్, ఇతర ఎంబ్రాయిడరీ లేదా చిన్న చిన్న పెయింటింగ్స్ ఉన్న డ్రెస్సులను ఎంపిక చేసుకోవచ్చు.

స్వీట్ హోలీ

వంటిల్లు

రంగుల పండుగ వస్తోంది. రంగరంగ వైభవంగా వస్తోంది. తీపి జ్ఞాపకాలను తెస్తోంది. రుచులకు ఆహ్వానం పలుకుతోంది. ఈ ఏటి హోలీ ఇచ్చిన తీపి రుచిని... రాబోయే హోలీ వరకు మర్చిపోదు మది.

రసగుల్లా



కావలసినవి: పాలు – లీటరు (వెన్న తీయనివి) ; నిమ్మరసం– 3 టేబుల్ స్పూన్‌లు ; చక్కెర – 2 కప్పులు ; నీరు – లీటరు ; పాలు – టేబుల్ స్పూన్ ; ఉప్మారవ్వ– టీ స్పూన్. పిస్తాపలుకులు : 20

తయారీ: ● పాలను మందపాటి పాత్రలో పోసి స్టవ్ మీద పెట్టాలి. బాగా మరిగిన తర్వాత మంట తగ్గించి నిమ్మరసం వేసి కలపాలి. ముందు సగం నిమ్మరసం వేసి కలిపి చూసి, పాలు బాగా విరిగితే మిగిలిన రసాన్ని ఆపేయాలి. పాలు సరిగ్గా విరగకపోతే మొత్తం రసాన్ని వేసి కలపాలి (పాశ్చరైజేషన్ జరగని పాలకు ఒక స్పూన్ నిమ్మరసం సరిపోతుంది). విరిగిన పాలను పలుచని వస్త్రంలో పోసి మూట కట్టి ఏదైనా కొక్కేనికి వేలాడదీయాలి. ఓ అర గంట తర్వాత నీరు పోయేలా చేత్తో గట్టిగా నొక్కాలి. ఆ తర్వాత పైన బరువు పెట్టాలి. ఇలా చేయడం వల్ల నీరంతా కారిపోతుంది. పాల విరుగు మాత్రం మూటలో మిగులుతుంది. ● పాలవిరుగులో రవ్వ వేసి వేళ్లతో నలుపుతూ కలపాలి. ఇలా చేస్తూ ఉంటే ముందుగా పాల విరుగు పొడిగా మారుతుంది. మరికొంత సేపటికి ముద్దగా అవుతుంది. ఇప్పుడు ఆ ముద్దను చిన్న చిన్న గోళీలుగా చేయాలి. ● వెడల్పుగా, లోతుగా ఉన్న కడాయిలో చక్కెర, నీరు పోసి వేడి చేయాలి. చక్కెర కరిగిన తరవాత అందులో టేబుల్ స్పూన్ పాలు వేయాలి. రెండు నిమిషాలకు చక్కెర ద్రవం శుభ్ర పడి అందులోని మలినాలు నల్లగా పైకి తేలుతాయి. స్పూన్‌తో కానీ చిల్లుల గరిటెతో తీసేయాలి లేదా పలుచని వస్త్రంలో వడపోయడం మంచిది. వడపోసిన ద్రవాన్ని మళ్లీ కడాయిలో పోసి మరిగించాలి. ● ఇప్పుడు చక్కెర ద్రవంలో పాల విరుగుతో చేసిన గోళీలను వేసి నాలుగైదు నిమిషాల సేపు మీడియం మంట మీద ఉడికించాలి (పెద్ద మంట మీద ఉడికిస్తే రసగుల్లాలు విరిగిపోతాయి). చిన్న గోళీలుగా వేసిన రసగుల్లాలు చక్కెర పాకాన్ని పీల్చుకుని పెద్దవవుతాయి. అప్పుడు స్టవ్ ఆపేయాలి. వేడి తగ్గిన తరవాత కప్పులో రసగుల్లాతోపాటు ఒక టేబుల్ స్పూన్ సిరప్, పిస్తా వేసి సర్వ్ చేయాలి. **గమనిక:** రసగుల్లాలకు చేసే చక్కెర ద్రవం పలుచగా ఉండాలి. పాకం రాకూడదు.


ఫిర్నీ



కావలసినవి: బియ్యం – పావు కప్పు ; వెన్న తీయని పాలు – లీటరు ; చక్కెర – అర కప్పు ; బాదం పప్పు – 10 ; పిస్తా – 10 ; యాలకుల పొడి – అర టీ స్పూన్ ; కుంకుమ పువ్వు – 15 రేకలు ; పన్నీరు – 2 టీ స్పూన్‌లు (ఇష్టమైతేనే), కిస్‌మిస్: 20 జీడిపప్పు: 10.

తయారీ: ● బియ్యం కడిగి ఒకసారి బట్ట మీద వేసి నీడలో ఆరబెట్టి, తేమ పోయిన తర్వాత మిక్సీలో గ్రైండ్ చేయాలి (మరీ మెత్తగా అక్కరలేదు). ● ఈ లోపు ఒక చిన్న పాత్రలో నీటిని వేడి చేసి అందులో బాదం, పిస్తా వేసి మూత పెట్టాలి. అరగంట తర్వాత నీటిని వడపోసి పొట్టు వలిచి, సన్నగా తరగాలి. ● వెడల్పుగా, మందంగా ఉన్న పాత్రలో పాలు మరిగించాలి. ఒక పొంగు వచ్చిన తర్వాత ఒక గరిటెడు పాలను చిన్న పాత్రలోకి తీసుకుని కుంకుమ పువ్వు రేకలు వేసి నానబెట్టాలి. పాత్రలో పాలను మరో రెండు నిమిషాల సేపు మరిగించిన తర్వాత మంట తగ్గించి బియ్యప్పిండి, చక్కెర వేసి అడుగు పట్టకుండా, ఉండకట్టకుండా గరిటెతో కలుపుతూ ఉడికించాలి. చిక్కబడుతున్నప్పుడు యాలకుల పొడి వేయాలి. మిశ్రమం చిక్కబడిన తర్వాత కుంకుమపువ్వు కలిపిన పాలు, బాదం, పిస్తా సగం వేసి కలపాలి. ఇవన్నీ వేసిన తర్వాత మరో రెండు లేదా మూడు నిమిషాల సేపు మరగనిచ్చి పన్నీరు వేసి కలిపి స్టవ్ ఆపేయాలి. ఫిర్నీ రెడీ. ఈ ఫిర్నీని కప్పులో పోసిన తర్వాత మిగిలిన బాదం, పిస్తా, జీడిపప్పు, కిస్‌మిస్‌తో అలంకరించాలి. ఈ ఫిర్నీని గోరువెచ్చగా తినవచ్చు లేదా చల్లబరిచి తినవచ్చు. ఫ్రిజ్‌లో రెండు– మూడు రోజులు తాజాగా ఉంటుంది.

రైస్ ఖీర్



కావలసినవి: బియ్యం– కప్పు ; పాలు – ఒకటిన్నర లీటరు (వెన్న తీయనివి) ; చక్కెర – కప్పు ; యాలకుల పొడి– టీ స్పూన్ ; కుంకుమ పువ్వు– చిటికెడు లేదా 15 రేకలు ; బాదం – టేబుల్ స్పూన్ ; జీడిపప్పు – టేబుల్ స్పూన్ ; పిస్తా – టేబుల్ స్పూన్ ; కిస్‌మిస్ – టేబుల్ స్పూన్.

తయారీ: ● బియ్యం కడిగి 15 నిమిషాల సేపు నానబెట్టాలి. ● చిన్న పాత్రలో నీటిని వేడి చేసి బాదం, పిస్తా వేసి మూతపెట్టాలి. అర గంట తర్వాత పొట్టు తీసి సన్నగా తరగాలి. కిస్‌మిస్‌ని కడిగి పక్కన పెట్టుకోవాలి. ● బియ్యం నానిన తర్వాత స్టవ్ మీద వెడల్పు పాత్ర పెట్టి పాలు పోసి మరిగించాలి. ఒక గరిటెడు పాలు విడిగా తీసుకుని కుంకుమ పువ్వు రేకలను నానబెట్టాలి. ● బియ్యంలోని నీటిని వంపేసి బియ్యాన్ని మరుగుతున్న పాలలో వేసి ఉడికించాలి. బియ్యం ఒక మోస్తరుగా ఉడికిన తర్వాత చక్కెర వేసి కలిపి సన్నమంట మీద ఉడికించాలి. ● అన్నం ఉడికిందని నిర్ధారించుకున్న తర్వాత యాలకుల పొడి, బాదం, పిస్తా తరుగు, కిస్‌మిస్, కుంకుమ పువ్వు కలిపిన పాలు పోసి బాగా కలిపి మూత పెట్టి స్టవ్ ఆపేయాలి. రైస్ ఖీర్ రెడీ. ఖీర్ దగ్గరయ్యే వరకు ఉడికించాల్సిన అవసరం లేదు. స్టవ్ ఆపేసిన తర్వాత చల్లారే కొద్దీ దగ్గరవుతుంది.

రసమలై



కావలసినవి: రసగుల్లాలు – 15 (ఇంట్లో చేయడం కుదరకపోతే రెడీమేడ్‌వి తీసుకోవచ్చు) ; పాలు – లీటరు ; చక్కెర – 5 టేబుల్ స్పూన్‌లు ; బాదం –10 ; పిస్తా– 10 ; యాలకుల పొడి– టీ స్పూన్ ; కుంకుమ పువ్వు – 20 రేకలు. **తయారీ:** ● అరకప్పు వేడి నీటిలో బాదం, పిస్తాలను అరగంట సేపు నానబెట్టి పొట్టు తీసి తరగాలి. ● పావు కప్పు వేడి పాలలో కుంకుమ పువ్వు వేసి పక్కన ఉంచాలి. ● మందపాటి బాణలిలో పాలు మరిగించాలి. పైకి తేలిన మీగడను స్పూన్‌తో తీసి ఒక గిన్నెలో వేసుకుంటూ పాలు అడుగు పట్టకుండా కలుపుతూ, పాలు సగమయ్యే వరకు మరిగించాలి. ఇప్పుడు చక్కెర వేసి కరిగే వరకు కలుపుతూ మరిగించాలి. యాలకుల పొడి, బాదం, పిస్తా (సగం), కుంకుమ పువ్వు పాలు కలిపి వీటి రుచి పాలకు పట్టే వరకు సన్నమంట మీద మరిగించాలి. ● ఇప్పుడు రసగుల్లాను ఒక ప్లేట్‌లోకి తీసుకుని గరిటె లేదా అట్లకాడ సాయంతో లేదా వేళ్లతో చక్కెర పాకం జారిపోయేటట్లు మెల్లగా నొక్కాలి. ఇలా రసగుల్లాలన్నింటినీ నొక్కి జాగ్రత్తగా పాలలో వేయాలి. రెండు నిమిషాలపాటు పాలలో ఉడకనిచ్చి స్టవ్ ఆపేయాలి. ● రసమలై చల్లారిన తర్వాత కప్పులో వేసి మీగడ(ఇష్టమైతే), బాదం, పిస్తాలతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి.

యువర్స్

● సక్సెస్ స్టోరీ



'కాలం కలిసి రావాలి' అంటూ కాలాన్ని మాత్రమే నమ్ముకునే వారు ఒక రకం.
'కాలం కలిసి రావాలి అంటే కష్ట పడాలి' అనుకునే వారు రెండో రకం.
'రైతుబిడ్డ' విక్రమ్‌సింగ్ రెండో రకానికి చెందిన కుర్రాడు.
తన నాయకత్వ లక్షణాలతో 'ఆఫ్‌బిజినెస్'కు కొత్త వెలుగు తీసుకువచ్చాడు...

RAW రా రాజు

హరియాణా మహేంద్రగఢ్ జిల్లాలోని మట్రా గ్రామంలో రైతు కుటుంబానికి చెందిన విక్రమ్‌సింగ్ ఖరీదైన స్కూళ్లలో ఎప్పుడూ చదువుకోలేదు. ఆరవతరగతిలో మాత్రమే ఇంగ్లీష్ చదువుకునే అవకాశం వచ్చింది. స్కూల్ పూర్తయిన తరువాత పొలానికి వెళ్లి తండ్రికి సహాయం చేసేవాడు.

'ఏ పనైనా ఇష్టంగా చేయాలి. నాకు వ్యవసాయం అంటే ఇష్టం. నువ్వు కూడా చదువును ఇష్టంగా చదువుకోవాలి. చదువుకోవడం నా వల్ల కాదు అనిపిస్తే నాతో పాటు పనిచెయ్యి' అనే వాడు నాన్న.

మరోవైపు స్నేహితులు...'నువ్వు రెజ్లర్ కాకపోతే జీవితంలో ఏది సాధించలేవు' అనేవారు. ఆ ప్రాంతంలో రెజ్లింగ్ బాగా పాపులర్. ప్రైజ్‌మనీ కూడా భారీగా ఉండేది. స్నేహితుల మాటలతో రెజ్లర్ కావాలనే ఆశ విక్రమ్‌లో మొలకెత్తింది. ఎక్కడ రెజ్లింగ్ పోటీలు జరిగినా వెళ్లేవాడు. ఇది గమనించిన టీచర్ 'నువ్వు చదువులో ముందున్నావు. నీకు మంచి భవిష్యత్ ఉంది. ఇలా రెజ్లింగ్ అంటూ ఊళ్లు తిరిగితే చదువు దెబ్బతింటుంది' అని హెచ్చరించాడు.

ఇక అప్పటి నుంచి తన మనసులో నుంచి 'రెజ్లింగ్'ను డిలిట్ చేశాడు విక్రమ్.

ఇంజినీరింగ్ పూర్తి చేసిన తరువాత ఢిల్లీలో ఎంబీఏ చేశాడు. ఆ తరువాత కామర్స్ అండ్ ఫిన్‌టెక్ స్టార్టప్ 'ఆఫ్‌బిజినెస్'లో చేరాడు.

మూడు సంవత్సరాల తరువాత విక్రమ్ దశ తిరిగింది. 'ఆఫ్‌బిజినెస్'కు ఉన్న మూడు యూనిట్‌లలో ఒకటైన 'రా మెటీరియల్ బిజినెస్ యూనిట్'కు నాయకత్వ బాధ్యతలు అప్పగించడానికి సరియైన వ్యక్తుల కోసం కంపెనీ పెద్దలు చూస్తున్న సమయంలో వారికి విక్రమ్ పేరు తట్టింది. అలా విక్రమ్ 'రా మెటీరియల్ బిజినెస్ యూనిట్'కు హెడ్ అయ్యాడు.

'రా మెటీరియల్స్ ఎట్ లోయెస్ట్ ప్రైసెస్-గ్యారెంటీడ్' అనే మాటలో మాంత్రికశక్తి లేకపోవచ్చు. అయితే దీన్ని కస్టమర్‌లలోకి బలంగా తీసుకెళ్లడంలో విక్రమ్ విజయం సాధించాడు.

ఫ్రెషర్స్‌తో తనదైన ఒక టీమ్‌ను ఏర్పాటు చేసుకోని, అడుగులో అడుగు వేస్తూ మెల్లగా నడుస్తున్న యూనిట్‌ను పరుగెత్తేలా చేశాడు. కోట్ల టర్నోవర్‌కు చేర్చాడు.

'విక్రమ్‌లో నాయకత్వ లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. మా నమ్మకాన్ని నిలబెట్టాడు' అంటున్నాడు 'ఆఫ్‌బిజినెస్' సీయీవో ఆశీష్ మహాపాత్రో.

'అదృష్టం కష్టం వైపు మొగ్గు చూపుతుంది అంటారు. నేను కష్టాన్నే నమ్ముకున్నాను. రైట్ ప్లేస్‌లో రైట్‌పర్సన్‌గా గుర్తింపు తెచ్చుకున్నప్పుడే విజయం సాధించగలం' అంటున్న 29 సంవత్సరాల విక్రమ్ సింగ్ 'ఫోర్బ్స్ ఇండియా 30 అండర్ 30' జాబితాలో చోటు సంపాదించాడు.

● టెక్.. టాక్



యూట్యూబ్ మ్యూజిక్‌లో పాడ్‌కాస్ట్

యూట్యూబ్ మ్యూజిక్ త్వరలో తమ ఆడియో అండ్ వీడియో కంటెంట్ లైబ్రరీలో పాడ్‌కాస్ట్‌ను చేర్చనుంది. దీనితో పాటు పాడ్‌కాస్ట్ క్రియేషన్ టూల్స్‌ను కూడా యూట్యూబ్ స్టూడియోకు తీసుకురానుంది. పాడ్‌కాస్ట్ వినాలన్నా, వీడియో ఫార్మట్‌లో చూడాలన్నా వీలవుతుంది. యూజర్లు తమ సొంత రేడియో స్టేషన్‌లను క్రియేట్ చేసుకునే ఫీచర్‌ను 'యూట్యూబ్ మ్యూజిక్' తీసుకువచ్చింది. 30 మంది ఆర్టిస్ట్‌లకు సంబంధించిన పాటలతో యూజర్‌లు సొంత రేడియో క్రియేట్ చేసుకోవచ్చు. దీనిలో 'డిస్కవరీస్' 'చిల్ సాంగ్స్' ఫిల్టర్‌లను ఉపయోగించుకోవచ్చు.



మోటోరోలా ఎడ్జ్ 30 ఫ్యూజన్

డిస్‌ప్లే: 6.55 అంగుళాలు బ్యాటరీ: 4400 ఎంఏహెచ్
బరువు: 168 గ్రా. రిజల్యూషన్: 1080X2400 పిక్సెల్స్
ర్యామ్: 8జీబి , ఇంటర్నల్ స్టోరేజ్: 128జీబి
వోఎస్: ఆండ్రాయిడ్ 12 రిఫ్రెష్‌రేట్: 144 హెచ్‌జడ్
● ట్రిపుల్ కెమెరా సెటప్, కలర్స్: బ్లూ, సోలార్ గోల్డ్, అరోర వైట్





షావోమి వాచ్ ఎస్1 ప్రో

సైజ్: 1.47 అంగుళాలు (480X480 పిక్సెల్స్)
● హార్ట్‌రేట్ సెన్సర్ ● స్లీప్ ట్రాకింగ్
● సపోర్ట్: 100 ప్లస్ ఫిట్‌నెస్ మోడ్స్
● వాటర్ రెసిస్టెంట్ ● సపోర్ట్ వైర్‌లెస్ ఛార్జింగ్
● బ్యాటరీ లైఫ్: 14 రోజులు
● బ్లూటూత్ 5.2 స్పీకర్ అండ్ మైక్రోఫోన్

● యంగ్ టాలెంట్



వర్షిత

థాయ్‌లాండ్‌లో పుట్టిన వర్షిత పదమూడేళ్ల వయసులో తల్లిదండ్రులతో ఇండియాకు వచ్చింది. సంగీతం అంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. చెన్నైలోని 'కేఎం మ్యూజిక్ కన్జర్వేటరీ'లో మ్యూజిక్ కోర్సు చేసింది. 'స్వర్ణభూమి అకాడమీ ఆఫ్ మ్యూజిక్' నిర్వహించిన వర్క్‌షాప్‌కు హాజరైన తరువాత జాజ్ మ్యూజిక్‌పై ఆసక్తి మొదలైంది.

వర్షిత ఫస్ట్ సింగిల్ 'స్టే'కు మంచి స్పందన వచ్చింది. స్పాటిఫై, యూట్యూబ్, సౌండ్‌క్లౌడ్‌లో ఆమె పాటలు ఎంతో ఆదరణ పొందాయి. ఇరవై సంవత్సరాల వయసులో సెవెన్ ఐలాండ్ ఫిల్మ్‌ఫెస్టివల్, కోవ్లాంగ్ పాయింట్ సర్ఫ్ అండ్ మ్యూజిక్ ఫెస్టివల్‌లాంటి ఎన్నో ఫెస్టివల్స్‌లో తన గాత్రాన్ని వినిపించింది వర్షిత. ఏఆర్‌రెహమాన్ మ్యూజిక్ ట్రూప్‌లో భాగంగా దేశవిదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చింది. 22 సంవత్సరాల వర్షిత పాటలు పాడడంలోనే కాదు రాయడంలో కూడా ప్రతిభ చూపుతుంది.

వర్షిత పాటల్లో ఎంత మాధుర్యం ఉంటుందో, మాటల్లో అంత ఆత్మవిశ్వాసం కనిపిస్తుంది. వ్యక్తిత్వ వికాస కోణంలో ఎన్నో కళాశాలల్లో స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసాలు ఇచ్చింది.

● ఇంగ్లిష్ ఇడియమ్స్



బాధ, నిరాశనిస్పృహ....రకరకాల విచారకర సందర్భాల్లో ఉపయోగించే ఇడియమ్ ఫీల్ బ్లూ. **ఉదా:** ఐ ఫీల్ బ్లూ ఎవ్రీ టైమ్ ఐ థింక్ ఎబౌట్ దట్ టైమ్. ఇట్ మేక్స్ మీ సో ఆంగ్రీ ఆల్‌సో **ఇక దీని మూలాల్లోకి వెళితే...** 1785లో ప్రచురితమైన 'ఏ క్లాసిక్ డిక్షనరీ'లో ఈ ఎక్స్‌ప్రెషన్ కనిపిస్తుంది. కలవరపాటు, అసంతృప్తి, భయం మొదలైన సందర్భాల్లో 'ఫీల్ బ్లూ' అనే మాటను ఆ కాలంలో ఉపయోగించేవారు. అయితే 1800లో దీన్ని వైద్యరంగంలో ఉపయోగించేవారు.పేషెంట్ చనిపోయే స్థితిలో ఉన్నప్పుడు 'బ్లూ' కలర్‌ను ప్రతీకాత్మకంగా ప్రదర్శించేవారు. అలా బ్లూ కలర్ అనేది విషాదానికి సింబల్‌గా మారింది.

● గేమింగ్ : నేడే విడుదల

టెరిఫిక్ టైగర్

యాక్షన్-రోల్ ప్లేయింగ్ గేమ్ 'వో లాంగ్ ఫాలెన్ డైనెస్టీ' నేడు విడుదల అవుతుంది. గేమ్ ప్రారంభంలో ప్లేయర్స్ అయిదు రకాల క్యారెక్టర్స్ నుంచి తమ సొంత అవతార్‌ను సృష్టించుకోవాలి. ఈ గేమ్‌లో శత్రువులపై చేసే క్లోజ్‌డ్ రేంజ్ ఎటాక్స్ కోసం రెండు ఆప్షన్స్ ఉంటాయి. శత్రువును బలహీన పరచడానికి దైవికశక్తులు ఉన్న రెక్కల గుర్రం, వైట్ టైగర్, డ్రాగన్...మొదలైన జంతువులను ఎంపిక చేసుకోవచ్చు.

ఆయుధాల విషయానికి వస్తే...ఇనుప ఖడ్గం నుంచి అడ్డవిల్లు వరకు పదమూడు రకాల ఆయుధాలలో ఏదో ఒకటి ఎంచుకోవచ్చు. అయితే ఏ ఆయుధాన్ని ఎంచుకున్నాం అనేదానికంటే, ఎలా పోరాడారు అనేదే ముఖ్యం. ఒక్కరుగానే కాదు కోఆపరేటివ్ మల్టీప్లేయర్ మోడ్‌లోనూ ఈ గేమ్ ఆడవచ్చు.

ఒక సైనిక యోధుడు క్రూరమైన రాక్షసులు, జంతువులతో పోరాడడమే మూలకథ. రెక్కల గుర్రంతో, చేతిలో ఖడ్గంతో వీర విహారం చేస్తూ వచ్చిన ట్రైలర్ గేమ్‌పై ఎన్నో అంచనాలు పెంచింది.

జానర్: యాక్షన్-రోల్ ప్లేయింగ్ గేమ్/ హ్యాక్ అండ్ స్లాష్ **మోడ్స్:** సింగిల్ ప్లేయర్/ మల్టీ ప్లేయర్. **ప్లాట్‌ఫామ్స్:** ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్/ఎక్స్‌బాక్స్ ఎక్స్/ఎస్.




● అవును...ఇది నిజమే!



● ప్రాచీన రోమ్‌లో మార్చి నెలతో కొత్త సంవత్సరం మొదలయ్యేది. ఈ నెలలో రోమన్లు 'మార్స్ ఫెస్టివల్'ను ఘనంగా జరుపుకునేవారు. సంగీత కచేరిల నుంచి మల్లయుద్ధాల వరకు రకరకాల కార్యక్రమాలు నిర్వహించేవారు. మార్స్ (అంగారకుడు)ని వ్యవసాయం, యుద్ధానికి సంబంధించిన ఆరాధ్యదైవంగా భావించేవారు. పురవీధుల్లో అంగారకుడి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ఊరేగించేవారు. ● వాల్ట్ డిస్నీ ప్రొడక్షన్ 1812 నాటి జర్మన్ జానపద కథను తీసుకొని 'స్నో వైట్ అండ్ ది సెవెన్ డ్వార్ఫ్స్' (1937) చిత్రాన్ని తీసింది. ఏడుగురు మరుగుజ్జులకు ఒరిజనల్‌లో లేని పేర్లు పెట్టడానికి వందలాంది పేర్లు అనుకున్నారు. చివరికి జంపీ, డెఫీ, చెస్టీ, టుబ్బీ, గబ్బీ...మొదలైన పేర్లు పెట్టారు.


సినిమా



● మహేశ్‌బాబు

ఆర్మ్ డే

గురువారం మహేశ్‌బాబు కొత్త లుక్‌తో ఫ్యాన్స్‌ను సర్‌ప్రైజ్ చేశారు. జిమ్‌లోని తన ఫిటినెస్ ఫొటో షేర్ చేసి, ఫ్యాన్స్‌కి ట్రీట్ ఇచ్చారు. బైసెప్స్ వర్కవుట్ అనంతరం నరాలు కనిపిస్తున్న ఫొటో షేర్ చేసి, 'ఆర్మ్ డే' అని కాప్షన్ ఇచ్చారు మహేశ్. స్టన్నింగ్ న్యూ లుక్‌లో ఉన్న ఆయన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్నారు మహేశ్‌బాబు. ఈ చిత్రం తర్వాత రాజమౌళి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తారాయన. ఈ తాజా మేకోవర్ ఈ రెండు చిత్రాల కోసమే అని ఊహించవచ్చు.



● అల్లు అర్జున్

రజనీ@170



● రజనీకాంత్

రజనీకాంత్ 170వ సినిమా ఖరారైంది. రజనీ హీరోగా 'జై భీమ్' ఫేమ్ దర్శకుడు టీజే జ్ఞానవేల్ ఓ సినిమాను తెరకెక్కించనున్నారు. లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మించనున్నారు. గురువారం (మార్చి 2) సుభాస్కరన్ బర్త్ డే సందర్భంగా రజనీ 170వ సినిమాను ప్రకటించారు. '2.ఓ (2018)', 'దర్బార్' (2020) చిత్రాల తర్వాత రజనీకాంత్ హీరోగా లైకా ప్రొడక్షన్స్ సంస్థలో రూపొందనున్న మూడో సినిమా ఇది. వచ్చే ఏడాది ఈ చిత్రం విడుదల కానుంది. ఇక ఇదే సంస్థ రజనీ కుమార్తె ఐశ్వర్య దర్శకత్వంలో నిర్మిస్తున్న 'లాల్ సలామ్'లో రజనీ ఓ కీలక పాత్ర చేస్తున్నారు.

పఠాన్ ఆఫర్




● షారుక్

షారుక్ ఖాన్ టైటిల్ రోల్‌లో రూపొందిన చిత్రం 'పఠాన్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ చిత్రం జనవరి 25న విడుదలైంది. ఈ సినిమా రూ. వెయ్యి కోట్లు సాధించిన విషయం తెలిసిందే. ఈ రికార్డు సాధించే ముందు ప్రేక్షకులను థియేటర్స్‌కు రప్పించడానికి కొన్ని మల్టీప్లెక్స్‌లలో టికెట్ ధరలను తగ్గించింది చిత్ర యూనిట్. తాజాగా మళ్లీ 'పఠాన్' యూనిట్ టికెట్ పరంగా ఓ బంపర్ ఆఫర్ ఇచ్చింది. ''మార్చి 3 నుంచి 5 వరకు 'పఠాన్' టికెట్ ఒకటి కొంటే మరోటి ఉచితం. కొన్ని నియమ నిబంధనలతో ఈ ఆఫర్ ప్రేక్షకులకు అందిస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. కాగా నెట్ షేర్ విషయంలో హిందీ బాక్సాఫీస్ కలెక్షన్స్‌లో టాప్ ప్లేస్‌లో ఉన్న 'బాహుబలి: ది కన్‌క్లూజన్' రికార్డును అధిగమించడానికే 'పఠాన్' యూనిట్ ఇలా టికెట్ తగ్గించే ప్లాన్ వేసిందనే టాక్ వినిపిస్తోంది.

రానాతో వార్ అంత సులువు కాదు - వెంకటేష్

''సంక్లిష్టమైన పాత్రలు నన్ను ఆకర్షిస్తాయి. 'రానా నాయుడు'లో నేను చేసిన నాగనాయుడు అలాంటి పాత్రే. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నమైన వ్యక్తిత్వం ఉన్న పాత్రను పోషించడం సవాలుగా అనిపించినప్పటికీ సంతృప్తిని ఇచ్చింది'' అని హీరో వెంకటేష్ అన్నారు. కరణ్ అన్షుమాన్- సుపర్ణ్ ఎస్. వర్మ దర్శకత్వం వహించిన 'రానా నాయుడు' వెబ్ సిరీస్‌లో వెంకటేష్, రానా తొలిసారి కలిసి నటించారు. కరణ్ అన్షుమాన్ నిర్మించిన ఈ సిరీస్ ఈ నెల 10 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ- ''వెబ్ సిరీస్‌లో పని చేయడానికి, సినిమాలో చేయడానికి చాలా తేడా ఉంటుంది. వెబ్ సిరీస్‌లో కథ చెప్పే వేగం శైలికి అలవాటు పడటానికి నాకు కొంత సమయం పట్టింది. ఇందులో నెగిటివ్ పాత్రను పోషించడం నావరకూ రిఫ్రెషింగ్ చేంజ్. 'రానా నాయుడు'లో మునుపెన్నడూ చూడని పాత్రలో నన్ను చూస్తారు. రానాకి ఎదురుగా నిలబడి వార్ చేయడం అంత సులువు కాదు.. నటుడిగా నాకిది ఒక సవాల్. నిజ జీవితంలో మేం బాబాయ్ అబ్బాయ్‌లా కాకుండా స్నేహితుల్లా ఉంటాం. కానీ తెరపై ఒకరంటే ఒకరికి పడని తండ్రీ కొడుకులుగా వార్ ఈక్వేషన్ తీసుకురావడం కష్టం అనిపించింది. ఇది కచ్చితంగా మా ఇద్దరికీ కొత్త ప్రయత్నం'' అన్నారు.



● వెంకటేష్

తగ్గేదే లే

సోషల్ మీడియాలో ఫాలోయర్స్ విషయంలో ఏ మాత్రం తగ్గేదే లే అంటున్నారు అల్లు అర్జున్. ఇన్‌స్టాగ్రామ్‌లో అల్లు అర్జున్ ఫాలోయర్స్ జాబితా 20 మిలియన్స్ (2 కోట్లు)కు చేరింది. దక్షిణాదిన ఈ ఫీట్‌ను సాధించిన తొలి హీరో అల్లు అర్జున్ కావడం విశేషం. అయితే 'పుష్ప' తొలి భాగం రిలీజ్‌కు ముందు అల్లు అర్జున్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 12 మిలియన్ల ఫాలోయర్లు ఉంటే ఆ సినిమా విడుదల తర్వాత వచ్చిన పాన్ ఇండియా క్రేజ్‌తో 20 మిలియన్స్‌కు చేరుకుందని ఫ్యాన్స్ హ్యాపీ ఫీలవుతున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే... ప్రస్తుతం 'పుష్ప' మలి భాగం 'పుష్ప: ది రూల్'లో నటిస్తున్నారు అల్లు అర్జున్. ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఏప్రిల్ 8న అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ను రిలీజ్ చేసే ఆలోచనలో యూనిట్ ఉందట. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా 2024లో రిలీజ్ కానుంది.

సమాధానం అక్కడే వెతకాలి!



● సాయిధరమ్

సాయిధరమ్ తేజ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'విరూపాక్ష'. కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ హీరోయిన్. బాపినీడు .బి సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పీ, సుకుమార్ రైటింగ్స్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఏప్రిల్ 21న రిలీజ్ కానుంది. 'విరూపాక్ష' టీజర్‌ను పవన్ కల్యాణ్ రిలీజ్ చేశారు. 'ప్రశ్న ఎక్కడ మొదలైందో సమాధానం అక్కడే వెతకాలి, ప్రమాదాన్ని దాటడానికే నా ప్రయాణం' అని సాయిధరమ్ చెప్పే డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే: సుకుమార్, కెమెరా: శ్యామ్‌దత్ సైనుద్దీన్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: సతీష్ బీకేఆర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అశోక్ బండ్రెడ్డి.

బేబీతో ఎంట్రీ



● ఆర్య దయాళ్

మలయాళంలో గాయనిగా మంచి పేరు తెచ్చుకున్న ఆర్య దయాళ్ 'బేబీ' సినిమాతో తెలుగుకి పరిచయమవుతున్నారు. ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'బేబీ'. సాయి రాజేశ్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమాలోని 'ఓ రెండు ప్రేమ మేఘాలిలా' పాట పాడారు ఆర్య దయాళ్. ''విజయ్ బుల్గానిన్ సంగీతం అందించిన ఈ పాటకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఆర్య పాడిన తొలి తెలుగు పాట ఇదే కావడం విశేషం'' అన్నారు ఎస్‌కేఎన్. ''ఈ పాట ఇప్పటివరకూ అన్ని డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో 2 కోట్ల వ్యూస్ సంపాదించింది'' అన్నారు సాయి రాజేశ్.


గ్రంథాలయంలో యాక్షన్



● విన్ను, స్మిరిత

విన్ను మద్దిపాటి, స్మిరిత రాణి బోర జంటగా నటించిన చిత్రం 'గ్రంథాలయం'. సాయిశివన్ జంపాన దర్శకత్వంలో ఎస్. వైష్ణవి శ్రీ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా సాయిశివన్ మాట్లాడుతూ- ''సూపర్ యాక్షన్ థ్రిల్లర్‌గా వస్తున్న సినిమా ఇది'' అన్నారు. ''అందరూ కుటుంబంతో కలిసి 'గ్రంథాలయం' చూసి హిట్ చేయాలి'' అని విన్ను మద్దిపాటి అన్నారు. నిర్మాత అయ్యప్ప అల్లంనేని మాట్లాడారు.

ఫోన్ గేమ్ నేపథ్యంలో...



● సత్య ఎస్‌కే, హేమరాజ్

సత్య ఎస్‌కే, నవీన్ నేని, ప్రణీత పట్నాయక్, చందన రాజ్, ప్రవీణ్ రెడ్డి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'రిచిగాడి పెళ్లి'. కేఎస్ హేమ రాజ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శక-నిర్మాత హేమరాజ్ మాట్లాడుతూ- ''ఒక ఫోన్ గేమ్ ఆధారంగా తీసిన ఫీల్ గుడ్ ఎమోషనల్ డ్రామా 'రిచిగాడి పెళ్లి'. మా సినిమా ప్రీమియర్ షోకి చాలా మంచి స్పందన వచ్చింది'' అన్నారు.

కస్టడీలో రాజు



● అరవింద్ స్వామి

చెరసాలలో ఉన్నారు అరవింద్ స్వామి. ఎందుకంటే 'కస్టడీ' సినిమా కోసం. అక్కినేని నాగచైతన్య, కృతీ శెట్టి జంటగా వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన చిత్రం 'కస్టడీ'. ఈ చిత్రం షూటింగ్ ఇటీవలే పూర్తయింది. సినిమాలోని కీలక తారాగణం లుక్స్‌ని విడుదల చేస్తున్న యూనిట్ గురువారం అరవింద్ స్వామి లుక్‌ని విడుదల చేసింది. ఇందులో రాజు అలియాస్ రాజు అనే పాత్రలో కనిపించనున్నారు అరవింద్ స్వామి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ మే 12న రిలీజ్ కానుంది.

రెండు రోజుల క్రితం గుండెపోటు

● ఇప్పుడంతా బాగానే ఉంది



● తండ్రి సుబీర్‌తో సుస్మిత

మాజీ విశ్వసుందరి, నటి సుస్మితా సేన్ గురువారం ఒక షాకింగ్ న్యూస్‌ని బయటపెట్టారు. సోషల్ మీడియా వేదికగా ఈ వార్తను పంచుకున్నారామె. ''నీ హృదయాన్ని ఎప్పుడూ సంతోషంగా, ధైర్యంగా ఉండనివ్వు. నీ కష్టకాలంలో, నీకు అవసరమైన సమయంలో అది నీకు అండగా ఉంటుంది' అని మా నాన్న సుబీర్ సేన్ చెప్పిన విలువైన మాటలివి. రెండు రోజుల క్రితం నేను గుండెపోటుకు గురయ్యాను. వైద్యులు యాంజియోప్లాస్టీ చేశారు. స్టంట్ వేశారు. ఇంకో ముఖ్యమైన విషయం ఏంటంటే... నా కార్డియాలజిస్ట్ నా గుండె చాలా గట్టిదన్నట్లుగా చెప్పారు. అలాగే చాలామంది నా ఆరోగ్యం గురించి ఆందోళన చెందారు. ఈ విషయం గురించి మరొక పోస్ట్‌లో ప్రస్తావిస్తాను. ఇక నా ఆరోగ్యం బాగానే ఉందని చెప్పడానికి ఈ విషయాలను షేర్ చేస్తున్నాను. ప్రస్తుతానికి ఆల్ ఈజ్ వెల్. కొత్త జీవితం గడిపేందుకు నాకు అవకాశం లభించింది'' అని ఓ పోస్ట్‌ను షేర్ చేశారు సుస్మితా సేన్. ఈ వార్త తెలియగానే పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు సుస్మిత త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా వేదికగా స్పందించారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
3-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	502	58,909
నిఫ్టీ ▽	129	17,322

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,341	▽	38
డోజోన్స్	32,798	△	136
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,944	△	21
డాక్స్	15,328	△	23
షాంఘై	3,311	▽	1
నికాయ్	27,498	▽	18

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	56,087	▽	53
బంగారం (22 క్యారెట్)	55,863	▽	52
వెండి (కేజీ)	63,706	▽	540

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.82	83.40
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	97.60	100.88
€	యూరో	ఎస్‌బీఐ	86.47	89.56
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.66	61.59
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.65	57.00
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.47	62.44
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.03	22.70
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.59	23.38
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.84	12.91

అర్షద్ వార్సీపై సెబీ నిషేధం

- మరో 44 మంది వ్యక్తులు, సంస్థలకు షాక్
- జాబితాలో మారియా గోరెట్టి



న్యూఢిల్లీ: యూట్యూబ్ చానళ్ల ద్వారా రెండు కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా ప్రభావితం చేసిన కేసులో నటుడు అర్షద్ వార్సీసహా 44 మంది వ్యక్తులు, సంస్థలపై క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిషేధ అస్త్రాన్ని ప్రయోగించింది. తప్పుడు వీడియోలను అప్‌లోడ్ చేయడం ద్వారా షేర్ల ధరల అవకతవకలకు పాల్పడిన కేసులో అర్షద్ భార్య మారియా గోరెట్టిసహా ఇతర వ్యక్తులు, సంస్థలను తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకూ క్యాపిటల్ మార్కెట్ల నుంచి నిషేధించింది. దీంతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సెక్యూరిటీల కొనుగోలు, అమ్మకం లేదా ఏ ఇతర లావాదేవీలు చేపట్టేందుకు వీలుండదు. అంతేకాకుండా వీరంతా ఎలాంటి ఆస్తులనూ విక్రయించేందుకు అనుమతించరు. బ్యాంక్ ఖాతాలలోని సొమ్ముసహా ఎలాంటి ఆస్తులనూ వినియోగించేందుకు వీలుండదు. ఎస్క్రో ఖాతాలో నిర్ధారించిన సొమ్మును జమ చేసేందుకు మాత్రమే సెబీ అనుమతిస్తుంది.

కేసు వివరాలు..: సాధనా బ్రాడ్‌క్యాస్ట్ లిమిటెడ్, షార్ప్‌లైన్ బ్రాడ్‌క్యాస్ట్ లిమిటెడ్‌లపై యూట్యూబ్ చానళ్లలో తప్పుదారి పట్టించే వీడియోలు అప్‌లోడ్ చేయడంతోపాటు.. షేర్లు కొనుగోలు చేయమంటూ ఇన్వెస్టర్లకు సిఫారసులు చేయడంపై సెబీ కేసులు నమోదు చేసింది. వీటి ద్వారా అక్రమంగా రూ. 54 కోట్లు ఆర్జించినట్లు గుర్తించింది. ఈ కేసులలో అర్షద్, మారియాసహా.. సాధనా బ్రాడ్‌క్యాస్ట్ ప్రమోటర్లలో కొంతమందిపై సైతం నిషేధం విధిస్తూ సెబీ రెండు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. తప్పుదారి పట్టించే వీడియోలు, షేర్ల కొనుగోలుకి అక్రమ సిఫారసులపై ఆరోపణలు రావడంతో సెబీ 2022 ఏప్రిల్– సెప్టెంబర్ మధ్య విచారణను చేపట్టింది. వెరసి 2022 ఏప్రిల్– జూలై మధ్య కాలంలో షేర్ల ధరల కదలికల్లో అక్రమాలను గుర్తించింది.

చేతక్.. 'ప్రీమియం 2023'

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం బజాజ్ ఆటో తాజాగా చేతక్ ప్రీమియం 2023 ఎడిషన్‌ను ఆవిష్కరించింది. హైదరాబాద్ ఎక్స్‌షోరూంలో ధర రూ.1,51,217 ఉంది. మ్యాట్ కరీబియన్ బ్లూ, మ్యాట్ కోర్స్ గ్రే, సాటిన్ బ్లాక్ రంగుల్లో లభిస్తుంది. ఒకసారి చార్జింగ్‌తో 90 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. గరిష్ట వేగం గంటకు 63 కిలోమీటర్లు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మోడల్ ధర రూ.1,21,712 ఉంది. విడిభాగాల సరఫరా వ్యవస్థను పునర్నిర్మించామని, ముఖ్య విక్రేతలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో గణనీయమైన పురోగతిని సాధించామని కంపెనీ తెలిపింది. దీంతో నెలకు 10,000 యూనిట్లకు పైగా చేతక్ లభ్యతకు హామీ లభించడమేగాక మరింత మంది కస్టమర్లకు అందుబాటులో ఉండేలా ఖర్చులను తగ్గించిందని వెల్లడించింది. బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. డెలివరీలు ఏప్రిల్ నుంచి ఉంటాయి.



షేర్ల విక్రయంతో అదానీకి నిధులు

- 4 కంపెనీలలో స్వల్ప వాటాలు
- రూ. 15,446 కోట్లు సమీకరణ

న్యూఢిల్లీ: లిస్టెడ్ కంపెనీలు నాలుగింటిలో స్వల్పంగా వాటాలు విక్రయించినట్లు ప్రయివేట్ రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ తాజాగా పేర్కొంది. తద్వారా 1.87 బిలియన్ డాలర్లు(రూ. 15,446 కోట్లు) సమకూర్చుకున్నట్లు వెల్లడించింది. అమెరికా ఈక్విటీ పెట్టుబడుల కంపెనీ జీక్యూజీ పార్టనర్స్‌కు షేర్లను విక్రయించినట్లు తెలియజేసింది. సెకండరీ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా అదానీ ఎంటర్‌ప్రైజెస్(ఏఈఎల్), అదానీ పోర్ట్స్ అండ్ సెజ్(ఏపీసెజ్), అదానీ గ్రీన్ ఎనర్జీ(ఏజీఈఎల్), అదానీ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్(ఏటీఎల్)లకు చెందిన మైనారిటీ వాటాలను విక్రయించినట్లు అదానీ గ్రూప్ ఒక ప్రకటనలో పేర్కొంది. దేశీ మౌలిక సదుపాయాల రంగ అభివృద్ధి, విస్తరణలో కీలక పెట్టుబడిదారుగా అదానీ గ్రూప్ కంపెనీలలో జీక్యూజీ ఇన్వెస్ట్ చేసినట్లు తెలియజేసింది. రానున్న నెలల్లో 2 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 16,500 కోట్లు) రుణ చెల్లింపులు చేపట్టవలసి ఉన్న నేపథ్యంలో వాటాల విక్రయం ప్రాధాన్యతను సంతరించుకుంది. గ్రూప్ మొత్తం రూ. 2.21 లక్షల కోట్ల రుణ భారాన్ని కలిగి ఉంది. దీనిలో వచ్చే ఆర్థిక సంవత్సరం(2023–24)లోగా 8 శాతం రుణాలను తిరిగి చెల్లించవలసి ఉంది.



ప్రమోటర్ల వాటా ఇలా

అదానీ గ్రూప్‌లోని ప్రధాన కంపెనీలు ఏఈఎల్‌లో ప్రమోటర్లకు 72.6 శాతం వాటా ఉంది. దీనిలో తాజాగా 3.39 శాతం వాటాకు సమానమైన 3.8 కోట్ల షేర్లను జీక్యూజీకి విక్రయించింది. తద్వారా రూ. 5,460 కోట్లు లభించాయి. ఇక ఏపీసెజ్‌లో గల 66% వాటాలో 4.1% వాటాను విక్రయించింది. 8.8 కోట్ల షేర్లకుగాను రూ. 5,282 కోట్లు పొందింది. ఈ బాటలో ఏటీఎల్‌లో 73.9% వాటా కలిగిన అదానీ గ్రూప్ 2.5% వాటాకు సమానమైన 2.8 కోట్ల షేర్లను అమ్మింది. రూ. 1,898 కోట్లు అందుకుంది. ఏజీఈఎల్‌లో గల 60.5% వాటాలో 3.5% వాటాను విక్రయించింది. 5.5 కోట్ల షేర్ల ద్వారా రూ. 2,806 కోట్లు లభించాయి. ఈ లావాదేవీలకు జెఫరీస్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ బ్రోకర్‌గా వ్యవహరించింది. కాగా.. అదానీ గ్రూప్ కంపెనీలలో ఇన్వెస్ట్ చేసినందుకు ఉత్సాహపడుతున్నట్లు జీక్యూజీ పార్టనర్స్ చైర్మన్, సీఐవో రాజీవ్ జైన్ తెలిపారు. దేశీయంగా, ప్రపంచవ్యాప్తంగా అదానీ కంపెనీలు భారీస్థాయిలో, కీలక మౌలిక సదుపాయాల ఆస్తులను కలిగి ఉండటంతోపాటు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ ఆయన తరం ఉత్తమ వ్యాపారవేత్తలలో ఒకరిగా గుర్తింపు పొందినట్లు ప్రస్తావించారు.

అతిపెద్ద 5జీ ఆపరేటర్‌గా జియో!

బార్సిలోనా: సరసమైన సేవలతో ప్రపంచంలోనే అతిపెద్ద 5జీ (స్టాండలోన్) నెట్‌వర్క్ ఆపరేటర్‌గా ఈ ఏడాది జియో అవతరిస్తుందని సంస్థ తెలిపింది. రెండవ అర్ధ భాగంగా ఈ ఘనతను సాధిస్తామని రిలయన్స్ జియో ప్రెసిడెంట్ మాథ్యూ ఊమెన్ మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ సందర్భంగా వెల్లడించారు. 'అన్ని అధునాతన సేవలు, సామర్థ్యాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా కంపెనీ చూస్తుంది. భారత్‌కు సమ్మిళిత వృద్ధి అవసరం. ఈ విషయంలో జియో మద్దతునిస్తూనే ఉంటుంది' అని చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-3-2023	
విశాఖ	415–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415–00
విజయవాడ	415–00
రిటైల్ ధర (డజను)	66.00
2-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	390–00
వరంగల్	392–00
రిటైల్ ధర	4.50

మార్కెట్‌కు మళ్లీ నష్టాలు

- లాభాలు ఒకరోజుకే పరిమితం
- ట్రేడింగ్ ఆద్యంతం నష్టాలే
- సెన్సెక్స్ నష్టం 502 పాయింట్లు
- ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు



ముంబై: స్టాక్ సూచీల లాభాలు ఒకరోజుకు పరిమితమయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, ప్రపంచ మార్కెట్లలోని ప్రతికూలతలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఐటీ, బ్యాంకింగ్, ఆటో, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో సెన్సెక్స్ 502 పాయింట్లు పతనమై 58,909 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 129 పాయింట్లు క్షీణించి 17,322 వద్ద నిలిచింది. నష్టాల మార్కెట్లోనూ ఇంధన, యుటిలిటీ, ఆయిల్‌అండ్‌గ్యాస్, విద్యుత్, రియల్టీ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఉదయం సూచీలు బలహీనంగా మొదలయ్యాయి. ఏ దశలోనూ కొనుగోళ్ల మద్దతు లభించకపోవడంతో ట్రేడింగ్ ఆద్యంతం నష్టాల్లో కదలాడాయి. సెన్సెక్స్ 545 పాయింట్లు నష్టపోయి 59,411 వద్ద, నిఫ్టీ 145 పాయింట్లు క్షీణించి 17,306 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.12,771 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,129 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 11 పైసలు క్షీణించి 82.60 స్థాయి వద్ద స్థిరపడింది. అధిక ద్రవ్యోల్బణం మరికొంత కాలం కొనసాగొచ్చనే ఆందోళనల మధ్య వడ్డీరేట్లు మరింత పెరుగుతాయనే భయాలతో ప్రపంచ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

''అమెరికాలో ద్రవ్యోల్బణం కొనసాగొచ్చని ఇటీవల విడుదలైన ఆ దేశపు స్థూల ఆర్థిక డేటా సూచించడంతో పదేళ్ల బాండ్లపై రాబడి నాలుగు శాతం మించి నమోదైంది. ఫలితంగా ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లోకి మళ్లాయి. బాండ్లపై రాబడులు పెరగడంతో భారత్ వంటి వర్ధమాన దేశాల నుంచి పెట్టుబడులు తరలిపోతున్నాయి. ఎఫ్ఐఐలు వరుసగా ఆరో ట్రేడింగ్ సెషన్లలో నికర విక్రయదారులుగా నిలిచారు. లార్జ్ క్యాప్ షేర్లతో పోలిస్తే చిన్న, మధ్య తరహా షేర్లలో విక్రయాలు తక్కువగా ఉండటం కలిసొచ్చే అంశంగా ఉంది'' అని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

అదానీ షేర్లలో రెండోరోజూ ర్యాలీ

అదానీ గ్రూప్ తన లిస్టెడ్ కంపెనీలు నాలుగింటిలో స్వల్పంగా వాటాలు విక్రయించి రూ.15,446 కోట్లు సమకూర్చుకోవడంతో ఈ గ్రూప్ షేర్లలో రెండోరోజూ ర్యాలీ కొనసాగింది. మరోవైపు హిండెన్‌బర్గ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కమిటీ నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ గ్రీన్, అదానీ పవర్, అదానీ విల్మార్, ఎన్‌డీటీవీ, అదానీ టోటల్ గ్యాస్ షేర్లు ఐదు శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. అదానీ పోర్ట్స్ 3.5%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 3%, ఏసీసీ సిమెంట్స్ ఒకటిన్నర శాతం పెరిగాయి. గత రెండురోజుల్లో రూ.70,302 కోట్ల సంపద సృష్టి జరిగడంతో గ్రూప్ కంపెనీల మొత్తం మార్కెట్ వ్యాల్యుయేషన్ రూ.7.86 లక్షల కోట్లకు చేరింది.

బీడీఎంఏ టెక్నాలజీ సెంటర్

హెటిరో రూ. కోటి సాయం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బల్క్ డ్రగ్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (బీడీఎంఏ) టెక్నాలజీ, ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. హైదరాబాద్ జీడిమెట్ల ఫార్మా క్లస్టర్‌లో 2023 ఏప్రిల్ నుంచి ఈ కేంద్రం కార్యరూపం దాల్చనుంది. టీఎస్ఐఐసీ ఒక ఎకరం స్థలాన్ని దీర్ఘకాలిక లీజు పద్ధతిన సమకూర్చింది. ఈ ఫెసిలిటీ కోసం హెటిరో గ్రూప్ రూ. కోటి ఆర్థిక సాయం అందించింది. ఇతర సంస్థలు సైతం ఆర్థిక సాయానికి ముందుకు వస్తాయని అసోసియేషన్ భావిస్తోంది. ఔషధ రంగంలో పనిచేస్తున్న మానవ వనరులకు నైపుణ్యం పెంపొందించేందుకు ఈ సెంటర్‌లో శిక్షణ ఇస్తారు. అలాగే బీడీఎంఏ సభ్య కంపెనీలు నూతనంగా నియమించుకున్న ఉద్యోగులకు ఇక్కడ ట్రైనింగ్ కల్పిస్తారు. ఆధునిక పరిశోధన, పరీక్షలకు కేంద్ర స్థానంగా ఇది నిలుస్తుందని బీడీఎంఏ తెలిపింది. పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘం ఈ విధంగా సాంకేతిక, శిక్షణ కేంద్రం నెలకొల్పడం దేశంలో తొలిసారి అని పేర్కొంది. ఈ సదుపాయం ప్రపంచవ్యాప్తంగా ఫార్మా రంగంలో వస్తున్న నూతన పరిశోధనలు, ఆవిష్కరణలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు సామర్థ్యం పెంచుకోవడానికి నాలెడ్జ్ సెంటర్‌గా కూడా పని చేస్తుందని అభిప్రాయపడింది.



హెటిరో గ్రూప్ చైర్మన్ బి.పార్థ సారథి రెడ్డి నుంచి రూ.1 కోటి చెక్‌ను అందుకుంటున్న బీడీఎంఏ ప్రతినిధులు ఆర్.కె.అగ్రవాల్, సీహెచ్ ఏపీ రామేశ్వర రావు

నాట్కో షేర్ల బైబ్యాక్!

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ నాట్కో ఫార్మా రూ.2 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనను డైరెక్టర్ల బోర్డు పరిశీలిస్తుందని గురువారం తెలిపింది. మార్చి 8న డైరెక్టర్ల బోర్డు ఈ మేరకు సమావేశం కానుందని కంపెనీ వెల్లడించింది. క్రితం ముగింపుతో పోలిస్తే నాట్కో షేరు ధర బీఎస్ఈలో గురువారం 2.78 శాతం ఎగసి రూ.553.60 వద్ద స్థిరపడింది.

క్వార్టర్స్‌లో సాకేత్-యూకీ జోడీ ఓటమి

దుబాయ్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ పోరాటం ముగిసింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాకేత్-యూకీ ద్వయం 2-6, 2-6తో లాయిడ్ గ్లాస్‌పూల్ (బ్రిటన్)-హ్యారీ హెలియోవారా (ఫిన్‌లాండ్) జోడీ చేతిలో పరాజయం పాలైంది. 58 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సాకేత్, యూకీ రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. నాలుగుసార్లు తమ సర్వీస్‌ను కోల్పోయిన భారత జోడీ ప్రత్యర్థి జంట సర్వీస్‌లో మూడుసార్లు బ్రేక్ పాయింట్ అవకాశాలను వదులుకుంది. క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించిన సాకేత్-యూకీ బాంబ్రీలకు 23,660 డాలర్ల (రూ. 19 లక్షల 52 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది. ఇదే టోర్నీలో రామ్‌కుమార్ (భారత్)-ఐజామ్ ఖురేషీ (పాకిస్తాన్) జోడీ తొలి రౌండ్‌లో 4-6, 6-3, 5-10తో సాండెర్ జిలె-విలెజిన్ (బెల్జియం) ద్వయం చేతిలో ఓడిపోయింది.



'లయన్' పంజా

మన స్పిన్ కోటలో ప్రత్యర్థి బాగా పాగా వేసింది. మూడో టెస్టులో ఆస్ట్రేలియా పాచిక పారుతుంటే... ఆతిథ్య వేదికపై భారత్ వణుకుతోంది. రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌కంటే కాస్త ఎక్కువ స్కోరు చేసిందేమో కానీ... నాథన్ లయన్ (23.3–1–64–8) గర్జనకు తలవంచింది. వికెట్లు రాలిన తీరుతో భారత శిబిరం బిక్కమొహమేసింది. 76 పరుగుల అత్యల్ప లక్ష్యం ఆసీస్ ముందుండగా... మూడో రోజు తొలి సెషన్‌లోనే మూడో టెస్టు ముగిసే అవకాశముంది. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇప్పటి వరకు ఏ జట్టూ 76 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగి ఓడిపోయిన దాఖలాలు లేవు.

- 8 వికెట్లతో భారత్‌ను కుప్పకూల్చిన ఆస్ట్రేలియా స్పిన్నర్
- రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా 163 ఆలౌట్
- ఆస్ట్రేలియా విజయలక్ష్యం 76
- మూడు రోజుల్లోనే ముగియనున్న మూడో టెస్ట్



పుజారా



నాథన్ లయన్

ఇండోర్: ఈ సిరీస్‌లో స్పిన్‌తో గెలిచిన భారత్ ఇప్పుడదే స్పిన్‌కు ఉక్కిరిబిక్కిరవుతోంది. తిప్పేసే చోటే (పిచ్) బొక్కబోర్లా పడుతోంది. ఒక ఇన్నింగ్స్ అంటే ఏమో అనుకోవచ్చు... రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ మన పిచ్‌పై మన బ్యాటర్లు చేతులెత్తేశారు. దాంతో టీమిండియా పరాజయం అంచున నిలిచింది. మూడో టెస్టు కూడా మూడు రోజుల్లోనే ముగిసేందుకు సిద్ధమైంది. వికెట్ల పతనంలో రెండో రోజు (16 వికెట్లు) మొదటి రోజు (14)ను మించింది. మూడో రోజు పర్యాటక ఆస్ట్రేలియా ముందు కేవలం 76 పరుగుల లక్ష్యమే ముందుండగా... స్పిన్ బంతులు బొంగరంలా తిరుగుతున్న పిచ్‌పై భారత్‌లో ఏ మూలనో ఆశలు రేపుతోంది. 75 పరుగుల్లోపే 10 వికెట్లు తీస్తే మాత్రం ఈ మ్యాచ్‌లో స్పిన్నర్లు కాదు పిచ్‌నే 'టర్నింగ్' విన్నర్ అవుతుంది. రెండో రోజు ఆటలో ముందుగా ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 76.3 ఓవర్లలో 197 పరుగుల వద్ద ముగిసింది. పర్యాటక జట్టుకు 88 పరుగుల ఆధిక్యం లభించగా... రెండో ఇన్నింగ్స్‌లో ఆతిథ్య భారత్ 60.3 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది.

11 పరుగులు... 6 వికెట్లు...

ఓవర్‌నైట్ స్కోరు 156/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా ఉదయం గంటకుపైగా బాగానే ఆడింది. హ్యాండ్స్‌కాంబ్ (19; 1 ఫోర్), కామెరాన్ గ్రీన్ (21; 2 ఫోర్లు) జోడీ 17 ఓవర్లపాటు భారత బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంది. ఐదో వికెట్‌కు 40 పరుగులు జోడించడంతో జట్టు స్కోరు 200 పరుగులు దాటేలా కనిపించింది. అయితే 186 పరుగుల వద్ద హ్యాండ్స్‌కాంబ్, మరుసటి ఓవర్లో గ్రీన్ అవుట్ కాగానే ఆసీస్ అనూహ్యంగా 11 పరుగుల వ్యవధిలోనే ఆరు వికెట్లను కోల్పోయింది. 200 స్కోరుకు ముందే 197 పరుగుల వద్దే ఆలౌటైంది. పేస్‌తో ఉమేశ్ (3/12), స్పిన్‌తో అశ్విన్ (3/44) రెచ్చిపోయారు. ఆరు వికెట్లను వీరిద్దరు పంచుకొని ప్రత్యర్థిని పడగొట్టేశారు.

లయన్ గర్జన

ఆస్ట్రేలియాను అద్భుతంగా కట్టడి చేయడంతో ఇక జాగ్రత్తగా ఆడితే ఈ మ్యాచ్‌లో భారత్ గట్టెక్కుతుందని అంతా భావించారు. కానీ భారత్ రెండో ఇన్నింగ్స్‌పై లయన్ గర్జనకు చక్కని ఫీల్డింగ్ కూడా తోడు కావడంతో ఆస్ట్రేలియానే పైచేయి సాధించింది. ఓపెనర్లు రోహిత్ (33 బంతుల్లో 12), శుబ్‌మన్ (15 బంతుల్లో 5)లకు ఒక్క బౌండరీ అయిన కొట్టే అవకాశం ఇవ్వకుండా లయన్ ఇద్దరి పని పట్టాడు. కోహ్లి (26 బంతుల్లో 12; 2 ఫోర్లు) వచ్చి ఫోర్లు కొడుతున్నాడులే అనే ఆనందాన్ని కునెమన్ దూరం చేశాడు. 54 పరుగులకే కీలకమైన 3 వికెట్లు పెవిలియన్‌లో కూర్చున్నాయి. ప్రధాన వికెట్లే లయన్ ఉచ్చులో పడినా... పుజారా (142 బంతుల్లో 59; 5 ఫోర్లు, 1 సిక్స్), శ్రేయస్ అయ్యర్ (27 బంతుల్లో 26; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) జోడీ ఉన్నంత సేపూ జట్టు ధీమాగానే ఉంది. స్టార్క్ బౌలింగ్‌లో ఖాజా కళ్లు చెదిరే క్యాచ్‌కు అయ్యర్ ఆట ముగియగా జట్టు పతనం మొదలైంది. శ్రీకర్ భరత్ (3) మళ్లీ నిరాశపరచగా... స్మిత్ అద్భుతమైన డైవింగ్ క్యాచ్‌కు పుజారా ఇన్నింగ్స్ కూడా ముగిసింది. అశ్విన్ (16; 2 ఫోర్లు), అక్షర్ (15 నాటౌట్; 1 సిక్స్) రెండంకెల స్కోర్లు చేశారు. లయన్ 8, స్టార్క్, కునెమన్ చెరో వికెట్ తీశారు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 109; **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** హెడ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జడేజా 9; ఖాజా (సి) గిల్ (బి) జడేజా 60; లబుషేన్ (బి) జడేజా 31; స్మిత్ (సి) భరత్ (బి) జడేజా 26; హ్యాండ్స్‌కాంబ్ (సి) అయ్యర్ (బి) అశ్విన్ 19; గ్రీన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఉమేశ్ 21; క్యారీ (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 3; స్టార్క్ (బి) ఉమేశ్ 1; లయన్ (బి) అశ్విన్ 5; మర్ఫీ (బి) ఉమేశ్ 0; కునెమన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 22; **మొత్తం (76.3 ఓవర్లలో ఆలౌట్) 197. వికెట్ల పతనం:** 1–12, **2–108, 3–125, 4–146, 5–186, 6–188, 7–**192, 8–196, 9–197, 10–197. **బౌలింగ్:** అశ్విన్ 20.3–4–44–3, జడేజా 32–8–78–4, అక్షర్ 13–1–33–0, ఉమేశ్ 5–0–12–3, సిరాజ్ 6–1–13–0. **భారత్ రెండో ఇన్నింగ్స్:** రోహిత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) లయన్ 12; గిల్ (బి) లయన్ 5; పుజారా (సి) స్మిత్ (బి) లయన్ 59; కోహ్లి (ఎల్బీడబ్ల్యూ) (బి) కునెమన్ 13; జడేజా (ఎల్బీడబ్ల్యూ) (బి) లయన్ 7; అయ్యర్ (సి) ఖాజా (బి) స్టార్క్ 26; భరత్ (బి) లయన్ 3; అశ్విన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) లయన్ 16; అక్షర్ (నాటౌట్) 15; ఉమేశ్ (సి) గ్రీన్ (బి) లయన్ 0; సిరాజ్ (బి) లయన్ 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (60.3 ఓవర్లలో ఆలౌట్) 163. వికెట్ల పతనం:** 1–15, 2–32, 3–54, 4–78, 5–113, 6–118, 7–140, 8–155, 9–155, 10–163. **బౌలింగ్:** స్టార్క్ 7–1–14–1, కునెమన్ 16–2–60–1, నాథన్ లయన్ 23.3–1–64–8, మర్ఫీ 14–6–18–0.

ఉత్తమ మహిళా చెస్ జట్టుగా భారత్

ఆసియా చెస్ సమాఖ్య అవార్డులు

అబుదాబి: ఆసియా చెస్ సమాఖ్య (ఏసీఎఫ్) 2022 వార్షిక అవార్డులను ప్రకటించారు. ఉత్తమ మహిళా చెస్ జట్టుగా భారత్‌కు పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలి, తానియా సచ్‌దేవ్, భక్తి కులకర్ణిలతో కూడిన భారత జట్టు గత ఏడాది సొంతగడ్డపై తొలిసారి జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో మహిళల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించింది. ఈ ప్రదర్శనకుగాను ఏసీఎఫ్ ఉత్తమ జట్టు అవార్డు హంపి బృందానికి దక్కింది. భారత్‌కే చెందిన యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారం గెల్చుకున్నాడు. గత చెస్ ఒలింపియాడ్‌లో తమిళనాడుకు చెందిన గుకేశ్ అత్యధికంగా తొమ్మిది పాయింట్లు స్కోరు చేసి స్వర్ణ పతకాన్ని సాధించాడు. గత ఏడాది మార్చిలో గుకేశ్ 2700 ఎలో రేటింగ్‌ను దాటి ఈ ఘనత సాధించిన ఆరో భారతీయ చెస్ ప్లేయర్‌గా నిలిచాడు.



ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా మెగ్ లానింగ్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఆస్ట్రేలియా క్రికెటర్ మెగ్ లానింగ్ కెప్టెన్‌గా... భారత జట్టు సభ్యురాలు జెమీమా రోడ్రిగ్స్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. ముంబై వేదికగా డబ్ల్యూపీఎల్ తొలి సీజన్ రేపు ప్రారంభంకానుంది. 30 ఏళ్ల మెగ్ లానింగ్ తన సారథ్యంలో గతవారం దక్షిణాఫ్రికాలో జరిగిన మహిళల టి20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాను విశ్వవిజేతగా నిలబెట్టింది. ఐదు జట్లతో కూడిన డబ్ల్యూపీఎల్‌లో మూడు జట్లకు (గుజరాత్ జెయింట్స్–బెత్ మూనీ; యూపీ వారియర్స్–అలీసా హీలీ; ఢిల్లీ క్యాపిటల్స్–మెగ్ లానింగ్) ఆస్ట్రేలియా క్రికెటర్లు... రెండు జట్లకు భారత క్రికెటర్లు (ముంబై ఇండియన్స్–హర్మన్‌ప్రీత్ కౌర్; రాయల్ చాలెంజర్స్ బెంగళూరు–స్మృతి మంధాన) కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు.



దక్షిణాఫ్రికా విజయం



రబడ

సెంచూరియన్: వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో దక్షిణాఫ్రికా జట్టు 87 పరుగుల తేడాతో గెలిచి రెండు టెస్టుల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మ్యాచ్ మూడో రోజు 247 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 41 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబడ (6/50) విండీస్‌ను దెబ్బ తీశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 49/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 28 ఓవర్లలో 116 పరుగులకే కుప్పకూలింది. కీమర్ రోచ్ (5/47), అల్జారి జోసెఫ్ (2/30), జేసన్ హోల్డర్ (2/7) దక్షిణాఫ్రికాను కట్టడి చేశారు. మూడో రోజు మొత్తం 16 వికెట్లు పడ్డాయి. రెండో టెస్ట్ ఈనెల 8 నుంచి జొహాన్నెస్‌బర్గ్‌లో జరుగుతుంది.

రెస్ట్ ఆఫ్ ఇండియా 484

గ్వాలియర్: రంజీ చాంపియన్ మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న ఇరానీ కప్ మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 121.3 ఓవర్లలో 484 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 381/3తో రెండో రోజు ఆట కొనసాగించిన రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు మరో 103 పరుగులు జోడించి మిగతా ఏడు వికెట్లు కోల్పోయింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన మధ్యప్రదేశ్ ఆట ముగిసే సమయానికి 3 వికెట్లకు 112 పరుగులు చేసింది.

మహిళలకూ ప్రొ కబడ్డీ లీగ్!

న్యూఢిల్లీ: పురుషుల ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) విజయవంతమైన నేపథ్యంలో... త్వరలోనే మహిళా కబడ్డీ క్రీడాకారిణిలకూ ప్రొ లీగ్‌ను నిర్వహించాలని నిర్వాహకులు భావిస్తున్నారు. 2016లో మూడు జట్లతో మహిళల చాలెంజ్ కబడ్డీ టోర్నీని నిర్వహించారు. ఈసారి మాత్రం ప్రత్యేక లీగ్ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నామని... అతి త్వరలో ఇది కార్యరూపం దాలుస్తుందని పీకేఎల్ కమిషనర్, మషాల్ స్పోర్ట్స్ సీఈఓ అనుపమ్ తెలిపారు.



అతిథులకు ఆంధ్రా రుచులు

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరయ్యే వారి కోసం ప్రత్యేక వంటకాలు
- బొమ్మిడాయిల పులుసు, గుంటూరు కోడికూర, రొయ్యల మసాలా
- ఉలవచారు.. మజ్జిగ పులుసు
- ద్రాక్ష పచ్చడి.. జున్ను



సాక్షి, విశాఖపట్నం: విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)కు దేశ, విదేశాల నుంచి వచ్చే అతిథుల కోసం నోరూరించే వంటకాలను సిద్ధం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాల వెజ్, నాన్‌వెజ్ రుచులను వీరికి అందించనున్నారు. తొలిరోజు శుక్రవారం మధ్యాహ్నం భోజనంలో బొమ్మిడాయిల పులుసు, గుంటూరు కోడి వేపుడు, రొయ్యల మసాలా, మటన్ కర్రీ, చికెన్ పలావ్, వెజ్ రకాల్లో మష్రూం, క్యాప్సికం కూర, ఆలూ గార్లిక్ ఫ్రై, కేబేజీ మటర్ ఫ్రై, వెజ్ పలావ్, రోటీ, కుల్చా, పన్నీర్ బటర్ మసాలా, మెంతికూర-కార్న్ రైస్, మిర్చి కా సలాన్, టమాటా పప్పు, బీట్‌రూట్ రసం, మజ్జిగ పులుసు, గోభీ ఆవకాయ, నెయ్యి, వడియాలు, ద్రాక్ష పండ్ల పచ్చడి, చల్ల మిర్చి ఉంటాయి. అలాగే కట్ ఫ్రూట్స్, ఐస్‌క్రీం, పేస్ట్రీ, కాలా జామున్, జున్ను చంద్రకాంతలు సిద్ధం చేస్తున్నారు.


రెండో రోజూ విశేషంగానే..

రెండో రోజు శనివారం లంచ్‌లో రష్యన్ సలాడ్స్, వెజ్ సలాడ్‌లతో పాటు రుమాలి రోటీ, బటర్ నాన్ ఇస్తారు. నాన్ వెజ్ రకాల్లో ఆంధ్రా చికెన్ కర్రీ, చేప ఫ్రై, గోంగూర, రొయ్యల కూర, ఎగ్ మసాలా, మటన్ పలావ్.. వెజ్ ఐటమ్స్‌లో వెజ్ బిర్యానీ, కరివేపాకు రైస్, కడాయ్ పన్నీరు కూర, క్యారెట్ బీన్స్ కొబ్బరి ఫ్రై, వంకాయ మెంతి కారం, బెండకాయ-జీడిపప్పు ఫ్రై, పప్పుచారు, మిరియాల రసం, మజ్జిగ పులుసు, ఉలవచారు-క్రీం వంటివి ఉన్నాయి. ఇంకా కట్ ఫ్రూట్స్, ఐస్‌క్రీం, బ్రౌనీ, గులాబ్‌జామ్, అంగూర్ బాసుంది, డబుల్‌కా మీఠా ఇస్తారు. ఉదయం అల్పాహారంలో ఇడ్లీ, వడ, టమాటా బాత్, హాట్ పొంగల్, ఉదయం స్నాక్స్‌లో ప్లమ్ కేక్, డ్రై కేక్, వెజ్ బుల్లెట్, మఫిన్స్, స్ప్రింగ్ రోల్స్, సాయంత్రం స్నాక్స్‌లో కుకీస్, చీజ్ బాల్స్, డ్రై ఫ్రూట్ కేక్, ఫ్రూట్ కేక్, కట్ మిర్చి బజ్జీలు, టీ, కాఫీ ఉంటాయి.

122 ప్రాజెక్టులు.. రూ.21,050.86 కోట్లు

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రాష్ట్ర పర్యాటక వైభవం

- పెట్టుబడులకు ఒబెరాయ్, తాజ్, గ్యారీసన్ గ్రూప్స్ సిద్ధం
- కన్వెన్షన్ సెంటర్లు, స్టార్ హోటళ్లు, వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు
- 39 వేల మందికిపైగా ఉపాధి అవకాశాలు



జీఐఎస్ సదస్సు ఆవరణలో ఏర్పాటు చేసిన లోగో

సాక్షి, విశాఖపట్నం: ప్రకృతి ప్రసాదించిన సిరిసంపదలు.. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆధ్యాత్మిక కేంద్రాలు.. అబ్బురపరిచే పర్యాటక సోయగాలు.. దట్టమైన అడవులు.. కొండ కోనలు.. మన్యాలు.. సుందరమైన నదీతీరాలు.. అత్యంత సువిశాల సాగరతీరం .. ఇదీ ఆంధ్రప్రదేశ్ పర్యాటక వైభవం! సహజసిద్ధమైన అందాలతో స్వర్గధామంగా భాసిల్లుతున్న రాష్ట్ర పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు దేశ విదేశీ సంస్థలు సిద్ధమయ్యాయి. విశాఖ వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023లో పర్యాటక రంగంలో రూ.21,050 కోట్ల పెట్టుబడులతో ఏకంగా 122 ప్రాజెక్టులకు సంబంధించి ఎంవోయూలు కుదుర్చుకునేందుకు ముందుకొచ్చాయి. సీఎం వైఎస్ జగన్‌సమక్షంలో ఒప్పందాలు చేసుకుని ఏకంగా 39 వేల మందికిపైగా ఉపాధి అవకాశాలు కల్పించనున్నాయి.

- ప్రపంచవ్యాప్తంగా పర్యాటక ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్‌ను ప్రముఖ స్థానంలో నిలబెట్టాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు రూపకల్పన జరుగుతోంది. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు ప్రతి జిల్లానూ పర్యాటక ఖిల్లాగా మార్చేందుకు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ వేదికగా మారుతోంది. ప్రతి జిల్లాలో ఒక ప్రాజెక్టు వచ్చేలా ఎంవోయూలు సిద్ధమయ్యాయి.
- పర్యాటకాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది. అందుబాటులో ఉన్న వనరులన్నింటినీ అందిపుచ్చుకొని అభివృద్ధి చేసే విధంగా ప్రాజెక్టులని సిద్ధం చేసింది. దీనికి సంబంధించి రోడ్‌షోలో మంచి స్పందన లభించింది. ఏపీలో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు విస్తృత అవకాశాలు ఉండటంతో పలు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. రూ.కోటి నుంచి రూ.1,350 కోట్ల వరకూ పెట్టుబడులు పెట్టేందుకు వివిధ ప్రాజెక్టులతో ముందుకొచ్చాయి. తాజ్‌గ్రూప్, ఒబెరాయ్, గ్యారీసన్ గ్రూప్స్, తులి హోటల్స్, మంజీరా గ్రూప్, డీఎక్స్ఎన్, టర్బో ఏవియేషన్, ఇండియన్ ఏసియన్, రివర్‌బే, పోలో టవర్స్, లాలూజీ అండ్ సన్స్, డ్రీమ్‌వ్యాలీ, సన్ గ్రూప్, విండ్ హెవెన్, ఆదిత్యా గేట్‌వే, సన్‌రే లాంటి ప్రముఖ సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి.



- కన్వెన్షన్ సెంటర్లు, స్టార్ హోటళ్లు, వాటర్ స్పోర్ట్స్, రిసార్టులు, సీ ప్లేన్ సర్వీసులు, వెల్‌నెస్ సెంటర్లు, మెగావీల్, అడ్వెంచర్, బీచ్ ఫ్రంట్ రిసార్టులు, వాటర్ థీమ్ పార్కులు, డిన్నర్ క్రూయిజ్, స్విమ్మింగ్ పూల్స్, కల్చరల్ విలేజ్‌లు, యాటింగ్, రెస్టోబార్, స్కైలాంజ్, రేసింగ్ ట్రాక్‌లు, కేబుల్‌కార్, గోల్ఫ్‌కోర్స్, సఫారీ టూరిజం .. ఇలా రూ.21050.86 కోట్లతో 39,022 మందికి ఉపాధి కల్పించేలా 122 ప్రాజెక్టులకు ఎంవోయూలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో 4వతేదీన భాగస్వామ్య ఒప్పందాలకు శ్రీకారం చుట్టేలా పర్యాటక శాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. పర్యాటకాభివృద్ధికి అపార అవకాశాలున్నా టీడీపీ హయాంలో ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టూ అమలు చేయలేదు. సమీక్షలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు మినహా కార్యాచరణ శూన్యం.

ఆత్మీయ అతిథులకు అటవీ ఉత్పత్తులు

- ప్రముఖుల కోసం 200 కిట్లను సిద్ధం చేసిన అధికారులు
- అరకు కాఫీ, గిరిజన తేనె, హెర్బల్ ఆయిల్, పెయిన్ రిలీఫ్ ఆయిల్



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ఆర్థిక పురోభివృద్ధిలో కొత్త చరిత్ర సృష్టిస్తూ విశాఖ వేదికగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సందర్భంగా దేశ విదేశీ ప్రముఖులకు ఆత్మీయ ఆతిథ్యంతోపాటు మధుర స్మృతులను మిగిల్చే కానుకలు సిద్ధమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక జ్ఞాపికల కిట్స్‌తో పాటు గిరిజన సహకార సంస్థకు చెందిన ఉత్పత్తుల కిట్లను కూడా అందించనున్నారు. జీఐఎస్ సదస్సుకు దాదాపు 3 వేల మంది ప్రముఖులతో కలిపి మొత్తం 8 వేల మందికి పైగా ప్రతినిధులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరందరికీ కలకాలం గుర్తుండే ఆతిథ్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ జ్ఞాపకాల్ని తమతో మోసుకెళ్లేలా ప్రత్యేక కానుకలు అందించనున్నారు. స్వచ్ఛమైన ప్రేమను పంచే గిరిజనులు సేకరించిన కల్తీ లేని ఉత్పత్తులను కానుకగా ఇవ్వనున్నారు. నాణ్యమైన జీసీసీ ఉత్పత్తుల్ని దేశ విదేశీ ప్రముఖులకు పరిచయం చేయాలని సీఎం జగన్ నిర్ణయించినట్లు జీసీసీ ఛైర్‌పర్సన్ శోభా స్వాతి రాణి, జీసీసీ ఎండీ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ సమ్మిట్‌కు హాజరైన ప్రముఖులకు జీసీసీ గిఫ్ట్‌లను అందించనున్నారు. ఇందుకోసం 200 కిట్లను జీసీసీ సిద్ధం చేసింది. నాణ్యమైన తేనె, హెర్బల్ ఆయిల్, పెయిన్ రిలీఫ్ నుంచి అరకు కాఫీ వరకూ 12 రకాల జీసీసీ ఉత్పత్తులు ఈ కిట్లలో ఉంటాయి.

జీఐఎస్ సదస్సు తొలిరోజు ఇలా..

- కార్పొరేట్ దిగ్గజాల ప్రసంగాలు
- కేంద్ర మంత్రి గడ్కరీ, సీఎం వైఎస్ జగన్ కీలకోపన్యాసాలు
- వివిధ కంపెనీలతో ఎంవోయూలు
- ప్రముఖులకు సీఎం సన్మానాలు
- రాత్రి 8 గంటలకు వినూత్న రీతిలో డ్రోన్ షో



విదేశీ అతిథులకు స్వాగతం పలుకుతూ ఎయిర్‌పోర్ట్‌లో ఏర్పాటు చేసిన సంగీత కచేరీ

దొండపర్తి(విశాఖ దక్షిణ): ప్రతిష్టాత్మక గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు సర్వం సిద్ధమైంది. శుక్రవారం ఉదయం 9.45 గంటలకు అతిథుల ఆహ్వానం, పరిచయ కార్యక్రమంతో సదస్సు ప్రారంభం కానుంది. రేజర్ షో, మా తెలుగు తల్లికి.. గీతాలాపన, జ్యోతి ప్రజ్వలన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి ప్రారంభోపన్యాసం చేయనున్నారు. ఆ తర్వాత ఆడియో విజువల్ ప్రజెంటేషన్ ఉంటుంది. అనంతరం నాఫ్ సీఈఓ సుమిత్ బిదాని, భారత్ ఎఫ్ఐహెచ్ లిమిటెడ్ కంట్రీ హెడ్ అండ్ ఎండీ జోష్ ఫాల్గర్, టొరే ఇండస్ట్రీస్(ఇండియా)ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ మసహీరో హమగుచి, కియా ఇండియా నుంచి కబ్ డోంగి లీ, ది ఇండియా సిమెంట్స్ లిమిటెడ్ వైస్ ఛైర్మన్ అండ్ ఎండీ ఎన్.శ్రీనివాసన్, జేఎస్ డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ ప్రసంగిస్తారు. ఆ తర్వాత ఆడియో విజువల్ ప్రజెంటేషన్ ఉంటుంది. అనంతరం అపోలో హాస్పిటల్స్ వైస్ ఛైర్‌పర్సన్ ప్రీతిరెడ్డి, శ్రీ సిమెంట్ లిమిటెడ్ ఛైర్మన్ హరి మోహన్ బంగూర్, సెంచురీ ప్లైబోర్డ్స్ ఛైర్మన్ సజ్జన్ భజంకా, టెస్లా ఇంక్ కో ఫౌండర్ అండ్ మాజీ సీఈఓ మార్టిన్ ఎబర్‌హార్డ్, జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ ఛైర్మన్ నవీన్ జిందాల్ ప్రసంగిస్తారు. ఆ తర్వాత ఆడియో విజువల్ ప్రజెంటేషన్ అనంతరం జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ జి.ఎం.రావు, సయింట్ ఫౌండర్ ఛైర్మన్ బీవీ మోహన్‌రెడ్డి, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ కృష్ణ ఎం.ఎల్లా, దాల్మియా భారత్ గ్రూప్ ఎండీ పునీత్ దాల్మియా, రెనూ పవర్ సీఎండీ సుమంత్ సిన్హా ప్రసంగిస్తారు. ఆ తర్వాత ఆడియో విజువల్ ప్రజెంటేషన్ ఉంటుంది. అనంతరం ఒబెరాయ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అర్జున్ ఒబెరాయ్, సీఐఐ అధ్యక్షుడు సంజీవ్ బజాజ్, అదాని పోర్ట్స్ అండ్ ఎస్ఈజెడ్ లిమిటెడ్ సీఈఓ కరణ్ అదాని, ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ కె.ఎం.బిర్లా, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సీఎండీ ముఖేష్ అంబాని ప్రసంగిస్తారు. అనంతరం ఎంఓయూ కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఆ తర్వాత కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరి కీలక ఉపన్యాసం చేయనున్నారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారు. ఆ తర్వాత సీఎం ప్రముఖులను సన్మానిస్తారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.కరికాల వలవన్ వందన సమర్పణ చేస్తారు. ఆ తర్వాత ఎగ్జిబిషన్ ప్రారంభమవుతుంది.

4 ఆడిటోరియాల్లో సెషన్స్

మధ్యాహ్నం 3 గంటల నుంచి నాలుగు ఆడిటోరియాల్లో వివిధ విభాగాలకు సంబంధించిన సెషన్స్ జరగనున్నాయి. ఆడిటోరియం 1లో ఐటీ, 2లో ఇండస్ట్రియల్ అండ్ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, 3లో రెనెవబుల్ ఎనర్జీ అండ్ గ్రీన్ హైడ్రోజన్, 4లో యూనైటెడ్ అరబ్ ఎమిరేట్ కంట్రీ సెషన్ జరగనుంది. సాయంత్రం 4 గంటలకు ఆడిటోరియం 1లో ఆటోమోటివ్ ఎలక్ట్రిక్ మొబిలిటీ, 2లో స్టార్టప్స్ అండ్ ఇన్నోవేషన్, 3లో హెల్త్‌కేర్ అండ్ మెడికల్ ఎక్విప్‌మెంట్, 4లో ది నెదర్లాండ్స్ కంట్రీ సెషన్ ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు ఆడిటోరియం 1లో ఎలక్ట్రానిక్స్, 2లో అగ్రికల్చర్ అండ్ ఫుడ్ ప్రాసెసింగ్, 3లో ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్, 4లో ట్రాన్స్‌ఫర్మేటివ్ ఫుడ్ సిస్టమ్స్‌పై ప్రత్యేక హైలెవెల్ సెషన్ జరగనుంది. సాయంత్రం 6 గంటలకు కూచిపూడి కళా ప్రదర్శన, 8 గంటలకు డ్రోన్ షోతో తొలిరోజు సదస్సు ముగుస్తుంది.

అతిథులకు ఆత్మీయ స్వాగతం

సాక్షి, విశాఖపట్నం: గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023కి హాజరయ్యేందుకు దేశ విదేశీ ప్రతినిధులు విశాఖకు చేరుకుంటున్నారు. విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు వస్తున్న అతిథులకు రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సంప్రదాయ పద్ధతుల్లో స్వాగతం పలుకుతున్నారు. కూచిపూడి నృత్యం, వేణుగానం మధ్య పూలదండ వేసి తిలకం దిద్ది ఆత్మీయంగా వెల్‌కం చెబుతున్నారు. స్వాగతిస్తున్న తీరు పట్ల పారిశ్రామిక వేత్తలు మంత్రముగ్ధులవుతున్నారు.



విశాఖపట్నంలోని ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో సిద్ధమైన జీఐఎస్ వేదికలు



జీఐఎస్‌లో భాగంగా ఏర్పాటు చేసిన జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ స్టాల్



గ్రామ, వార్డు సచివాలయాల స్టాల్



ఆంధ్రప్రదేశ్ మారీటైం బోర్డు స్టాల్



ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ స్టాల్



సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జి-20 సభ్యదేశాల జాతీయ జెండాలు



హెచ్ఏఎల్ స్టాల్

మిల్లెట్స్‌తో మెరిసిన చిత్రాలు

చిరు ధాన్యాలతో ప్రధాని మోదీ, సీఎం జగన్, పారిశ్రామిక దిగ్గజాల చిత్రాలు



విశాఖ (ఏయూ క్యాంపస్): గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు పలువురి పారిశ్రామిక దిగ్గజాల ఛాయాచిత్రాలు ప్రత్యేకంగా ఆకర్షణగా నిలవనున్నాయి. ఇవన్నీ చిరుధాన్యాలతో తీర్చిదిద్దినవి కావడమే ఇక్కడ విశేషం. 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఈ నేపథ్యంలో చిరుధాన్యాలపై ప్రజల్లో ఆసక్తి, అవగాహన పెంచేందుకు విశాఖకు చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ విభిన్నంగా ఛాయాచిత్రాలను రూపొందించారు. భారతీయ రైల్వేలో టెక్నీషియన్-1గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన చిరుధాన్యాలతో దేశం గర్వించే నాయకులు, దిగ్గజ పారిశ్రామికవేత్తల చిత్రాలను తయారు చేశారు. జొన్నలు, గంట్లు, అరికలు, రాగులు, నల్ల నువ్వులు వంటి వాటితో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్తలు బిర్లా, అంబానీ, అదానీ, ఆనంద్ మహీంద్రా తదితరుల చిత్రాలను రూపొందించారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారిలకు గురువారం ఈ చిత్రాలను విజయ్‌కుమార్ చూపించారు. జీఐఎస్‌కు విచ్చేసే అతిథులు, ప్రముఖులకు వీటిని బహూకరించాలని కోరారు.

ఈసీ అనుమతితో కొత్త పారిశ్రామిక పాలసీ!

- పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న గుడివాడ అమర్‌నాథ్. పక్కన వైవీ సుబ్బారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్

సాక్షి, విశాఖపట్నం: ఎన్నికల సంఘం అనుమతిస్తే జీఐఎస్‌లో తొలిరోజే కొత్త పారిశ్రామిక పాలసీ 2023-28ని ప్రకటిస్తామని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారితే పక్షం రోజుల తర్వాత నూతన విధానాన్ని వెల్లడిస్తామని చెప్పారు. గురువారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. మనకున్న ఆర్థిక వనరులను దృష్టిలో ఉంచుకుని ఇతర రాష్ట్రాలకు దీటుగా, పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా పాలసీని రూపొందించాలని సీఎం వైఎస్ జగన్‌ఆదేశించారని తెలిపారు. విశ్వసనీయతతో కూడిన జగన్ నాయకత్వం పెట్టుబడిదారులకు సహకరిస్తుందన్న భరోసాను పారిశ్రామికవేత్తలకు కల్పించామన్నారు. పెట్టుబడులు పెట్టే వారికి అవసరమైన అన్ని అనుమతులు, భూములు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎంవోయూలను ఆరు నెలల్లోగా గ్రౌండ్ చేస్తే అదనపు సాయంతోపాటు పెట్టుబడుల ఆధారంగా ప్రోత్సాహకాలు ఇవ్వాలని సీఎం సూచించారని చెప్పారు. ఎంవోయూల్లో 90శాతం వాస్తవ రూపం దాల్చేలా చూస్తామన్నారు. పెట్టుబడుల కోసం వచ్చే ప్రతి అవకాశాన్ని సమీక్షిస్తామన్నారు. బ్రాండ్ జగన్ పేరిట పెట్టుబడులను ఆకర్షిస్తామన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పనే ఈ సదస్సు ఉద్దేశమని తెలిపారు. 150కి పైగా ఏర్పాటవుతున్న స్టాళ్లను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, సీఎం జగన్ ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకున్న అపార అవకాశాలపై 500 డ్రోన్లతో ప్రదర్శన నిర్వహిస్తామని చెప్పారు. సమ్మిట్‌కు 46 దేశాల ప్రముఖులు, 8 నుంచి 10మంది రాయబారులు వస్తున్నారని, వీరికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున శుక్రవారం రాత్రి విందు ఏర్పాటు చేశామన్నారు.

రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యం..

జీఐఎస్ ద్వారా రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా నిర్దేశించుకుని, 14 కీలక రంగాల్లో పెట్టుబడులపై దృష్టి సారించామని మంత్రి అమర్‌నాథ్ చెప్పారు. తొలిరోజు కొన్ని ఎంవోయూలు ఉంటాయన్నారు.

ఆదాయ వనరులు పెరిగేలా..

రాష్ట్రంలో సీఎం జగన్ ప్రభుత్వం సాధిస్తున్న పారిశ్రామిక ప్రగతితో జీఐఎస్ వేదికగా భారీ పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నట్లు టీటీడీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆదాయ వనరులు పెరిగేలా సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకుంటామని తెలిపారు. నెలన్నరగా అధికార యంత్రాంగం శ్రమించి జీఐఎస్ కోసం చక్కటి ఏర్పాట్లు చేసిందని అభినందించారు.

వనరులు పుష్కలం..

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అవసరమైన వనరులు పుష్కలంగా ఉన్నాయని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న రాయితీలతో పాటు కొత్త పారిశ్రామిక విధానం పెట్టుబడిదారులను ఆకర్షిస్తుందన్నారు. అడ్వాంటేజ్ జోన్ పేరుతో ప్రత్యేక విధానాలు అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. పెట్టుబడిదారుల సౌలభ్యం కోసం అర్హత ఉన్న కంపెనీలకు ఎస్‌జీఎస్‌టీలో రాయితీలిస్తామన్నారు. రాయితీలపై అన్ని రకాల నిబంధనలు, విధానాలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. సమ్మిట్‌లో వాస్తవ రూపం దాల్చే ఎంవోయూలకే ప్రాధాన్యం ఉంటుందని, టీడీపీ హయాంలో మాదిరిగా బూటకపు పెట్టుబడులుండవని పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943